C.G.V.P01Q194

వల్లూరి

H:- 8.4
W:- 5.4

# సమీక్ష


వ్యాస సంపుటి

CT

BLANK PAGE

# సమీక్ష

(వ్యాస సంపుటి)



dp

దీప్తి పబ్లికేషన్స్

I

# SAMIKSHA

(LITERARY ESSAYS)

By

**ELLORA**

---

First Edition : April 1982

© Rights Reserved by the Author

Price : Rs. **15/-**

Printed at : Padmavathi Art Printers, Hyderabad.

Cover printed at : Supreme arts Hyderabad-

Published by : DEEPTHI PUBLICATIONS
1-8-150/4, Chikkadpally, Hyderabad-20

---

Paper used for the Publication of this Book was made available by Govt. of Andhra Pradesh at Concessional Rate.



111

# Life

Ellora was born at Munganda village in the coconut-fringed picturesque konaseema where time is measured by the length of shadows, the canals snake placidly and nature bestows its bounty in full on September 19, 1930.

His parents Godavarthi Rama Murthy and Ramanamma were devout sanatanists. Ellora, then Bhaskara Rao, roamed about with Mother Nature as his teacher. The freedom movement attracted him but he was soon disillusioned. For sometime he worked as a Telugu vidwan. In 1951 he joined Andhra prabha where he still works.

Ellora edited 'Telugu Velugu' published on the occasion of the World Telugu Conference. He is founder and convenor of the literary forums Sahiti and Janapada Sahitya Akademi.

Several of Ellora's peoms were translated into Urdu, Hindi, Bengali and Tamil.

Ellora has written over 30 Books during the last two decades. They include many novels, poetry, folk and children's literature.

Ellora's book of poems Nissabda Tarangalu (Silent Waves), received the Andhra Pradesh Sahitya Akadamy award in 1977.

# On placid waters

The ninth wave, they say, always comes violently but Ellora's waves are always silent and subtle. Like those legendary caves Ellora's verse is studded with Words that are as beautiful as frescoes.

Vidvan Viswam says : "Ellora's poetry provokes and awakens and makes you walk straight. His poetry purifies the sin lying within and without the heart of man and helps him establish a new order based on a new moral principle."

Ellora's poetry encompasses beauty, nature, exploitation and poverty. Poet Laureate Dasarathi says: "Ellora's poetry is blended with more inner agony than outer slogans."

In his Silent Waves Ellora proudly declares:

"This generation is
My genaration I will
Open my eye of
Conflaguration and write
A new and golden history
To unlock the hearts of youth."

In abiting comment on hoarding he laments:

"What can I send you sister !
On your brithday
Every thing is black marketed
I will send only wishes."

Spewing fire he warns exploiters: "Get down, get down before torches surround you."

Ellora is a champion of the exploited and the down-trodden. His 'Repati vasantham' (Spring Tomorrow) lights the beacon of hope for them.

Ellora assumes in his poetry, that salvation is certain, even if the soul has to undergo along transmigration. He promises the suffering humanity: "I shall excavate the culture hidden in the rocky ruins of the past and lay a firm foundation for a new world."

For Ellora life is precious. It is a costly muslin, thin and wet, cest on a thorny bush for drying. Hasty handling will damage the silk irretrievably.

Ellora exhorts today's man: "Prepare a blueprint for the mansions of tomorrow based on yesterday's experience."

Ellora shows his nostalgia for the rich past in his numerous works of folk poems, his hopes in the many books intended for children, and contentment in his several novels, with happy endings.

Ellora knows, just as man had a past, he has a future and a present. But his concern is to make the present and the future happy and livable.

That seems to help both man and poetry.

# Bio data

NOM DE PLUME

ELLORA

Born at
Munganda in
Konaseema
in 1930 as
Godavarthi Bhaskara Rao

Works at

Andhra Prabha IIIustrated weekly
As ASST. EDITOR

Author of

30 books including
novels, literary criticism, poetry, childrens literature,
folk literature

## AWARDS

Winner of Andhra Pradesh Sahitya Akadami
award for his poetic work
Nissabda Tarangaalu

On Jan 26th 1981, Honoured as one of the National Poet
at New Delhi.
President - 'SAHITI' Telugu Sahitya Vedika
President - Janapada samakhya
Adviser - Modern Literature Committe A.P. Sahitya Akadamy.

# Work

POETRY

Repati Vasantham
Nissabda Tarangaalu
Minee Kavitha
Saraagaalu
Janapada Geyaalu-I
Janapada Geyaalu-II
Madhura kavithalu
Jvaalaa Toranalu

# Novels

SOCIAL

Gudi Gantalu
Parisaraalu Prabhavaalu
Prema Neerajanam
Kalachakram
Sandya Deepaalu
Kaarucheekatlu-Kaanthi Rekhalu

# Short Stories

Jailu Godalaku Maatalu Vasthe ?
Kadalipoyina Railubandi

## Essays

Prachina kalalu
Puttupurvottaralu

# Literature for children

Chandravadana
Mandaaraalu
Panduga Paatalu
Papayi Paatalu
Dr. Kokila
Samudra Garbhamlo
Kokilamma Thelivi
Poovulu - Moggalu
Vichitra Kathalu

# Recent works

Janadapada Sahityam
(Research work in folk literature)
Samiksha (Sahitya Vyaasaal u)

VII

# ముందుమాట

సాహిత్యాన్ని గురించి, సాహితీ ధర్మాన్ని గురించి ఎందరో ఎన్నో విషయాలు చెప్పారు. ఎవరి ఆలోచన వారిది. ఎవరి అవగాహన వారిది. ఒకరితో ఒకరు ఏకీభవించాలనే ఏముంది ? ఎవరికి తోచిన ఆలోచనలతో వారి వారి సిద్ధాంత ప్రియత్వంతో చెప్పడం వారి హక్కు.

నేను అప్పుడప్పుడు ఆయా పేపర్లలో, సంకలనాలలో రాసిన వ్యాసాలను ఒక సంపుటిగా వెలువరించాలనే ప్రయత్నమే ఈ "సమీక్ష" వ్యాస సంకలనం.

ముఖచిత్రాన్ని అలంకరించిన చిత్రకారులు శ్రీ చంద్రకు, ముఖపత్రాన్ని ముద్రించిన సుప్రీం ఆర్ట్స్ వారికి నా కృతజ్ఞతలు.

1982 ఏప్రిల్ —ఎల్లోరా

(అధ్యక్షులు-సాహితి)

ELLORA
1-8-150/4
చిక్కడపల్లి, హైదరాబాదు-20

# ఎల్లోరా కొత్త రచనలు

## జానపద సాహిత్యం 60-00


### జ్వాలాతోరణాలు 10-00

### సమీక్ష (వ్యాసాలు) 15-00

### మినీ కవిత 5-00

——త్వరలో——

## జానపద కళలు



# దీప్తి పబ్లికేషన్స్

# ఇదీ వరస


1. వర్ణ చిత్రం

— డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం కవి పరిచయం

2. అన్నమయ్య పద సాహిత్యంలో శృంగార రసహేళ 4

3. దిగ్దిగంతాలకు వ్యాపించిన శిల్పకళా వైభవం 17

4. తెలుగు సాహితికి రవ్వల పతకం—శతకం 34

5. రామదాసు కీర్తనలతో రామమయమైన తెలుగు సాహిత్యం 40

6. ప్రజా కవిత—పాట 47

7. జీవిత సత్యాలను చిత్రించే ప్రజా కవితలు 68

8. జానపద కళలు 79

9. యక్షగానాలు 96

10. సాహిత్య సమారాధన 109

11. ఫ్లాష్ పోయిట్రీ (మినీ కవిత) 129



X

# 1

# వర్ణ చిత్రం

సాహిత్య విమర్శలో ప్రస్తుతం సమీక్షా యుగం సాగుతోంది. మిత్రులు శ్రీ ఎల్లోరా తమ గ్రంథానికి 'సమీక్ష' అని పేరు పెట్టటం అందుపల్ల సమ్మం జసంగా ఉంది. ఈ పేరు సమకాలీన విమర్శ పరిధినేకాక ఇందులోని వ్యాస పరిధిని కూడా ధ్వనింప జేస్తోంది.

కోనసీమలో పుట్టి ప్రకృతి సౌందర్యాన్ని హృదయ భాండంలో నింపు కొన్న కవి శ్రీ ఎల్లోరా. అందంగానే కాక ఆవేశంతో చెప్పటం వారి వాగ్ధాటి. కవిత కది కాంతి నిచ్చింది; నవలకు నడక నేర్పింది; కథకు సుధను పంచింది; బాల సాహిత్యానికి పాట నేర్పింది; సమీక్షకు సారళ్యాన్ని సమకూర్చింది. ఎల్లోరా వ్రాసిన ఏ వ్యాసమైనా ఏకధారగా సాగి పఠితచేత మొదటి నుంచీ చివరి దాకా ఏకబిగితో చదివిస్తుంది. ఎల్లోరా ఇచ్చిన ఉపన్యాసాల నెన్నో విన్నాను. వారి ఉపన్యాసాలకూ వ్యాసాలకూ సారూప్యం బాగా కనపడుతుంది. ఆవేశంతో ఆలో చిస్తున్నట్లుంటుంది ఎల్లోరా రచన. వారి సమీక్షలోని సత్తువ గూడా అదే.

మిత్రులు శ్రీ ఎల్లోరా ఉద్యోగ రీత్యా పత్రికల్లో పని చేయటంతో వృత్తి ధర్మం కొంత సాహితీ పరిధికి కూడా అబ్బింది. ప్రతి మాటా ప్రజలను ఉద్దేశించి వ్రాయటం, ప్రజల కర్థమయ్యేటట్లు వ్రాయటం అప్రయత్నంగా ఆయనకు అలవాటై పోయింది. ఈ సంపుటిలో వ్యాసాలన్నీ ఆ ధ్యేయంతో వ్రాసినవే. కళను గురించి చెప్పినా; కవితను గురించి చెప్పినా ఎల్లోరా కాకలు తీరిన పండితుల కోసం చెప్పలేదు; కల రూపు తెలిసికోవాలనుకొనే సామాన్య రసిక లోకం కోసమే చెప్పారు. ఎంత చెప్పాలి అన్నదానికంటె ఎలా చెప్పాలి అన్న వైఖరికే వారు విలువ నిచ్చారు. విషయం విద్యుత్తును ప్రదర్శిస్తుంది; వైఖరి విద్యుత్తులా రచనకు శక్తిని ప్రసాదిస్తుంది. వేగం వారి ఉక్తిలో రాగంలా ఆలపిస్తుంది. నిలిచి నెమరు వేయదు ఎల్లోరా వ్యాసం; పరుగు తీస్తూ పాట పాడుతుంది. గుర్రపు పందాలు చూస్తుంటే ఎంత ఉల్లాసంగా ఉంటుందో ఎల్లోరా వ్యాసపఠనం

అంత ఉత్సాహాన్ని పఠితకు కలిగిస్తుంది. ఒక్కొకసారి కవిత వ్రాయబోయి వ్యాసం వ్రాశారా అని అనుమానం వేస్తుంది చదువరికి. అది ఆయన వైఖరి.

గతంలోని మంచిని రక్షించుకుంటూ వర్తమాన మిచ్చే వాస్తవానుభవాలతో భవిష్యత్తును ఉజ్జ్వలంగా నిర్మించుకోవాలన్న దీక్ష శ్రీ ఎల్లోరా రచనల్లో రవళించే అంతర్వేదన. వేదం చదివిన నోటితోనే ప్రజావాదం పలికే ఆధునికుడు ఎల్లోరా. పర్వబంధ కవితను పుక్కిట పట్టినా ప్రజా సాహిత్యాన్ని ప్రణవమంత్రంగా జపించే జానపద సాహిత్యాభిమాని. దానినే ప్రజాసాహిత్యమంటారు శ్రీ ఎల్లోరా.

"మొట్టమొదటి ప్రజా సాహిత్యం జానపద కవితలే"

"ప్రజలకోసం ప్రజలగురించి చెప్పింది ప్రతిదీ ప్రజాకవిత్వం అయింది" అన్న రెండు వాక్యాలూ వారి దృక్పథాన్ని వ్యక్తం చేస్తాయి. జానపదుల చేత పాడబడే సాహిత్యంలోని తరతరాల సంస్కృతినీ వీరు సందర్శించి సమీక్షించారు; జానపదుల కోసం వ్రాసిన ఆధునిక ప్రజా గీతాల్లోని సౌమనస్యాన్నీ వివేచించి చూపారు. ప్రజా సాహిత్యమంటే వీరిచ్చిన వ్యాఖ్యానం - ప్రజలు నిర్మించుకొన్న సాహిత్యం; ప్రజల కోసం రచింపబడిన సాహిత్యం అని. ఈ వివేచన ప్రజా స్వామిక వ్యవస్థకు ప్రయోజనకారిగా ఉంది.

వ్యాస నిర్వహణంలో శ్రీ ఎల్లోరా సామాన్యంగా చారిత్రక దృక్పథంతో సమీక్షించే పద్ధతిని ప్రదర్శించారు. భావలయ అంటే నా ఉద్దేశంలో-ఒక వస్తువు నెన్నుకొని దాని లక్షణాలను ఒక క్రమంలో వ్యక్తీకరింపదలచుకొన్నప్పుడు కాల క్రమాన్ని అనుసరించకుండా లక్ష్యలక్షణాన్వయాన్ని అనుసరిస్తూ ఒక ఆలోచనా క్రమానికి లయబద్ధమైన భావగతిని కూర్చటం. ఈ పద్ధతి శ్రీ ఎల్లోరా గారి రచనకు సహజాలంకారంగా అమరిందని చెప్పాలి.

ఒక్కొకసారి శ్రీ ఎల్లోరా వ్యాసం ప్రచ్ఛన్నంగా ఎవరో అడుగుతున్న ఏవో ప్రశ్నలకు సమాధానం చెపుతున్నట్లుంటుంది. సమకాలీన సాహితీరంగంలో సజీవ సమస్యలుగా సాగుతున్న అనేక విషయాల మీద జరుగుతున్న చర్చలన్నీ మనస్సులో మెదలుతున్నప్పుడు వాటికి తను సమాధానం చెప్పుతున్నట్లో, తన దృక్పథాన్ని వ్యక్తీకరిస్తున్నట్లో వ్యాసాంశాలురూపొందినట్లు పఠితకు అనిపిస్తాయి.

ఎందులోనైనా 'నేను' 'నాది' అనే వాటిని నిలుపుకోవాలన్న వ్యక్తిత్వం ఉన్న వ్యాసకర్త సూక్తుల్లా వ్యాసాల్లో కొన్ని పేరాలు రెపరెప లాడుతుంటాయి. ఏక పంక్తి పేరా అంటే ఎల్లోరాకు ఎంతో ఇష్టం. పాత్రికేయుడుగా ఆయన చేసిన సాధనలో అదో రచనా శిల్పం. కవిగా జీవిస్తూ వ్యాసం వ్రాస్తున్నప్పుడు అప్రయత్నంగా జాలువారే సూక్తి శిల్పం.

సమీక్షలుగా ఉన్న ఈ సంకలనంలోని వ్యాసాలను నేను సమీక్షింపబూనటం హాస్యాస్పదం. అయితే ఒక మాట మాత్రం చెప్పాలి. నేటి సమీక్షల్లో పరిశోధనాత్మకాలనీ, పరిశీలనాత్మకాలనీ, పరిచయాత్మకాలనీ మూడు రకాలు కనపడుతున్నాయి. పత్రికా ప్రపంచంలో పరిచయాత్మక సమీక్షలకు ప్రాచుర్యం ఉంది; సాహితీ పిపాసకులలో పరిశీలనాత్మకమైన సమీక్షకు సహజ గౌరవముంది; పండిత లోకంలో పరిశోధనాత్మకమైన సమీక్షకు ప్రామాణికత్వం ఉంది. శ్రీ ఎల్లోరా పాత్రికేయ ప్రవృత్తితో ప్రజల హృదయాలను పట్టుకోవాలన్న లక్ష్యంతో వ్యాసాలు వ్రాస్తున్నారు. ఇటువంటి రచనలు మనసుతో చెపుతున్నట్లుంటాయి; మనసుకు నచ్చేటట్లు సాగుతున్నట్లుంటాయి. వీటికి తీరు, సొరు ముఖ్యం; సారళ్యం, సౌజన్యం ముఖ్యం; మెదడుకంటె హృదయం ముఖ్యం. శ్రీ ఎల్లోరా వ్యాసాల్లో ఈ ముఖ్య విషయాలన్నీ ముచ్చటగా ఉన్నాయి.

సమీక్షాయుగంలో పత్రికావ్యాసం ప్రజలకోసం వ్రాస్తే ఎలా ఉండాలో, ఆ ప్రమాణానికి ఎల్లోరా వర్ణ చిత్రంలా నిలిచే రచన శ్రీ ఎల్లోరా 'సమీక్ష'.

ఈ సంపుటికి ముందు మాట అసలు అవసరం లేదు. సరాసరి సహృదయుడు సమీక్షలో దూకవచ్చు. ముందుమాట వ్రాస్తే కాని తెలుగువారికి తెలియని రచయిత కారు శ్రీ ఎల్లోరా. అందరికీ తెలిసిన ఎల్లోరాను పరిచయం చేయబూనటం సాహసం. కాకపోతే – మిత్రులు శ్రీ ఎల్లోరా నాకు కల్పించిన ఒక మంచి అవకాశం ఇది. అందుకు నేను శ్రీ ఎల్లోరాకు కృతజ్ఞుణ్ణి.

హైదరాబాదు.
22-6-1982

—డాక్టర్ జి. వి. సుబ్రహ్మణ్యం.

# అన్నమయ్య పద సాహిత్యంలో

# శృంగార రస హేల!





ఆరవై ఏళ్ళనాడు అన్న మయ్య కీర్తనా సాహిత్యాన్ని గురించీ కీర్తనా సారస్వాతాన్ని గురించీ, పదాల శృంగార రస హేళను గురించీ పరిశీలనా, పరిశోధనా ప్రారంభం అయింది. అన్నమయ్య, వారి కుటుంబీకులు చేసిన సారస్వత సేవ అపూర్వం-ఆ మధుర భక్తినీ, తాత్వికతనీ, శృంగార రస హేళనీ ఎందరో ఎన్నో విధాల చెప్పారు-ఆయన తెలియకపోయినా ఆయన ఆవిష్కరించిన పదబంధ పారిజాతాల గుసగుసలు నేడు తెలియని వారు ఉండరు - ఆ తోటలో పూచిన మందార మకరందాల పరిచయమే ఈ నాలుగు ముక్కలూ !

కొన్ని కొన్ని విషయాలు వింటూంటే చాలా ఆశ్చర్యంగా, నమ్మలేని నిజాలుగా ఉంటాయి. అది సంఘటన అయినా, రచన అయినా విన్నది నలుగురి నోట పడిందీ అయితే మరీ ఆలోచించడం జరుగుతుంది.

ఈ మధ్య కాలంలోనే జరిగింది - ఒక చిత్రాతిచిత్రం.

"మా తెలుగు తల్లికీ మల్లెపూదండ. మముగన్న తల్లికీ మంగళారతులు" అన్న గేయం తెలుగు నాట, తెలుగు నోట మారుమ్రోగింది.

మామూలుగా పాడుకొనే వారికి ఆ పాట ఎవరు రాశారు? ఏ సమయంలో, ఎక్కడివాడు రాశాడు అన్న దానితో సంబంధం లేదు. ఆ పాట నిండా తెలుగు తియ్యందనాలే, ఆ మాటలనిండా మందార మకరందాలే !

అలా అలా ఆ పాట తెలుగువాడి గుండెల్లో, తెలుగునాడు పల్లె, పట్టణాలలో సభల్లో, సదస్సుల్లో - ఎక్కడ చూసినా 'మా తెలుగు తల్లీ, నీ పాటలే పాడతా, నీ ఆటలే ఆడుతా' అని ప్రతిధ్వనించింది - తెలుగు గేయ వాఙ్మయానికి చలువ పందిళ్లు వేసింది.

ఈ పాట ఇంత ప్రచారం ఆదరణా పొందాక - దీని కర్త ఎవరు ? అన్న ప్రశ్న మేధావుల్లో, రసజ్ఞుల్లో, పండిత లోకంలో, సంగీత ప్రపంచంలో ఎదురైంది.

స్వార్థం ఎరుగని ఓ నిరాడంబరుడు తెలుగునుడికారానికి శ్రీకార ప్రాకారాలు ఆవిష్కరించగలిగిన ఓ పాటకారి తెలుగువాడినీ తెలుగు'వాడి'నీ పరిశీలించి తోతులు తెలుసుకున్న ఓ అమాయకుడు అని తెలిసింది.

ఎవరాతడు ? చూస్తే ఈ 'పాట బంగారు మూట' రచయిత ఇతడా అని పించేంది. పచ్చికల్లు తాగిన వాడిలా, అన్నం రుచి ఎరుగని ప్రాణిలా, బైరాగిలా- అతని పేరు శ్రీ శంకరంబాడి సుందరాచారి.

ఆశ్చర్యం ! అతను లేడు - అతని పాట ఉంది - అతడ్ని ఎవరూ గుర్తించ లేదు. అయితేనేం; అతని గొంతులో గుసగుసలాడిన పంచదార చిలుకల్లాంటి పద బంధ పారిజాత వల్లరిలాంటి ఆ పాట 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ' గా మాత్రం రింగ్ రింగ్‌మని మారుమ్రోగుతూనే ఉంది.

అచ్చం అదే జరిగింది -

"చందమామ రావె, జాబిల్లి రావె"అన్న పాట విషయంలో కూడా.

ఎంత మందికి తెలుసు ఈ పాట పద కర్త ఎవరు - ఎప్పటి వాడు, ఎక్కడి వాడు ?

అయితేనేం - ఈ పాట ప్రతి నోటా, ప్రతి నాటా అమ్మ ఒడిలో పసి పాప చేత గోరు ముద్దలు తినిపించింది - వెన్నెల రేడుతో సయ్యాటలూ ఆడించింది.

ఈ పాట పాడని తెలుగు తల్లి ఉందా ? ఈ పాట వినని తెలుగు హృదయం ఉందా ?

కాల సముద్ర ఘోషలో వ్యక్తుల పేర్లు వినిపించకపోవచ్చుగాని ఆ పాటల మధురిమ చెరగదు తరగదు - అది నిత్యం, శాశ్వతం.

పద పితామహుడు అన్నమయ్య రాసిందే ఆ పాట. కడపజిల్లా రాజంపేట సిద్ధవటం మండలాల ప్రాంతంలో "తాళ్లపాక" అనే గ్రామంలో జన్మించాడు అన్నమయ్య.

''ఉయ్యాల ఊపుతూ'' తల్లి ఇతనికి ఏ పాట పాడిందో తెలియదు గాని (అన్నమయ్య రాసినవే, 'చందమామ రావె జాబిల్లి రావె' అన్న పాట, 'జో అచ్యుతానంద జో జో ముకుంద' అనే ఉయ్యాల పాటకూడా. మరి ఈ పాటలు అన్నమయ్యకు ముందు లేవు కదా) అన్నమయ్య జననంతో పద సాహిత్యం మూడు పువ్వులూ ఆరుకాయలుగా విడిసి విస్తారింది.

విచిత్రం ఏమిటంటే, తల్లి అక్కమ్మగారి కంఠంలో ఏం మహాత్మ్యం ఉందో చెప్పలేంగాని ఆవిడ పాడిన ఆడించిలాలించిన ప్రతి పాటకూ ఆ పసికూన తన్మయుడనేవాడని అంటారు - ఆమెను గురించి ప్రచారంలో ఉన్న ఒక గాథ- ఆమె పుట్టిల్లు అయిన మాడుపూరు (కడప మండలమే) లోని మాధవస్వామితో ఆడుతూ పాడుతూ మాట్లాడేదని చెబుతారు.

ఆమె పాడిన పాటల పంచామృతమే అన్నమయ్యని పద చక్రవర్తిని చేసిందా అనిపిస్తుంది.

ప్రతివాని జీవితంలోనూ ఏదో ఒక సంఘటన అతని జీవిత పయనాన్నే మార్చేస్తుంది-అదే జరిగింది అన్నమయ్య విషయంలో కూడా.

చదువు సంధ్యలు లేని చిన్నవాడు అన్నమయ్య–అప్పటికే నల్లనయ్యను నమ్ముకున్నవాడేమో-ఒకనాడు గడ్డికోస్తూ చెయి కోసుకోడం, ఏక ధారగా రక్తం కారడంతో-ఆ కొడవలిని అక్కడే పడేసి- ఏదో మార్గం కనబడినట్లుగా పరుగెత్తాడుట. ఆ వెళ్ళడం వెళ్ళడం తిన్నగా తిరుపతి చేరాడని అంటారు. అలసి సొలిసిన అన్నమయ్యను ఆదరించినది అలిమేలు మంగమ్మేనని అంటారు.

అప్పటికే ఇతనిలో ప్రతి మాటా ఒక పాటగా- ఒక పదంగా- ఒక శతకంగా రూపుదిద్దుకోడం ప్రారంభం అయింది. దీనినిబట్టి ఇతడు సామాన్యుడు కాదనీ దైవాంశ సంభూతుడనీ అనడంలో అతిశయోక్తి లేదు.

ఈయన రాసిన వేంకటేశ్వర శతకం చాలా ప్రచారం పొందింది.

"అరిసెలు నూనె బూరియలు నేగులు చక్కెర మండిగల్ వడల్
బురుడలు పాల మండీగల పూపము అయ్యల మేలుమ్మంగనే
కరుదుగ విందువెట్టు పరమాన్న చయంబులు నూపకోటియున్
నిరత వినిర్మలాన్నములు నేతుల సోనలు వెంకటేశ్వరా"

—దేముడ్ని చూపించమని అలిమేలు మంగనే అడుగుతాడు.

"ఓ లలితాంగి యో కలికి యో యెలజవ్వని యో వధూటి యో
గోల, మెరుంగు జూపుకనుగోనల
నోయలమేలుమంగ మ
మ్మేలిన తల్లి నీ విభునకించుక మా దెస చూపుమంచు నీ
పాలికిజేరి మ్రొక్కుదురు పద్మభవాదులు వెంకటేశ్వరా"

—ఈ విధంగా అలిమేలుతోనే భోంచేసి, ఆమెనే పలకరించి దైవ దర్శనానికి మార్గాలు చూపమంటాడు అన్నమయ్య.

అప్పటినుంచీ ఈయన నోట ఏం పలికినా పదంగా, పాటగా మారి దేశి రచనా సౌరభాలను వెదజల్లింది.

అన్నమయ్య రచనలు అన్నీ దేశి రచనలుగానే పేర్కొంటున్నారు. ఈయన మీద దేశి రచనలచ్ఛందాల ప్రభావం చాలా ఉంది.

"తెలుగువారి దేశి కవిత పద కవిత్వమేగాని పద్య కవిత్వము కాదని విమర్శకులను మాటలలో గొంత యాదార్థ్యము లేకపోలేదు. పద్యము చదువు కొనుటకును, పదము పాడుకొనుటకును ఉద్దేశింపబడినవని వారందురు. తెలుగు నందలి దేశిచ్ఛందమును బరిశీలించి చూచునపుడావిషయము మరింత విస్పష్టము కాగలదు. శ్రీ నిడదవోలు వెంకటరావుగారు ఆంధ్ర కవితా పరిణామమునుగూర్చి ప్రాయుచు తెలుగు కవిత ఏక పదమై, ద్విపదమై, త్రిపదమై, చతుష్పదమై బరిణతి చెందినట్లు కానవచ్చుచున్నదని సూచించిరి" ఈ యభిప్రాయము సమంజసమని తోచుచున్నది. ద్విపదచ్ఛందమయొక్క పుట్టుపూర్వోత్తరము లెట్టివైనప్పటికి తెలుగునందలి దేశిచ్ఛందమున కంతటికి నదియే ప్రాతిపదికమైనట్లు తోచును అంటారు డాక్టర్ వేటూరి ఆనందమూర్తిగారు.

---

చూ॥ ఉదాహరణ వాఙ్మయ చరిత్ర.
తెలుగు కవిత్వం – ఎప్పటిది? అన్న వ్యాసం.
* వివరణ : తాళ్ళపాక కవుల పదకవితలు – పేజి – 7.

"అన్నమాచార్యుని చరిత్ర ద్వీపదను బట్టి చూడగా ప్రథమంలో అన్న మయ్య శృంగార కీర్తనలను రచించినట్లు, అనంతరం అధ్యాత్మ సంకీర్తనా సాహిత్యాన్ని వెలువరించినట్లు తెలియ వస్తూంది" అన్న విమర్శకుల మాటనూ పరిశోధకులు గ్రహించాలి.

అన్నమాచార్యుని పద రచనను గురించి పెద తిరుమలాచార్యులు చెప్పినట్లు—

"సురలకు నరులకు సొరిది వినవిన
నరుదు తాళ్ళపాక అన్నమయ్య పదములు-

చెర్కైై చవిచూసీ జూవై తావిచల్లీ
నక్కజపుమాతు వ్రజాలై మెరసీని
నిక్కు టద్దములై మా నిలువు నీడలు చూసీ
నక్కర తాళ్ళపాక అన్నమయ్య పదములు॥

పన్నిరై పైబూసీ గ్రవంబై చలువరేచీ
మిన్నగల ముత్యములై మెయినిండీని
వెన్ను బలములై మావెంట వెంట దిరిగేని
అన్నిట తాళ్ళపాక అన్నమయ్య పదములు॥

నెట్టన వేదాంతములై నిత్యములై పొడసూపీ
పుట్టు తేనె గురువులై బోధించీని
గట్టి వరాలిచ్చే శ్రీ వెంకటనాధుని మెప్పించీ
నట్టె తాళ్ళపాక అన్నమయ్య పదములు॥

* "తాళ్ళపాక వారి రచనలలో ప్రధానమైనవి సంకీర్తనములు. అధ్యాత్మ శృంగార సంకీర్తనములని రెండు తెరగులు..... అన్నమాచార్యు డొక్కడే 'పరమ తంత్రములు ముప్పది రెండు వేలు' యోగ, వైరాగ్య, శృంగార మార్గ ముల ననుసరించే వ్రాసినట్లు చిన్నన్న వ్రాసిన అన్నమాచార్య చరిత్రమును బట్టి తెలియుచున్నది".

---

*చూ-తాళ్ళపాక వారి కృతులు-డాక్టర్ వేటూరి ఆనందమూర్తి రచన-99 వ. పేజి.

ఆన్నమాచార్యుని రచనా వ్యాసంగం ఎనిమిదవ ఏటనుంచే ప్రారంభమయిందని కొందరు, పదునారవ ఏటనుంచేనని మరి కొందరు అంటున్నారు:

అన్నమాచార్యుడు స్వంత వూరు వదిలి నడిచి నడిచి కొండ ఎక్కేనాటికి ఎనిమిది ఏడులని చిన్నన్న పేర్కొనడం గమనార్హం! అయితే గురుపాదులు శ్రీ వేటూరి ప్రభాకర శాస్త్రిగారి వివరణ ప్రకారం "... అయితే తాళ్లపాక వారి రాగిరేకులందు అన్నమయ్యకు పదునారేండ్లకు తిరువెంగళనాథుడు ప్రత్యక్షమైతేను- అది మొదలుగా... విన్నపము చేసిన సంకీర్తలు కలదు. ఈ విషయమును అన్వయించుచు ప్రభాకరశాస్త్రి మహోదయులు "దాని నుపనయనముచే ద్విజత్వము వచ్చినదాదిగానని యన్వయించుకొని యెనిమిదేండ్ల వాడని, మాతృ గర్భము నుండి పుట్టిన దాది పదునారేండ్లవాడని సరిచూసుకోవలెను" అని వ్రాసినారు.

వీటిన్నిటినిబట్టి పదహారు సంవత్సరాలు వచ్చిన నాటికే అన్నమయ్య శతక కర్తగా, పద కర్తగా అనుభవం గడించడం జరిగిందనుకోవచ్చు.

అయితే, ఈయన విరచితాలయిన శృంగార పదాలు వయసు మళ్ళిన అనంతరమే - జీవితాన్ని ఆడి వడపోశాకనే - రచించాడా అనిపిస్తుంది - దీనికి ఉదాహరణగా - "అన్నమాచార్యుని రచనలలో 'శృంగార మంజరి' ఒకటి. ఇది ఆతని చివరి కృతులలో ఒకటి అని చిన్నన్న రచనను బట్టి తెలుస్తూంది. కథా సందర్భమును బట్టి అప్పటికి అన్నమయ్య వృద్ధుడుగా తోచుచున్నాడు" అన్నది గమనార్హం.

అన్నమయ్య 'పొలము రాజుల వెంటబోయెడి దైన్యము తగదని అనుభవ పూర్వకముగా దమ వారికి చెప్పిన ఈ సంఘటననుంచి ఈతని మనసు ఎట్టి వంటిదో తెలుసుకోవచ్చును,

"చీచీ వివేకమా చిత్తపు వికారమా
యేచి హరిగొల్లువకహీనుడాయెజీవుడు
బతికే నంటాబోయి పయిడి పుచ్చుకతన

పతియవసరమున ప్రాణమిచ్చేని
బతుకందులో ననేది పసిడి యెక్కడనుండు
గతి హరిగొలువక కట్టువడె జీవుడు''

అన్నమయ్య శృంగారాన్ని పదంగా చెప్పినా, శతకంలో వింగడించినా తేనే సోనలు చిందులాడతాయి:

చూడండి-అలిమేలు మంగనీ, వెంకటేశ్వరుని ఇలా ఊహించుకొంటాడు :

''ఒప్పగు తూగుటుయ్యెలల నూగుచు
నీ వలమేలుమంగతో
నప్పుడు కౌగిట ప్రతుల నాకటి పెల్లున
నప్పళించుచున్
రెప్పల నవ్వుతో మనసు రిచ్చలతో
నరగన్ను లార్చుచున్
దెప్పలదేలు సౌఖ్యమిదె
దేవరహస్యము వెంకటేశ్వరా''

అన్నమయ్య ఎంతటిభక్తుడో, ఆధ్యాత్మికవాదో- అంత శృంగార వాది కూడా అనిపిస్తుంది.

జీవితం చిన్నప్పుడు చిందులాటలా సాగిపోయినా వయసుతో మనసుచేత చాలా అనుభూతులనే ఆస్వాదించాడనడంలో వింత అనిపించదు.

ఈయనకు ఇద్దరు భార్యలు. ఇద్దరు భార్యలకూ ఇద్దరు కొడుకులు జన్మించారు. ఒకకూతురు కూడా పుట్టింది. ఇద్దరూ భార్యలపేర్లూ తిమ్మక్క, అక్కాంబ. వీరి ఇంట జన్మించిన వారేకాదు, ఆఖరికి అల్లుడు సైతం కవే. అల్లుడి పేరు రేవణూరి తిరుమల కొండయ్య.

సుమారు అరవై ఏళ్లనుంచీ అన్నమాచార్య కీర్తనా సాహిత్యాన్ని పునరుద్ధరించ వలెనన్న కృషి జరుగుతూనే ఉంది-రాళ్లపల్లి అనంత కృష్ణశర్మ గారు వేటూరి ప్రభాకరశాస్త్రిగారు ఈ విషయంలో ఎంతో శ్రమించి వేలాది రాగి రేకులను పునరుద్ధరించారు.

ఇక్కడ ఈ పదాల, కీర్తనల సంరక్షణ పేర జరిగే కృషిని గురించి తీసుకోవలసిన శ్రద్ధ గురించి రాళ్లపల్లి వారి పలుకులు గుర్తుంచుకోవలసిన విషయాలు.

* "ఈ పాటలకు రేకులలో పేర్కొనబడిన భాగములన్నియు ఇంచు మించు ప్రాతబడి నవ్యతను గోల్పోయినవనియు, కనుక ఇప్పుడు జనప్రియమైన క్రొత్తక్రొత్త రాగములలో, పోకడలలో వీనిని పొడిగించిననే తప్ప లోకులు వీని నాదరించరనియు పలువురికి సందేహమున్నది, కొంత నిజమే. కాని రాగముల రక్తికి వాని స్వరూపమునకంటె సొగసునట్టి కళావంతుని ఆధ్యాత్మిక చిత్తవృత్తి ముఖ్య కారణమని నా యనుభవము. ఏ రాగమందు రచించిన ఏ కృతినైనను, మరి ఏ రాగమందైనను పాడవచ్చుననుట సామాన్య సంగీత విద్యార్థులు గూడ ఎరిగిన విషయమే. కనుక రాగభేదముచేత శక్తి కలుగుననుట చాలా స్థూలమైన అభిప్రాయము. మరియు నేటి క్రొత్త రేపటికి ప్రాతగా మారక తీరదు. ఇంతే కాదు, కర్ర యుపయోగించిన పదములు భావములును ప్రాతబడినట్లు మనకు తోచవచ్చును గదా. అప్పుడు వానినికూడా మనరుచికి దగినట్లు మార్చుటకు పూనుకొంటిమేని మన నవ్య ప్రియత్వపు దెబ్బకేప్రాచీన మహాకవియును తట్టుకోలేడు. కనుక కళోపాసకు లుపయోగించిన పరికరముల యంతస్తును మీరి లోతుకుదిగి వారి యాధ్యాత్మిక వృత్తులను గ్రహించి యనుభవించుటయే కళారసికుల ప్రయత్నము గావలయును..."

దేశి రచనలు తన్నమయ్యకు పూర్వమే ఉన్నాయన్నది నిర్వివాదాంశం. ఈయన రచనలలో జానపదులు, చెంచీతలు, గోపెమ్మలు అందరూ చోటు చేసుకొన్నారు.

* నన్నెచోడుడు దేశి కవితను పేర్కొంటూ "దేశి సత్కవుల సంస్తుతి చేసి'యే అన్నాడు. అంతేనా, దేశికవితా శాఖకు చెందిన తనకాలపు గేయ ఘణితులను గొన్నిటిని గూడ పేర్కొనెను. అతడు కుమార సంభవము. ఈశ్వరుని గూర్చిన అంకమాలికలు, కల్లు ద్రించువారి 'గౌడు గీతములు', శబర కామినుల

*తాళ్లపాక పాటలు-వాల్యూమ్ 1-ఉపోద్ఘాతము

*చూ: తెలుగు కవితలోని దేశితనము - శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారి వ్యాసం

'రోకటిగొని దంచు పాటలు', ఉవిదలింపుగ పాడు 'నూయల పాట'లతో పాటుగా వనపాల బాలికలు నవలతికాందోలనల వేడ్క సలుపుచు నాలతులొగిజేసి పాడిన విధమును గూర్చియు, అంకమాలికలను 'పనిగొన నూల్కొనజేసి పాడిన విధమును గూర్చియు గూడ కొంత వివరించెను. ఇవి ఎల్లనాడు ప్రచారమందుండిన దేశి వరుసలే..

నన్నెచోడుని తర్వాత సమకాలిక సంగీత రచనా విశేషాలను గూర్చి వివరించినవాడు పాల్కురికి సోమనాధుడు ముఖ్యుడు.. ఈతడు ఎన్నో తీరుల దేశి గేయరచనలను వివరించాడు.

బసవని పెండ్లిలో--

''కోలాటమును బాత్రగొండ్లి పేరణియు
దేశికజోకయు లీలనటింప బాయక
'చాగుభలా' యను శబ్దమాయతి
నాకనంబంది ఘూర్నిల్ల నలిరేగి
వేణువీణావాద్య-వితతులుబియుచు
లీలతో నొక్కటబ్రమోయ
నానందగీతంబు లగ్గించువారు-
పూనిశంకర గీతములు పాడువారు
జతిగీతములమీద జప్పటలిడుచు
నతిశయ శివభక్తి నాడెడువారు''

ఈ విధంగా నాటి దేశి స్వరూపస్వభావాదులను వివరించడము జరిగింది.

తాళ్ళపాకవారి సంకీర్తన లక్షణమున సంకీర్తనము లేదా పదము అనబడునీ గేయ రచన వృత్త, నిబంధ, అనిబంధ పదములని ముత్తెరగులుగా విభాగింపబడిఉన్నది.

మచ్చుకు కొన్ని. పద కవితల్లో శృంగారం :

పొదలిన వీడెపు బుక్కిళ్లో-తమ
చోద్యుకుల చెమటుల చొక్కిళ్ళో॥

ఆముకొనిన యధరామృతవేళల
మోముల మోముల మొక్కిళ్లో
కామినుల మకరికా పత్రమ్ముల
చీమల దొంతర చెక్కిళ్లో॥
కయ్యపు గొగిట గలికి రచనలను
నెయ్యపు బులకల నిక్కిళ్లో॥
ముయ్యని మోహపు ముచ్చట మురిపెపు
తొయ్యలి పాదపు దొక్కిళ్లో॥
మొలకలే సగవుమోముల గోళ్ల
నులిమెటి వదనపు నుక్కిళ్లో
అలమేల్మంగకు నా వేంకటపతికి
దలపులొసంగిన దక్కిళ్ళో॥

అలాగే మరో శృంగార పదం :

"ఏమి చెప్పేమమ్మా మనమిద్దరికింక బుద్ధులు
తాముందాము నేకమట తమకములు వేరు

తనువులే వేరుగాని తలంపు లొక్కటెపో అనుంగురమణికి నంగనకును కనుం
గొనలె రెండు కనుచూపులొక్కటెపో పెనగొన్నభావనలె భేదమింతెకాని॥.....

తాళ్లపాక వారి శృంగారం పదాలలో పరవళ్లు తొక్కింది.

* అన్నమయ్య సుమారు 32 వేల సంకీర్తనలు రాసినట్లు వారి సంతతి వారు చెప్పారు. ఇప్పటిదాకా ఈ అరవై ఏళ్ళలో వెలికితీసి సరిచూసినది 2 వేలపైదాకా ఉన్నట్లూ అంచనా.

అన్నమయ్య గొప్ప భక్తుడు- వాగ్గేయకారుడు- ఈయనను గురించిన ఒక కథ ఉంది.

అన్నమయ్యను నరసింగరాయలు ఎంత మెచ్చుకున్నాడో అంత శిక్షించాడు. జరిగింది ఇది- మంగమ్మపై కవిత చెప్పాడు అన్నమయ్య- అది ఇది.

---

చూ॥ సమగ్రాంధ్ర సాహిత్యం సం-రీ। ఆరుద్ర. అన్నమయ్య వ్యాసం.

"యే మొకొ చిగురు టధరమున
నెడనెడంగస్తురి నిండెను
భామిని విభునకు బ్రాసిన పత్రిక గాదు కదా?
కలికి చకోరాక్షికిం గడగన్నులు గెంపైతోచిన
చెలువం బిప్పుడిదేమో చింతింపరు చెలులు
వలుపున బ్రాణేశ్వరుపై నాటిన
యా కొన చూపులు
నిలువున బెరుకగ నంటిన నెత్తురు గాదుకదా?
పడతికి చనుగవ మెరుగులు
పైపై బయ్యెద వెలుపలి
కడుమించిన విధమే యేలా....."
కనుంగొనరె చెలులు
ఉడుగని వేడుకతో బ్రియుడొత్తిన నఖశశిరేఖలు
వెడలగ వేసవికాలపు వెన్నెల కాదుగదా?

ముద్దియ చెక్కుల కెలకుల
ముత్యాల జల్లుల చేర్పుల
ఒద్దిక లాగు లివేమో ఊహించరె చెలులు
-గద్దరి తిరువేంకటపతి కౌగిట యధరామృతముల
అద్దిన సురతపు వేళల అందము కాదుగదా?"

ఈ పాట పాడమని పాడించుకొని మురిసిపోయాడు నరసింగరాయలు. అంతదాకా బాగానే ఉంది. తనమీదే ఇలాంటి శృంగార పదాలు రాయమన్నాడు.

భక్తి, రక్తి, ముక్తి తప్ప మఱో లోకం, ధ్యేయంలేని అన్నమయ్యకు ఈ కోరిక రుచించలేను.

ఏమంటాడు- "నరహరి కీర్తన నానిన జిహ్వారులనుతింపగనో పదు జిహ్వా" అన్నాడు.

రాజు తలచుకొంటే జరగనిది ఏముంటుంది ?

అన్నమయ్య చేతులకు బేడీలు వేయించాడు-

బైటున్నా లోపలున్నా హరినామస్మరణమే నిత్యకృత్యం. అయిన అన్న మయ్యకు భయం లేదు- బాధాలేదు.

అలాగే అన్నమయ్య పాటలు పాడుకొంటూంటే- వాటింతట అవే సంకెళ్లు ఊడిపోయేపట.

ఇది భటులు చెప్పగా విన్నాడు నరసింగరాయలు - ఆశ్చర్యంవేసింది. 'నిజంగా భక్తి గానమాధుర్యానికే సంకెళ్లు విడిపోడం నిజమైతే అన్నమయ్యే నా దైవం' అన్నాడట నరాసింగరాయలు.


పాటకు సంకెళ్లు విడిపోయాయి మాటకు నిలచి దాసోహం అన్నాడు ప్రభువు.

ఇదంతా ఎందుకు చెప్పోచ్చానంటే- ఎంత గొప్ప పదకర్తో మరెంత సంకీర్తనాచార్యుడో- అంతటి రసికుడు. మరింతటి భక్తుడు అన్నది జ్ఞాపకం చెయ్యడానికే.

అన్నమాచార్యుని పద విన్యాసం, కీర్తనామాధుర్యం - రసస్ఫోరకాలయిన శృంగార పదాలతో తెలుగు సాహిత్యం ఎంతటి పుణ్యం చేసుకొందో *

# దిగ్దిగంతాలకు వ్యాపించిన శిల్పకళా వైభవం







శాతవాహన కాకతీయ పల్లవ, రాయల కాలంలో ఉన్నత శిఖరాలు చేరిన ఆంధ్ర శిల్పుల ఉలికొనల హొయలు వినిపించే కఠిన శిలల గుండెలు చిలికించే వెన్నలాంటి సుమనోహర శిల్పకళా కేతనాలు.

ఆంధ్రదేశాన్ని సుభిక్షముగ పరిపాలించిన శాతవాహన యుగం క్రీస్తుశకము 78తో ప్రారంభమయి 225తో అంతమయిందని అనుకోవచ్చు. ఈ మధ్య కాలంలో వెలుగొందిన శిల్పకళా వైభవపు చరిత్ర ఏంతక్కువది కాదు సరికదా రానున్న యుగాలకు బాసటగా నిలచిందని చెప్పక తప్పదు.

శాతవాహనుల అనంతరం ఇక్ష్వాకులూ, పల్లవులూ, చాళుక్యులూ, కాకతీయులూ, విజయనగర రాజులూ, తంజావూరు రాజుల కాలాలలో ఎన్నో శిల్ప ఖండాలు వెలియడానికి శాతవాహనుల చరిత్ర, పరిపాలనా కారణమయింది. శాతవాహనయుగంనుంచి-రాయల యుగంపరకూ - అంటే క్రీస్తు శకం 78 తో ప్రారంభమయిన శాతవాహన పరిపాలననుంచి, క్రీస్తుశకం 1565 రాయల పరిపాలన సమయం వరకూ సృష్టించబడిన శిల్పకళా వైభవం అమ్బుతమైనది.


ఆంధ్రుల లలితాంతరంగాన్ని దిగ్దిగంతాలకు చాటిన చిత్రకళా చరమసీమ అనదగిన అజంతా గుహ శిల్పరాసిలోనూ, ఆంధ్ర శిల్పుల ఉలిమెరుగుల జిగికి ప్రతిరూపం అనదగిన - ఎల్లోరా శిల్పసముదాయం, జీవకళ ఉట్టిపడే అమరావతీ స్తూపాలూ, ప్రపంచ బౌద్ధ విశ్వవిద్యాలయమై, నాగార్జునాచార్యుని ధర్మ బోధలకు నిలయమై నిలచిన నాగార్జున కొండ శిల్పరాసీ— ఇంకా విజయనగర వైభవాన్ని దిగ్దిగంతాలకూ చాటిచెప్పే రాయల గజశాలా, రాతిరథ నిర్మాణ కౌశలం ఒకసారి పరికిస్తే చాలు-ప్రాచీనాంధ్ర శిల్పకళా వైభవం - ఎంతటి విశ్వ విఖ్యాతి నంది అగ్రతాంబూలాన్నందుకుంటూందో అర్థమౌతుంది.

భారతీయ శిల్పకళ చాలా ప్రాచీనమయిందని చెప్పడానికి మొహంజదారో, హరప్పాలలోని శిల్పకళా ఖండాల పరిశీలనా చరిత్రే నిరూపణ.

భారత శిల్ప సముదాయంలో ఎన్నో వరవడులు ప్రాంతీయంగా మనకు అగుపించినా - హైందవ శిల్ప వైశిష్ట్య ప్రభావం మాత్రం మనకు గోచరించక మానదు. ఈ దృష్టితో కనుక ఒక్కసారి మనం ఈ శిల్పారామాలను పరిశీలించినచో ఈ విషయం బోధపడక పోదు.

అజంతా, ఎల్లోరా, అమరావతి, నాగార్జున కొండ ఓరుగల్లు మొదలగు కళామయ క్షేత్రసీమలయందు మన శిల్పుల నాటియుగ ధర్మ మనోభావములూ అడుగడుగునా కనుపించుచునే వుండును.

ఆంధ్రసీమను కళామయ క్షేత్రసీమగా దిద్దిన ఈ శిల్ప చరిత్ర సమయాన్ని వరుసగా శాతవాహన, ఇక్ష్వాక, పల్లవ, కాకతీయ రాయల యుగములుగా వేరు చేసుకొని, ఈ యుగసంధులలో వరుసగా మన శిల్పచరిత్ర ఎలా ప్రవర్థమానమై ప్రపంచ కళాసీమ నేలగలిగిందో పరిశీలిద్దాం.



## అమరావతి

క్రీస్తుశకం 78తో ప్రారంభమైన శాతవాహన యుగం 225తో అంతమయిందని అనుకోవచ్చు. ఈ మధ్య కాలంలో ఆంధ్రశిల్ప ప్రతిభ దేదీప్యమానంగా ఆరుకాయలూ, మూడు పూవులతో శిల్పకళాలక్ష్మి గృహప్రాంగణాన నిత్యవసంత ఋతువుగా వెలుగొందింది-నాటి అమరావతీ స్థూపనిర్మాణం తెలుగు శిల్ప చరిత్రకు మకుటాయమానమై నిలచింది.

ఈ అమరావతి స్థూపాలలో బుద్ధదేవుని జనన వృత్తాంతమూ, ధర్మచక్ర పరివర్తనమూ, సంబోధి, మహాపరి నిర్వాణము, జాతక కథలూ మొదలగు ఎన్నో ఘట్టములు ఇందులో అపురూప కళానైపుణ్యంతో చెక్కబడి కళాలక్ష్మికి ఓంకారం పలుకుతున్నాయి.

అదేకాదు. నాటి సమాజం కళ్ళకు కట్టినట్లు, చరిత్ర పరిశోధకులకు కనిపించేలాగ, నాటి సంగీత, సాహిత్య, నృత్య రూపాలను చిత్రించారు. వాటికి తార్కాణంగా రకరకములగు నాట్య భంగిమలూ, నృత్యరూపాలూ, అనేక వింత అయిన వాద్య పరికరాలూ, స్త్రీ రూపాలూ-పూర్ణకుంభాలూ ఎన్నో చిత్రించారు.

నేటి మన నాట్య సంప్రదాయం కానీ, నాటకరూపంగానీ - నాటికే ప్రచారంలో వున్నట్లు ఈ చిత్రాల చిత్రణే తెలియజేస్తూంది. ఇదే సమయంలో రచించబడిన గాథాసప్తశతిలో కూడా నృత్య, సంగీత, సాహిత్యకళలను గురించి చెప్పబడివుంది.

శాతవాహనుల కాలంలో మహోచ్ఛస్థితిలో వర్ధిల్లిన మన శిల్పకళ ప్రపంచ హృదయంలో ఒక ప్రత్యేక స్థానాన్ని ఆక్రమించుకొంది - అంతదాకా ఎందుకు - నేటికీ ఏ ప్రపంచయాత్రికుడు వచ్చినా ఆంధ్రుల ప్రాచీన శిల్పకళా రూపాలకు చేతులెత్తి జోహార్లివ్వకుండా వెళ్ళడం లేదు.

శాతవాహన యుగం అంతరించడంతో ఇక్ష్వాకులు రాజరికవాదులైనారు. వీరి కాలంలో బౌద్ధశిల్పాలకు చక్కని ఆదరణ, ప్రోత్సాహం లభించింది-దక్షిణ భారతములోని బౌద్ధుల స్తూప సంపదకు సంబంధించినంత వరకూ నాగార్జున కొండ మహత్తరమైనది. బుద్ధుని జీవితంలోని అనేక ఘట్టాలూ, జాతక కథలు ఇక్కడ విస్తృతావధిని చిత్రింపబడి వున్నాయి.

బుద్ధదేవుని చరిత్ర-ఆ పవిత్రమూర్తి గాథలు-ఇంత విపులంగా శిల్పకృతులను ధరించివున్న ప్రదేశం ఇది మినహా మరొకటి మరెక్కడా లేదేమో కూడా! ఇక్ష్వాకువంశ (ఆంధ్ర) రాజులు శివ శతాబ్దిలో కృష్ణానదీ పావనతీరాన తమ పలుకుబడిని వెలయించి ఈ శిల్పకళ మనకు వారసత్వంగా అందించి వెళ్ళారు. అమరావతీ ప్రసిద్ధ స్తూపంవలెనే శిల్ప సంపద వెల్లివిరిసిన నాగార్జునకొండ స్తూపాలు ఆంధ్రజాతికి గర్వకారణమైన స్వర్ణచరిత్రకు నిలయమైనటివి.

ఇంతటి పవిత్ర బుద్ధ సందేశాలకూ, యుద్ధచరిత్రలకూ నిలయమైన ఈ సమయంలో మహాసౌందర్య సీమగా విశ్వ బౌద్ధవిశ్వవిద్యాలయ ప్రధాన కేంద్రంగా నిలచింది నాగార్జున కొండ!

నాగార్జునుని కాలంలో ఘంటసాలలో పెద్ద బౌద్ధారామ ముండేది. నాగార్జున కొండ శాసనంలో ఇది - "కటకశైల" సంఘారామముగ పేర్కొన బడింది. క్రీస్తుశకం మొదటి శతాబ్దం నాటి బౌద్ధస్థూప మొకటి ఇక్కడ వుంది. ఇది చాలా చక్కని స్థూపమనీ, ఇంతటి చక్కటి స్థూపం దక్షిణ దేశం లోనే లేదనీ అంటారు.

క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం నాటి కాలభైరవ సరస్వతీ విగ్రహ మొకటి వుంది. ఈ విగ్రహం చాలు ఆంధ్ర శిల్పుల ఉలిమెరుగుల హొయలు అర్థం చేసుకోడానికి !



అందులో ఆంధ్ర శిల్ప చాతుర్యం ఉట్టిపడుతుందని చాలామంది పేర్కొన్నారు. ఈ శిల్పం మొహంజదారో శిల్పాల్ని పోలివుంటుందని చారిత్రకుల అంచనా!

ఇక్ష్వాకుల రాజధాని అయిన విజయపురి - నాగార్జున కొండవద్ద గల శ్రీ పర్వతం (నల్లరాళ్లబోడు)కు పడమర దిక్కున ఈ విజయపురి నిర్మాణం జరిగింది. ఈ నిర్మాణం చాలా సహజ సిద్ధమయినదిగా కనిపిస్తుంది - ఒకవెంపు కృష్ణమ్మ, ఒక వెంపు కొండలూ వుండటం మూలంగా ఒక కోటలాగా వుంటుంది!

ఇక్కడ ఒక విషయం మనం తెలుసుకోవలసి ఉంటుంది. అదేమిటీ అంటే- నాగార్జున కొండలోని ఆరామం మాత్రమే శాతవాహనుల నిర్మాణమనీ, మిగిలిన ప్రధాన శిల్పాలన్నీ ఇక్ష్వాకుల కాలంలోనే నిర్మింపబడ్డవనీ అంచనా. అదే కాదు- నాగార్జున కొండలో ఇక్ష్వాకు రాజుల జీవిత చిత్రాలుకూడా చిత్రించ బడి. వుండడం గమనార్హం!

అమరావతివలెనే నాగార్జునకొండ కూడా గొప్ప విజ్ఞానకేంద్రం! క్రీస్తు శకం 640 లో దర్శించవచ్చిన చైనా యాత్రికుడు హ్యూయన్‌సాంగ్ కథనం ప్రకారం నాగార్జునకొండ స్వరూపం ఇలా వుండేదట:

"ఈ నాగార్జునకొండ అయిదు అంతస్తులు కలిగి వుండేది. క్రింది అంతస్తులోనూ పై అంతస్తులోనూ కలిపిచూస్తే సుమారు 500 గదులు వున్నాయని అంచనా! ఈ అయిదు అంతస్థులూ వేరువేరు ఆకారాలలో నిర్మితములయి వున్నాయట. అందులో మొదటి అంతస్థు ఏనుగు ఆకారంలోనూ, రెండవ అంతస్తు సింహం ఆకారంలోనూ, మూడవ అంతస్తు గుర్రం ఆకారంలోనూ, నాల్గవ అంతస్తు ఎద్దు ఆకారంలోనూ, అయిదవ అంతస్తు పాపురం ఆకారంలోనూ వున్నవి" అని ఆ చైనా యాత్రికుడు పేర్కొన్నాడు!

ఈ నాగార్జున కొండలో యాత్రికులను, చూపరులను ముగ్ధులను చేసే శిల్పకళాఖండం 'నాగరాజు బుద్ధుని ఒక తుపాకునుండి తన పడగవిప్పి అడ్డు

పెట్టి రక్షించుచున్నట్లు వున్న చిత్రం.' ఈ శిల్ప నిర్మాణంలో శిల్పకళా ప్రతిభ పరాకాష్ఠ నందిందని చెప్పవచ్చు.

ఇక్కడే దగ్గరలోనేవున్న బెజవాడ వెంపుకుకూడా ఒకసారి చూదాం. విజయవాడలోని కనకదుర్గ సమీపాన మొగల్‌రాజపురంలోని గుహాలయాలను తొలిపించింది విష్ణుకుండిన రాజులని ప్రసిద్ధ చారిత్రక పరిశోధకుల నిర్ణయంగా పేర్కొనవచ్చును.

క్రీస్తుశకం 5వ శతాబ్దం మొదటి అర్ధభాగంలో శాలంకాయనుల అధికారాన్ని అంతమొందించి రాజ్యాన్ని హస్తగతం చేసుకున్నవారే ఈ విష్ణుకుండినులు. వీరికి గుంటూరు జిల్లాలోని అమరావతి, పశ్చిమ గోదావరి జిల్లాలోని వేంగి, దెందులూరు ప్రధాన రాజధానీ నగరాలుగా వుండేవనీ, అందుతోపాటే వీరికి విజయవాడ కూడా ప్రధాన నగరంగా వుండేదనీ తెలుస్తూంది.

ఈ విష్ణుకుండిన రాజులు బౌద్ధద్వేషులు. వీరు బౌద్ధమతానికి అడ్డుచేశారు. బౌద్ధుల దేవాలయాలను శైవ, వైష్ణవ దేవాలయాలుగా మార్పు చేశారు. బౌద్ధుల పద్ధతిలోనే వీరూ గుహలను తొలిపించారు. ఇంద్రకీలాద్రి, మొగల్‌రాజపురం లను తొలిపించింది వీరలే.

ఈ పైన పేర్కొన్న ఇంద్రకీలాద్రినే కనకదుర్గమ్మ కొండ అని పిలువడం కూడా మనం విన్నదే - మనకు తెలిసిందే!! ఇక్కడి గుహాలయాలను "అక్కన్న - మాదన్న" గుహలని పిలుస్తారు కూడా. ఈ గుహలు అక్కన్న మాదన్నలచే నిర్మితములయినట్లు ప్రచారంలో వున్నా వీటిని విష్ణుకుండినులే స్వయంగా నిర్మింప చేసినట్లు చరిత్ర పరిశోధకుల బలమయిన అంచనా!

విష్ణుకుండినుల కాలంనాటి నాలుగు అంతస్తుల బౌద్ధారామం ఒకటి గుంటూరు జిల్లా ప్రండపల్లిలో వుంది. ఈ గుహాలయం నాలుగు అంతస్తులు కలిగి అయిదవ అంతస్తు అసంపూర్ణంగా వుండి-దీనిని బౌద్ధ గుహాలయమని అంటారు. ఇక్కడే తెలుగు లిపిలో వున్న ప్రాచీన కాలపు శాసనాలు వున్నాయి.

తూర్పు గోదావరి జిల్లాకో కూడా బౌద్ధ క్షేత్రాలుగా వర్ధిల్లిన ప్రాంతాలు లేకపోలేదు. క్రీస్తు పూర్వం నాల్గవ శతాబ్దంలో నందరాజుల క్రింద, తరువాత మౌర్యుల క్రిందకూ పోయి శాతవాహనుని కాలంలో (క్రీస్తు పూర్వం మూడవ శతాబ్దం) శాతవాహనుల రాజ్యభాగమయింది ఈ జిల్లా! క్రీస్తుశకం రెండవ శతాబ్దంలోనూ, నాలుగవ శతాబ్దంలోనూ ఖరవేలుడనే కళింగరాజు, మహేంద్రుడనే రాజు పిఠాపురం (పీఠికాపురం) రాజధానిగా ఈ జిల్లాను పరిపాలించారు. ఈ రాజులిద్దరికీ మధ్య శాతవాహనులు, ఇక్ష్వాకులూ తూర్పు గోదావరిని కొంతకాలం పరిపాలించారు.



క్రీస్తు పూర్వం రెండు, మూడు శతాబ్దులనాటి బౌద్ధ స్తూపాలు రాజోలు తాలూకా ఆదుర్రులో కనుగొనబడ్డాయి. ఆ కాలానివే అయిన నాణెములూ, మట్టి పాత్రలూ కూడా ఇందు కనుగొన బడ్డాయి. ఇలా దొరికిన నాణెములూ, మట్టి


పాత్రలును బట్టికాని, బయటపడ్డ స్తూపాలను బట్టిగాని చూస్తే మౌర్యుల కాలం నాటివో, శాతవాహనుల కాలం నాటివో అయి వుండాలని, అయివుంటాయనీ శాస్త్రకారుల నిర్ణయం తూర్పు గోదావరి జిల్లా ప్రధాన నగరం అయిన రాజమహేంద్రవరంకు దగ్గరలో వున్న కాపవరం అనే చోటకూడా కొన్ని గుహలు వున్నాయని కనుగొన్నారు.

ఈ జిల్లాలోనిదే అయిన ద్రాక్షారామ భీమేశ్వరాలయాన్ని 10 వ శతాబ్ది వాడైన చాళుక్య భీమరాజు నిర్మించాడని చెబుతారు. ఈ ద్రాక్షారామాన్ని గురించి తెలయని వారు వుండరనే అనుకుంటా. దీన్ని దక్షిణ కాశీ అని అంటారు కూడా! ఈ ద్రాక్షారామం చెరువునే సప్తసాగరమని పిలుస్తారు. ఎంతో పవిత్రంగా చూస్తారు. ఈ సప్త సాగరమును రెండు వేల సంవత్సరాల నాటికే ద్రాక్షారామ పుణ్య క్షేత్రమని చరిత్రకారుల అంచనా - అప్పుడు ద్రాక్షారామ "దాకరేమి"గా వుండేదట! ఇంకో విషయమేమంటే - అసలు పేరు ద్రాక్షారామం కాదని "దక్షారామం" అని పేర్కొన్నారు. ఇలా పేర్కొనడానికి కారణంగా - దక్షు డున్న స్థలమని చెబుతారు.

పల్లవకాలంలో కూడా శిల్ప పోషణను గురించి తెలుసుకోవలసి ఉంది. క్రీస్తుశకం 234 లో ప్రారంభమయి పల్లవ యుగం 625 తో అంతమయింది. ఈ రాజ్యం మొదట దక్షిణమున దక్షిణ పెన్నానుండి, ఉత్తరమున కృష్ణా, తుంగభద్రల వరకునూ, తూర్పున బంగాళాఖాతము నుంచి పశ్చిమ బళ్ళారి వరకూ వ్యాపించింది.

కంచిలోని కైలాస నాథాలయం, మహా బలిపురంలోని సముద్ర తీరాలయం పల్లవరాజసింహుడు కట్టించినవే!

మహాబలిపురంలో పాండవుల రథాలనేవి - ధర్మరాజు రథం, భీముని రథం, అర్జునుడిరథం - వీటిని చూస్తూంటే - రాతిని మలచి ఇంత బ్రహ్మాండమయిన రథాలు ఎలా నిర్మించగలిగారా - చెక్క కలిగారా - అని ఆశ్చర్యం కలుగకపోదు.



పల్లవుల కాలంలో గొప్ప గొప్ప దేవాలయాలూ, గుహాలయాలూ నిర్మించి శిల్పకళకు చక్కని ప్రోత్సాహం ఇచ్చారు. రాయి, ఇటుక, సున్నంతో దేవాలయాలు నిర్మించడం పల్లవులతోనే ప్రారంభమయిందని కూడా చెప్పడం కద్దు' వీరి పరిపాలనలో చిత్రలేఖనమూ, సంగీత సాహిత్యాలూ బాగా వర్ధిల్లినవి. దీనికి తార్కాణాలుగా - పుదుక్కోటలోని కుడిమియామలైలోని శిలమీద చెక్కించిన సంగీత శాస్త్రసంబంధ శాసనమూ, కైలాసనాథాలయంలో కానవచ్చే వర్ణచిత్రములూ తీసుకోవచ్చును.

పంచపాండవుల రథాలూ, ఏకశిలా రథాలూ ఆంధ్ర శిల్పుల నిర్మాణమే అయివుంటుందని ప్రసిద్ధ పరిశోధకులు ఒకరు పేర్కొని వున్నారు కూడా !

మహాబలిపురంలో కన్నుల పండువు చేసే ఈ శిల్పనిర్మాణానికి మూలకారకుడు మొదటి నరసింహపర్మట! ఈ ప్రదేశంలోనే ఒక కొండన చెక్కిన శిల్పచిత్రములు అతి రమణీయములు - అత్యద్భుతములూను! ఈ చిత్ర నిర్మాణాన్ని గురించి రెండు విధాల కథలు మనకు వినిపిస్తుంటాయి ! అందులో:

ఒకటి : భగీరథుని తపస్సుకు సంబంధించిన కథకు మూలమని.

రెండు : కిరాతార్జునీయగాథే ఇది అని. మొత్తం మీద అటు భగీరథుని తపస్సుకు సంబంధించిందయినా కానివ్వండి; లేదా ఇటు కిరాతార్జుననీయ గాథే కానీయండి - ఏది ఏమైనా పల్లవుల సమయంలో శిల్పకళ ఇంతటి మహోన్నతిలో కీర్తి నార్జించుకొందని మాత్రం మనం చెప్పుకోవలసి ఉంటుంది.

శాతవాహన యుగంలో రూపుదిద్దుకొన్న ఆంధ్ర శిల్పకళ, పల్లవ యుగంలో కొత్తరూపు రంగరించుకొని పౌరాణిక ప్రాధాన్యతతో విలసిల్లింది. అంతటి అపురూపకళా శిల్పరూపాలు – అమరావతి, నాగార్జున, మహాబలిపుర శిల్పరాసులుగా మనకు నిలచాయి. వాటిరూపచ్ఛాయల ప్రతిబింబాలుగానే కాకతీయ సమయంలో కూడా తెలుగు శిల్పుల ధ్యానం పసవళ్లు తొక్కింది - ఇంకా పదును దేరింది కూడా !

## కాకతీయ యుగం



క్రీస్తుశకం 1200 తో ప్రారంభమయిన కాకతీయయుగం సుమారు 1323 ఆ ప్రాంతాలలో ముగిసింది. ఈ సమయంలో వీరి శిల్ప నిర్మాణ కౌశలం రానున్న యుగాలకు బాసట అయిందికూడా !

కాకతీయాంధ్ర శిల్ప నైపుణ్యానికీ, సంస్కృతీ పటిమకూ రామప్ప దేవాలయం ఒక చక్కని తార్కాణ ! ఆంధ్ర శిల్పుల శిల్ప నైపుణికి అదొక గీటురాయి !! రామప్ప దేవాలయ నిర్మాణం ఆంధ్ర శిల్ప చరిత్రలో ఒక.. స్వర్ణ ఘట్టంగానే చెప్పవలసి వుంది.

ఈ కాకతీయాంధ్ర యుగంలో - శిల్పుల ప్రతిభ - అనేక అపురూప, సుందర రూపాలలో స్వైర విహారం చేసింది. రామప్ప గుడి, వరంగల్లు శిల్పములు, హనుమకొండ శిల్పములూ - ప్రసిద్ధి పొందిన అపురూప శిల్ప స్వరూపాలు.

ఖరంగల్లు కోటకు నీరాజనాలు అందించే నందీ, ఏనుగులూ కాకతీయ శిల్ప ఆరాధనకు నిదర్శనాలు! కాకతీయుల శిల్ప శోభకు విజయ స్తంభంగా నిలచింది హయశాల శైలి - అంతటి శిల్ప చాతుర్యం అందులో పొదిగారు శిల్పులు !

వెయ్యి స్థంభాల దేవాలయం దేశం మొత్తంలో హిందూ శిల్పకళను ప్రతిబింబించే - సాటిలేని మేటిగా ఇక్కడ మనం పేర్కొననచ్చు ! దీనిని హనుమకొండ సమీపంలోనే గణపతి దేవుడు 1162 లో నిర్మించాడని ఊహ, ఇది మూడు అడుగుల ఎత్తున వున్న అరుగుపైన నిర్మించబడింది - మొదటి ఆలయంలో 300 స్థంభాలూ, మిగిలిన స్థంభాలు రెండవ ఆలయంలోనూ వున్నాయి. ఈ దేవాలయం - తూర్పునుండి పడమరకు 102 అడుగులు, ఉత్తరం నుండి దక్షిణమునకు 83 అడుగులూ వుంది. ఈ వరంగల్లు కాకతీయుల కాలంలో ఓరుగల్లు పేరుతో రాజధానీ నగరంగా ప్రసిద్ధి గాంచింది. రామప్ప దేవాలయానికీ, హనుమకొండ దేవాలయానికీ పోలికలున్నాయి.

రామప్ప దేవాలయం వరంగల్లుకు సుమారు 30 మైళ్ళ దూరంలో వున్న పాలెంపేట గ్రామంలో వున్న రామప్ప చెర్వువద్ద వుంది. ఇది అక్కడి అన్ని దేవాలయాలలోకి చాలా ప్రఖ్యాతి నందిన దేవాలయం - దేవాలయ శిల్ప కళలో ఇది తలమానిక మయినదని పేర్కొనబడింది.

కాకతీయ రాజులకాలం నాటి అపురూపమయిన చారిత్రక చిహ్నాలలో వరంగల్లు దుర్గం అతి ప్రధానమయినది. దీని నిర్మాణం ఒక్కసారిగా గాని, ఒక్కతేగాని చేయడం జరగలేదు.

కాకతీయ రాజు అయిన గణపతి దేవుడు 1199 లో ప్రారంభించగా అతని కూతురు రుద్రమదేవి 1261 లో పూర్తి చేసింది. ఈ దుర్గానికి రెండు గోడలు వున్నాయి. అందులో వెలుపలి గోడ మట్టితోనూ లోపలిగోడ రాతితోనూ నిర్మితమయి వుంది - గోడ నానుకొనే కందకం వుంది.

చరిత్ర ప్రసిద్ధిగన్న రామప్ప దేవాలయ నిర్మాణం, వెయ్యి స్తంభాల గుడి, ఓరుగల్లు దుర్గం నిర్మాణ చరిత్రతో పవిత్రమయినది కాకతీయ యుగం.

## రాయల కాలంలో

ఈ యుగ సమయంలో వెలసిన శిల్ప ఖండాల నైపుణిని పుణికి పుచ్చుకొని రాయల యుగంలో కూడా కొన్ని శిల్ప ఖండాలు వెలిశాయి. క్రీస్తుశకం 1510 ఆ ప్రాంతాలలో ప్రారంభమయిన రాయలయుగం క్రీస్తుశకం 1565 తో అంతమయింది. ఈ మధ్య సమయంలో సంగీత, సాహిత్య కళలతోపాటు శిల్ప కళా పోషణకూడా బాగానే జరిగిందని చెప్పాలి. ఇక్కడ నిర్మాణాలలో నాగార్జున, అమరావతి అనుకృతులూ, రూపకల్పనా విశేషాలూ కొంచం గోచరించక మానవు. ఈ రూప కళాఖండాల నైపుణిని పుణికి పుచ్చుకొని వెలసినవే రాయల యుగంలో శిల్పకళా ఖండాలు!

దీనికి తార్కాణగా రాయల గజశాల, విరూపాక్షరథం, ఉగ్రనరసింహ మూర్తి, విరూపాక్షస్వామి- రూపాలలో శిల్ప గాంభీర్యం మనకు ఎల్లోరా,

అమరావతి, నాగార్జున, మహాబలిపురములలోని శిల్పాలాలిత్యం ఇందులో కన బడుతుంది. ఇవన్నీ మన ఆంధ్ర శిల్పుల శిల్పకళా నైపుణ్యానికీ పటిమకూ తార్కాణాలుగా మనం గ్రహించవలసి వుంటుంది.

బొజ్జన్నకొండ అని ఒక కొండ వుంది. దీనిని తొలచే ఒక బౌద్ధ గుహా లయం, ఆరామమూ నిర్మించబడ్డాయి. ఈ బొజ్జన్న కొండనే మహర్నవమి దిబ్బ అని అంటారనుకుంటాను.

ఈ బౌద్ధగుహాలయంలో రెండు అంతస్తులున్నాయి- దీని మెట్లు శిధిలా వస్థలో వున్నాయి. ఇందులోదే ధ్యానముద్రలోవున్న బుద్ధవిగ్రహం. ఈ ఆలయం మధ్యలోనే నాలుగు అడుగుల బౌద్ధస్తూపం ఒకటి వుంది. పై అంతస్తులోని ఆల యంలో పద్మాసనంలో వున్న పెద్ద బుద్ధుని విగ్రహం వుంది.

బొజ్జన్నకొండ అని పిలువబడే ఈ కొండ అనేక చిన్న కొండల సముదాయం

దసరాకాలంలో రాజులు ఇక్కడ కొలువుచేయడానికి చిత్రచిత్రమయిన శిల్పరీతులలో నిర్మించిన మంటపం వుంది. ఇక్కడ కూర్చుని తమ దర్శ నార్థమై వచ్చిన సామంతులనూ, పండితులనూ, ఇతర విద్వాంసులనూ కలుసు కొనే వారట. ఈ స్థలానికి దసరా దిబ్బ అని పేరు రావడానికి కారణం దసరా సమయంలో ఆ దిబ్బపై అలంకార నిర్మితమయిన చోట ఆసీనులై వేడుకలను చూసేవారట- అందుకే ఈ దిబ్బకు మహర్నవమి దిబ్బ అనే పేరు వచ్చిందని చెబుతారు.

ప్రతి సంవత్సరం ఇక్కడ సంక్రాంతికి ఉత్సవాలు జరుపబడుతూ వుంటాయి. అక్కడి ప్రజలు వారి వారి గొడ్లను తోలుకొని వెళ్ళి బొజ్జన్నకొండ క్రింద అంతస్తులోవున్న స్తూపం చుట్టూ ఎనిమిదిసార్లు ప్రదక్షిణం చేయించుతారు-

అదేకాదు-ఈ కొండపైనే ఈరిసమ్మ అనే దేవత వుంది. ప్రతి ప్రాంతం లోనూ ఒక్కొక్క దేవత అక్కడి ప్రజలకు ఆరాధ్యురాలుగా వుంటుంది. పోలే రమ్మ ఒకరి దేవత అయితే, గంగానమ్మ మరొకరి దేవత. మరిడమ్మ ఒకరి

దేవత అయితే- అంకాలమ్మ మరొకరి దేవత. అలాగే ఇక్కడవారికి ఈరినమ్మ దేవత. ఈ దేవత పిల్లలను తినేసేదని అక్కడివారిలో ఒక పాత నమ్మకం ప్రచారంలో వుంది.

అందుకు-ఆమెచేసే ఈ పిల్లలను తినడం అనే పనికి కోపంతో ఈ ఉత్స వాలకు వచ్చిన స్త్రీలు తల ఒకి రాయీ ఈ దేవతమీద గిరవాటేసి మరీ వెడు తుంటారు. అందుకే అనుకొంటాను, ఈ ఈరినమ్మదేవత రాళ్ళతో మునిగి వుండడం.

విజయనగరం తాలూకాలో రామతీర్థమని మరో బౌద్ధక్షేత్రం వుంది. ఇది జైనక్షేత్రం కూడా. రామతీర్థాన్ని ఆరామతీర్థమని కూడా అంటారు. రామ తీర్థం బౌద్ధ, జైన మతాలకు కేంద్రంగా వుంటుండేది.

రాజులు రావచ్చు, పోవచ్చు. రాజ్యాలు ఒకరిచేతినుంచి మరొకరి చేతికి మారవచ్చు. కాలక్రమంలో సూర్యాస్తమయాలు తప్పవుకదా !

కాని ఆయా యుగ ఘడియలలో నిర్మితములయిన ఆయా కళాఖండాలు మాత్రం తెలుగు శిల్పకళా భారతికి శిరోభూషణాలై - ఆంధ్రులకూ, ఆంధ్ర శిల్పులకూ విశ్వవిఖ్యాతి చేకూర్చిపెట్టాయి కదా !

రాయల ఆప్తాజీల కథలలో చెప్పబడు కథలుఅన్నీ, కృష్ణదేవరాయనీ, అతని మంత్రి తిమ్మరుసుని గురించినవే ! దేవాలయాలకు వీరు చేసిన కైంక ర్యాలు, ఇచ్చినదానాలూ లెక్కలేనివి ! కాంచీపురం, చిదంబరం మొదలగుచోట్ల పెద్దవైన, ప్రసిద్ధములయిన గోపురాలు కట్టించారు. 'ఆనంద నిలయం' అను తిరుపతి విమానానికి బంగారుపూత పూయించింది వీరేనట.

ఊరి మధ్య భాగంలోనేవుంది మాతంగ గిరి—ఆ కొండని నిలచి ఒక్కసారి నాలుగుదిక్కులూ పరికిస్తే మనకు అగుపించేది ఒక వెంపున కోటలు, బురుజులూ- ఒకవెంపు ఆలయ గోపురాలూ, వేరొకవెంపు ముస్లిందండ యాత్రకు గురి అయిన రాయల శిల్పరాసిని చూసి ప్రకృతి కంటనీరు పెట్టిందా అన్నట్లు ప్రక్కనే ప్రవహించే తుంగభద్రమ్మ మనకు కనుపించి - మనలను కూడా ఓసారి ఆ దృశ్యాలు జలదరింపజేస్తాయి !!

హంపీలోనే విరూపాక్ష దేవాలయం వుంది. దాని నానుకొనే హేమకూటమను ఒక పెద్ద రాతిబండ వుంది. ఈ బండపైన జైన దేవాలయాలు వున్నాయి. దీని సమీపానే ఒక మండపం, ముందుగా వినాయక విగ్రహం వున్నాయి. ఆ విగ్రహానికే "శెనగగింజ వినాయకుడని" పేరు.

క్రీస్తుశకం 73 శాతవాహన యుగఘడియలలో ప్రారంభమయిన ఆంధ్ర శిల్పకళ క్రీస్తుశకం 1510 రాయలయుగం వరకూ ఎన్నో రీతులలో, తరహాలతో వెలుగొందినది.

అజంతా, ఎల్లోరా, అమరావతి, నాగార్జున, మహాబలిపుర శిల్పకళాఖండాలను సృష్టించి, ఆంధ్రజాతికి, దేశానికి, అమర కీర్తిని తెచ్చిన - నాటి శిల్పులు ఎంతటి ధన్యులో కదా!

# తెలుగు సాహితికి
# రవ్వల పతకం - శతకం

తెలుగు సాహిత్యంలో ప్రత్యేక వ్యక్తిత్వంగల శాఖ శతక వాజ్మయం. ఇది సర్వజనరంజకమైన శక్తిమంతమైన ప్రక్రియ. ప్రజల వేష భాషలు, ఆచార వ్యవహారాలు, సాంఘిక స్థితిగతులు, రాజకీయ చారిత్రక పరిణామం వరకూ అనేక విషయాలు మన శతక సాహిత్యంలో దర్శనమిస్తాయి.

శతక కవులలో ఆత్మాశ్రయ విధానం ఎక్కువ గనుక వారి సమకాలం లోని సాంఘిక, రాజకీయ మత సిద్ధాంతాలు ప్రతిబింబించక తప్పలేదు. శతక కర్త తన నాటి సమస్యల ప్రభావాన్ని విడిచి రచన కొనసాగించడం సాధ్యం అనుకోను. అటువంటప్పుడు ఆయా శతాబ్దాలలో ఆయా శతక కవుల రచన లలో నాటి పరిస్థితుల ప్రభావం ప్రతిఫలించక మానదు.

జానపద సాహిత్యాన్ని తిరస్కృతాంధ్ర వాజ్మయమని చిన్న చూపు చూసి నట్లుగానే శతక వాజ్మయాన్ని క్షుద్ర సాహిత్యంగా పేర్కొనడమూ జరిగింది.

శతకాలలో అన్ని భావాలూ, పరిస్థితులూ ప్రచారం అయాయని చెప్ప వచ్చు : ప్రబోధం, శృంగారం, ఆధ్యాత్మిక చింతన, మత వేదాంత విష యాలు - ఒక వేమిటి - నీతులు నియమాలు సలహాలు సందేశాలు - ఇలా ప్రతిదీ శతకంలో స్థానం చేసుకుంది.

శతకం అనడంలోనే ఇది సంఖ్యా నియమంగల ప్రక్రియ అని స్పష్టమవు తోంది. ఇది సంస్కృతంలోని అష్టోత్తరాది స్తోత్రాలనుండి గ్రహింపబడిందని చెప్పవచ్చు. ఒక పద్యముంటే ముక్తకమనీ, రెండు పద్యాలయితే కుళకమనీ, మూడయితే త్రికమనీ, 5- పంచకము, పంచరత్నములు, 9- నవరత్నములు, 20- వింశతి, 25 పంచవింశతి, 100- శతకము, 108- అష్టోత్తర శతకము, ఇలా-ద్విశతి, త్రిశతి మొదలయిన సంస్కృతంలో ఉన్న నియమాలు. అయితే

శతకాలలో తరచుగా 108 పద్యాలుండటం లక్షణంగా పరిగణింపబడుతుంది శతకి రచనలో మకుటనియమం ఒక ప్రత్యేకత. నూటికి పైబడిన పద్యాలున్నా శతకాలు గానే పరిగణింపబడటానికి కారణం మకుట నియమమే. *"శతకములు చాలవరకు చంపకోత్పల మత్తేభ శార్దూల వృత్తములతో రచితములు. ఇవి గాక జాత్యుప జాతులలో రచింపబడినవి కూడ ఉన్నవి."

తెలుగు శతక కవులు ప్రధానంగా భక్తి, జ్ఞాన, వైరాగ్యములను ప్రబోధించటమే ప్రముఖంగా కనిపిస్తుంది. అయితే నీతిబోధ కూడా తక్కువేమీ కాదు.

శతక సాహిత్యానికి నాంది పలికి శ్రీకారం చుట్టిన వారుగా శైవకవులనే పేర్కొనాలి. అందుకు ఉదాహరణగా 12వ శతాబ్దివాడైన మల్లికార్జున పండితారాధ్యులు రచించిన "శివతత్త్వసారం" గ్రంథాన్ని పేర్కొనాలి. ఇది శతక లక్షణాలు గలిగినట్టిదే. కుల సంఘ పునాదులనే పెకలించి వేయాలనే ఆవేశ పూరితమైన వీరశైవ ప్రబోధం అది. అయితే, మరో సత్యాన్ని కూడా ఇక్కడ అంగీకరించాలి. నన్నయ భట్టు మహాభారతం ఆది పర్వంలో ఉదంకోపాఖ్యానంలో ఉదంకుడు సర్పరాజుల్ని స్తోత్రం చేసిన సందర్భంలో 'ప్రసన్న దయ్యోడున్' అనే మకుటంతో నాలుగు పద్యాలు రచించాడు. ఇక్కడి మకుటం సంబోధన గాకపోయినా, క్రియా రూపంగా ఉన్నా, ఇది కొంతవరకు శతక ప్రక్రియకు సూచన ప్రాయంగా ఉన్నదనిపిస్తుంది.

అసలు మొదట సంస్కృత, ప్రాకృత భాషలలో ప్రచారం అయిన ఈ శతక రచనా విధానం, తెలుగులో కూడా మరికొన్ని లక్షణాలతో ప్రచారమయింది.

శతక ప్రక్రియ మత ప్రబోధానికి, జ్ఞాన తత్త్వ ప్రచారానికి, నీతి బోధకు బాగా ఉపకరించింది. ఆఖరికి నిఘంటు రచనలు సైతం శతక రూపంలో వెలువడటం గమనించదగిన ప్రధాన విషయం. కస్తూరి రంగని 'సాంబ నిఘంటువు' ఈ కోవకు చెందినదే.

---

* తెలుగు సాహిత్యంలో దేశికవిత - ఆర్వీయన్ సుందరం.

తెలుగులో ఉన్నన్ని శతకాలు మరే భాషలోను లేవు. తెలుగులో దాదాపు మూడువేల శతకాలున్నాయి.

శతకాలన్నీ దేశికవితే అని జమకట్టకూడదు. ఉత్పలమాలాది సంస్కృత వృత్తాలతో కొనసాగిన శతకాలు మార్గకవితా పద్ధతికి చెందినవే.

శతకాలలో లోకవృత్తాన్ని ప్రతిబింబించిన సుమతీ శతకం నుంచి నిరాశావాదం కనిపించే భాస్కర శతకందాకా ఎన్నో ఉన్నాయి. అయితే వేమన శతకం నీతులు, ప్రబోధాలు, ఆధ్యాత్మిక విషయాలు, సందేశాలు, దురాచారాలపై, మూఢవిశ్వాసాలపై నిరసనలతో కూడి ఉంటుంది.

శతకాలకు బీజం ఎప్పుడు పడింది అనే విషయానికివస్తే ఇది చాలా ప్రాచీన కాలంలోనే జరిగింది అని చెప్పాల్సిఉంటుంది. శ్రీ వేటూరి ఆనంద మూర్తిగారు శతకాల గురించిన ప్రస్తావనలో ఇలా పేర్కొన్నారు;

1 "తెలుగున ప్రాయికముగ 12, 13 శతాబ్దులందే యారంభమయి జన బాహుళ్యమున రూఢమయి పిదప విశేష ప్రచారముగాంచిన ఈ శతక వాఙ్మయ ప్రక్రియ యొక్క పుట్టుపూర్వోత్తరములు మిక్కిలి ప్రాచీనములనియు, దాని యునికి వేద, పురాణములందే బీజ రూపమున గానవచ్చుననియు, నదియే పిదప ప్రాకృత వాఙ్మయమున బిందువై విస్తరించి తరువాతి సంస్కృత కావ్యకవుల ప్రతిభాక్షేత్రమున భావగీతములవలె పుష్టిని జేకూర్చుకొని శతకమను పేర నోకవిలక్షణమగు ప్రక్రియగా తెలుగున వెలసినదనియు శతక వాఙ్మయ చరిత్ర కారులు శ్రీ వంగూరి సుబ్బారావు గారు విశదీకరించిరి".

వేదములలో శతయాతుడను నూరు మంత్రశక్తులు గలఋషి యుండుటయు; యజుర్వేదమునందలి భాగమగు 'శతరుద్రీయము'నకు శతకమను నామ ముండుటయు వివరించి 'ఈ శత సంఖ్యాన్వితమగు నిర్ణయము భక్త్యావేశము

---

* కాళ్ళకూరి కవుల కవులు—మూడు-శతకములు.
* శతకవాఙ్మయ చరిత్రము పు. 9-10.

చేతను జేసిన స్తోత్రములయిన భక్తిశతకముల యందుగూడ వ్యాపించినది' అని శ్రీ సుబ్బారావుగారు విశదీకరించారు.

స్తుతి ప్రధానమై సంఖ్యానియమం గలిగి శతకంగా సంస్కృత ప్రాకృతాల్లో వ్యాపిగాంచిన ఈ సాహిత్య ప్రక్రియయే అనంతరం తెలుగు భాషలో చోటు చేసుకుని విశిష్ట లక్షణయుతమై ప్రత్యేక వ్యక్తితాన్ని సంతరించుకున్నది.

పూర్వం కవులు ప్రౌఢరచనలు చేయడానికి ముందుగా భగవదనుగ్రహం కోసం, కవితాభ్యాసంకోసం శతకరచనను ఒక సాధనగా వాడుకొనే పద్ధతి ఉండేదట!

ఇంతకు మునుపే చెప్పినట్లు సంస్కృతప్రాకృతాలలో త్రిశతులు, పంచశతులు, సప్తశతులు, సహస్రిమిల్లా ఉన్నాయి. "మయూరుని సూర్యశతకము, భర్తృహరి సుభాషిత త్రిశతి మున్నగు శతకములు లౌకిక సంస్కృతమున కానవచ్చుచున్నవి. శ్రీ శంకరాచార్యులవారి శివానందలహరి వంటి స్తోత్ర గ్రంథములు గూడ శతకములుగనే పరిగణింపవచ్చును. ఇవిగాక సంస్కృతమున అష్టోత్తరశతనామస్తోత్రములు, సహస్రనామస్తోత్రములు పెక్కుగలవు. ప్రాకృతమున హాలుడు సంకలించిన గాథాసప్తశతి యేడు శతకముల సమాహారమని చెప్పదగియున్నది" అని ప్రముఖ పండితులు డాక్టర్ దివాకర్ల వేంకటావధాని గారు 'ఆంధ్ర వాఙ్మయ చరిత్రము'లో పేర్కొన్నారు.

తమిళ, కన్నడ, మలయాళాది భాషల్లో సైతం శతకాలున్న మాట వాస్తవం. అయితే ఆ భాషల్లో ఈ ప్రక్రియకు తెలుగులో ఉన్నంత ప్రాముఖ్యం లేదు. ఇంగ్లీషులో శతకాల్లాంటి రచనలున్నాయి. అయితే తెలుగు భారతి చేసుకున్న పుణ్యమో, ఆంధ్రభాషా మాధుర్యగరిమోగాని తెలుగులో శతక రచనకున్న ప్రతిష్ఠ, విశిష్టత మరే భాషలోను కానరాదు.

శతక రచనలో కంద పద్యానికి ప్రత్యేకత ఉన్నది. కంద గమనంలో కవికి ఒక సౌలభ్యం గోచరించింది. అందుకనే కంద పద్య శతకాలు విస్తృత ప్రచారం పొందాయి. తొలి శతక కర్తగా పేర్కొనబడుతున్న మల్లికార్జున

పండితారాధ్యుడు శివతత్త్వ సారంలో కందమే వాడాడు. రంగనాథుడి 'చంద్రాభరణా' అనే మకుటం గల శతకము కంద పద్యాలతో రచింపబడినదే. నీతిబోధకు కందం ఎంతో అనుకూలమైనదిగా కవులు భావించారు. తిక్కన సోమయాజి కూడా భారతంలో నీతులు చెప్పే సమయంలో కందాన్ని విరివిగా వాడాడు. 'తనువున విరిగిన యలుగుల...' ఇత్యాది పద్యాలందుకు ఉదాహరణాలు. ఆబాల గోపాలం నాల్కలపై నాట్యమాడే సుమతీ శతకంలోనివి కంద పద్యాలే! మధ్య యుగంలో మహోద్భుతంగా కందం నడిపినవాడు కుందవరపు కవిచౌడప్ప. చౌడప్ప పద్యాలు సరసుల్ని, రసికుల్ని గిలిగింతలు పెడతాయి చౌడప్ప తాను కందపద్య రచనలో దిట్టనని ఇలా చెప్పుకున్నాడు-

"ముందరజను దినములలో
కందమునకు సోమయాజి ఘనుడందురు, నే
డందరు ననుఘనుడందురు
కందమునకు కుందవరపు కవిచౌడప్పా"

ఆటవెలదిలో వేలాది పద్యాలు చెప్పినవాడు వేమన. 'విశ్వదాభిరామ వినురవేమ' అనేది మకుటం. ఇంచుమించు నాల్గవ పాదమంతా మకుటమే. ఇలా పాదమంతా మకుటమున్న శతకాలు మరికొన్ని ఉన్నాయి: కూచిమంచి తిమ్మకవి శతకంలో 'చిరవిభవా! విజిత చిత్తభవా! అభవా! మహాభవా!" అనేది పూర్తి పాదం మకుటం. కాసుల పురుషోత్తము కవి శ్రీకాకుళాంధ్రదేవ శతకంలో సీసంమీది ఎత్తు గీతిలోని చివరి రెండు పాదాలూ మకుటమే–

"చిత్రచిత్ర ప్రభావ దాక్షిణ్య భావ
హతవిమతజీవ శ్రీకాకుళాంధ్ర దేవ!"

మూడవ పాదంలో కొంత భాగముండి, నాల్గవ పాదమంతా నిండివున్న మకుటాలు గల శతకం ఉద్దండరాయ శతకం. ఆ మకుటమిది :

...మద్ధాలి యుద్దండరా
యజయశ్రీ సువిధేయ భక్తజనగేయా నిత్య భాగ్యోదయా !

సాధారణంగా మకుటాలు సంబోధనాంతంగా ఉంటాయి. కానీ "గోపాలుడు భ్రంగశాయి మనపాల గలండు విచార మేపికిన్" అనే తీరుగా రంగశాయి శతకాల్లో మకుటం కనిపిస్తుంది. ఇలా పరిశీలిస్తూ పోతే ఎన్నో విశేషాలు, వింతలూ కూడా మనకి శతక వాఙ్మయంలో గోచరమవుతాయి. శతకాలకు సంబంధించి ఎన్నో సూక్ష్మ విషయాలను శ్రీ నిడుదవోలు వేంకటరావు గారు లోకానికి వెల్లడించి ఉన్నారు. ఆధునిక కాలంలో కూడా ఎందరో కవులు శతక రచనలు చేశారు, చేస్తున్నారు, ప్రాచీన సాహిత్యాన్ని నిరసించేవారే శతక రచనలు చేశారంటే శతక వాఙ్మయం యొక్క సార్వజనీనత, సార్వకాలీనత స్పష్టమవుతాయి.

శతకం తెలుగు సాహితికి - రవ్వల పతకం!

# రామదాసు కీర్తనలతో రామమయమయిన తెలుగు సాహిత్యం!

శ్లో॥ శ్రీరామం జనకాత్మజాకుచతటీ శ్రీగంధ పంకోల్ల స
ద్వక్షో వీధిముదార మాశ్రితమునీ ప్రాదుర్భ వత్కల్పకం
బ్రహ్మేశాన ముఖామరస్తు తమజం బ్రహ్మాండ భాండాధిపం
వందే కోసల కన్యకాసుతమహం వార్రాశి గర్భావహమ్ ॥
(భద్రాచల మహాత్మ్యం)

శ్రీరాముని పేరు వింటే పరవళ్లు తొక్కుతుంది తెలుగు హృదయం-సీతమ్మ పేరు వింటే పాలకడలిలాగా ఉప్పొంగుతుంది తెలుగు తల్లుల మనస్సు!

శ్రీరాముడు తెలుగు వారి ఆరాధ్యదైవం. భారతీయులకు పారమార్థిక చింతన ఎక్కువ అన్నది ప్రపంచం గుర్తించిన సత్యం. అందులోను ఆంధ్రులకు శ్రీరాముడంటే ఉండే భక్తి. ప్రేమ చెప్పనే అక్కర లేదు. రామభజనల రూపంలోను, సీతమ్మ మేలుకొలుపుల రూపంలోను శ్రీరామ నామం ప్రతి తెలుగు హృదయంలోను ప్రతిధ్వనిస్తూనే ఉంటుంది. అసలు తెలుగు దేశమే రామమయమై రాజిల్లుతుంటుంది.

ఆంధ్ర వాగ్గేయకారులందరూ శ్రీరామచంద్రుణ్ణి పారవశ్యంతో కీర్తించినవారే. రామభక్తి పారమ్యమే ఆంధ్ర గేయ వాఙ్మయానికి బాటగా, బాసటగా నిలిచిందనటం అత్యుక్తి కాదు. తెలుగుదనపు తేనెలూరే భక్తి భావ బంధురములైన రామదాసు కీర్తనలు - రామభక్తి పారవశ్యంతో వెలువడినవే.

కారాగారం గోడల మధ్య అమానుష శిక్షలకు, కఠిన పరీక్షలకు గురి అయి కృశించి రామ కటాక్షం కోసం తపించి బాధామయ హృదయంతో ఆల పించిన అమరకీర్తనలే భక్త రామదాసు కీర్తనలు.

రామదాసు పూత చరిత్ర ఎరుగని తెలుగువారు అరుదు. ఈ మహా భక్తుడు 17 వ శతాబ్ది వాడని చారిత్రక నిరూపణ. అంటే త్యాగయ్య కంటే పూర్వుడని స్పష్టం. రామదాసు ఇంటిపేరు కంచెర్లవారు. ఇతని తల్లిదండ్రులు లింగన్న, కామాంబలు. వీరికి శ్రీరాముని దయతో లేకలేక ఒక కుమారుడు జన్మిం చాడు. అతడికి గోపన్న అని నామకరణం చేశారు. ఈ కంచెర్ల గోపన్నే రామ నామానుర క్తుడై, మహాభక్తుడై రామదాసుగా వాసికెక్కాడు. పసితనంలోనే ఇతని తల్లి నిరంతరం రామాయణం వల్లిస్తూ వుంటే రామదాసు ఆ భక్తి మార్గాన్ని తన ధ్యేయంగా ఎన్నుకొన్నాడు. తల్లినుండి రామచరితాన్ని విన్న చిన్ననాటనే రామ దాసు "ఆనపుట్టే శ్రీరాములతో ఆహా! నే పుట్టనయితిని-రఘురాములతో అయ్యో నే పుట్టనయితిని" అని వాపోయాడు.

రామదాసు యుక్తవయస్కుడై కమలాంబను వివాహమాడాడు. కుటుంబ బాధ్యతలు స్వీకరించాడు. వివాహమయిన కొద్ది కాలానికే అతని తల్లిదండ్రులు దివంగతులు అయ్యారు. కమలాంబ భర్తతో భక్తిలో, బాధ్యతలో పాలుపంచు కొన్నది.

ఒకనాడు ఒక భక్తుడు బైరాగి వేషంలో రామస్మరణం చేస్తూ రామ దాసుకు తారసపడ్డాడు. అతని భక్తి పారవశ్యానికి, గాన మాధుర్యానికి రామదాసు హృదయం ఉప్పొంగి అతని సన్నిధికి చేర్చింది. రామదాసు ఎదనిండిన భక్తిని అవగతం చేసుకొన్న ఆ మహనీయుడు "శ్రీరామ రామ రామేతి రామే రామే మనో రమే, సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే" అని తారక మంత్రం ఉప దేశించాడు. అతడెవరో కాదు- భక్తాగ్రేసరుడైన కబీరుదాసు. తారక మంత్రోప దేశం పొందిన రామదాసు భక్తి పారవశ్యంతో

"తారక మంత్రము కోరిన దొరికెను
ధన్యుడనయితిని ఓరన్నా"

అంటూ గానం చేశాడు. అప్పటినుండీ రామదాసు తన కీర్తనలతో భగవంతుణ్ణి స్తుతిస్తూ గడపసాగాడు.

రామదాసు సమర్థతను గుర్తించిన తానీషా ప్రభువు అతణ్ణి భద్రాచలానికి తాసిల్దారుగా నియమించాడు. ఉద్యోగరీత్యా భద్రాచలం వెళుతూ ఆ భద్రగిరిని చూసి

"ఇదిగో భద్రాద్రి గౌతమి
ఆదిగో చూడండి"

అంటూ ప్రాకారమండపాదుల్ని వర్ణించసాగాడు. గోదావరీ తీరాన నెలకొనివున్న భద్రగిరి మన దేశంలో ఒక గొప్ప పుణ్యక్షేత్రం. ప్రతి సంవత్సరం చైత్ర మాసంలో శ్రీరామనవమి నాడు ఆ పుణ్యక్షేత్రం అసంఖ్యాక భక్తజన సందోహంతో రామమయమై విరాజిల్లుతుంటుంది. శిథిలావస్థలో ఉన్న రామాలయాన్ని రామదాసు ఎవరినీ లెక్కచేయక తాను తాసిల్దారుగా వసూలు చేసిన ఎంతో ధనం వ్యయపరచి పునరుద్ధరించాడు. ఆ మహాభక్తుణ్ణి జగద్రక్షకుడైన శ్రీరామచంద్ర ప్రభువు ఎన్నో పరీక్షలకు గురిచేస్తూనే కాపాడుతూనే వచ్చాడు. శ్రీకృష్ణదేవ రాయల కాలంలో విరుపణ్ణ అనే భక్తుడు కూడా రామదాసు మాదిరిగానే తను వసూలు చేసిన సొమ్ముతో వీరభద్ర దేవాలయాన్ని పునరుద్ధరించాడు.

ప్రభుత్వధనాన్ని వెచ్చించినందుకు రామదాసును తానీషా ఖైదులో వుంచి ఎన్నో కష్టాల పాలుచేశాడు. భోజనంలో ఉప్పు కలిపి పెట్టి బాధింప చూచాడు. అయినా ఆ పరమ పావనుడు ముట్టిన ఆ అన్నం మృష్టాన్న భోజనమయింది. ఇది గమనించిన తానీషా భటులు ప్రభువు అనుజ్ఞపై

"ఓరి పాతకుడ, నీ యుబ్బడంబెదము
వేరు బుద్ధులు మాని వినుము మా పలుకు
గొబ్బున చెల్లింపు గోల్కొండ సొత్తు
నిబ్బరంబున నుంద నీ యబ్బ సొమ్మో"

అంటూ నానా హింసలు పెట్టసాగారు. ఆ బాధకు తాళలేక రామదాసు

"దీక్ష వహించి నా కొలది దీనుల నెందర గాచితో జగ
ద్రక్షక మున్న నా ద్రుపద రాజతనూజ తలంచి నంతనే
నక్షయమైన పల్వలిడి తక్కట! నా మొర నాలకించి ప్ర
త్యక్షము గావదేమిటికి దాశరథీ కరుణాపయోనిధీ!"

అని మొర పెట్టుకొంటూ

"ఏడనున్నాడో - భద్రాద్రి వాసు
డేడనున్నాడో
నా పాలి రాముడేడనున్నాడో
ఏడనున్నాడో గాని-
జాడ తెలియ రాదు" అంటు గానం చేయసాగాడు.

"కుక్షినజాండపంక్తు లొనగూర్చి చరాచర జంతుకోటి సం
రక్షణ చేయు తండ్రివి, పరంపరగా తనయుండనైన నా
పక్షము నీవుగావగద పామరుడన్ గరుణింపుమో జగ
ద్రక్షక కర్త నీవు గద దాశరథీ కరుణాపయోనిధీ!"

"ఎటుబోతివో రామ ఎటు బోతివో
ఎటుబోతివో నిన్ను నే వేడుకొనుచుండ"

ఎంత వేడినా శ్రీరాముని కటాక్షం లభించలేదు.

"అప్పులవారొచ్చి అరికట్టుచున్నారు
ఒప్పుకోబడునని చెప్పక దాగినావే"

అని కొంచెం కోపంగానే రామున్ని అడిగి

"ఏలాగు తాళుదు ఏమిసేతు రామా
ఈ జాలి చేతను తాళజాలను రామా!"

అంటూ దీనంగా ప్రార్థించాడు.

"రక్షించే దొరవని నమ్మితి
నన్ను శిక్షింప తప్పేమి చేసితి
రక్షించ మీకంటె రక్షకు లెపరున్నారు"

అంటూ వేడుకొన్నాడు.

ఎన్ని బాధలు పెట్టినా భరిస్తున్నాడని, ఏ విధంగాను సొమ్ము ఇచ్చేట్లు లేడని తానీషా రామదాసు చేతులకు కోలను వేసి దండించమన్నాడు. ఆ బాధతో రామదాసు ఇలా ఆర్తనాదం చేశాడు.

"అబ్బబ్బ దెబ్బలకు నేనోర్వలేరా
జబ్బసేయక రారా తబ్బిబ్బాయరా
అట్టి నిను పూజించినట్టి చేతుల నిదిగో
కట్టి కట్టి కొట్ట నెట్టు తాకుదునయ్యా!"

తానీషా దండన మితిమీరింది. అప్పుడు రామదాసు తాను నమ్మికొన్న రాముణ్ణి

"ఓ రఘువీరా యని నే పిలిచిన
ఓహో యనరాదా
నీటజిక్కి కరి మ్రొక్కిన వేసరి
నాటక ధర నీ పాటలు పాడగా
మేటి మకరి తల మీటి
కాచు దయ యేటికి నాపై ర్రాదో
మున్ను సభను ఆపన్నత వేడుచు
మిమ్ము కృష్ణ యని ఎన్నగ
ద్రౌపది కెన్నో పలుపలిచ్చి
మన్నన బ్రోచిక వెన్నుడా
నా మొర వింటివో లేదో"

అంటూ ప్రార్థించాడు. చివరికి తాను చేసిన ఖర్చును లెక్కకట్టి మరీ చూపించాడు.

"చుట్టూ ప్రాకారములు
సొంపుతో కట్టిస్తి రామచంద్రా
ఆ ప్రాకారము'కు బట్టి పడివేల వరహాలు రామచంద్రా

గోపుర మండపాలు కుదురుగా గట్టితి రామచంద్రా
నన్ను కొత్తగా చూడక ఇత్తరి బ్రోవుము రామచంద్రా
భరతునకు జేసితి పచ్చల పతకము రామచంద్రా
ఆ పతకమునకు పట్టే పదివేల వరహాలు రామచంద్రా
శత్రుఘ్నునకు నేను చేసితి మొలత్రాడు రామచంద్రా
ఆ మొలత్రాటికి పట్టే మొహరీలు పదివేలు రామచంద్రా
లక్ష్మణునకు చేయిస్తి ముత్యాల పతకము రామచంద్రా
ఆ పతకమునకు పట్టే పదివేల వరహాలు రామచంద్రా
సీతమ్మకు చేయిస్తి చింతాకు పతకము రామచంద్రా
ఆ పతకమునకు పట్టే పదివేల వరహాలు రామచంద్రా
కతికి తురాయి నీకు కుదురుగా చేయిస్తి రామచంద్రా
ఆ తురాయికి పట్టే పదివేల వరహాలు రామచంద్రా !"

ఈ ఖర్చంతా ఎవరిచ్చారు అని అడిగి, నీ తండ్రిగాని, మామగాని ఇవ్వలేదని చెప్పి ఎంతకీ పలుకని రాముని మీది కోపంతో

''నీవు కులుకుచూ తిరిగెద వెవడబ్బసొమ్మని రామచంద్రా''

అని తిట్టాడు. అంతలోనే తేరుకొని

''అబ్బా తిట్టితి ననీ ఆయాసపడవద్దు రామచంద్రా
ఆ దెబ్బల కోర్వక అబ్బా తిట్టితినయ్యా రామచంద్రా''

అని సంజాయిషీ చెప్పుకున్నాడు. ఈ విధంగా తన మనఃస్థితి కనుగుణంగా కాసేపు ప్రార్థిస్తూ, కసేపు ఆక్షేపిస్తూ, చివరికి ఆ సీతమ్మ తల్లి మనసైనా కరుగు తుందేమో ననే ఆశతో-

''నను బ్రోవమనిచెప్పవే
సీతమ్మ తల్లీ
నను బ్రోవ మనీ చెప్పవే''

అని మొర పెట్టుకున్నాడు. ఇలా 14 సంవత్సరాలు దుర్భర కారాగార జీవితం గడిపి, ఆ సమయంలో వివిధావస్థలలో భక్తిని, కరుణను, వాత్సల్యాన్ని కల

బోసి రామణ్ణి గానం చేసి తుదకు ఆ ఆపన్నశరణ్యుడి దయకు పాత్రుడై ధన్యత నందాడు.

"పలుకే బంగారమాయెనా", "ఏ తీరుగ నను దయ జూచెదవో ఇన పంశోత్తమ రామా", "ఏమయ్య రామ బ్రహ్మేంద్రాదులకునైన నీ మాయ తెలియవశమా?" ఇత్యాది అనేక కీర్తనలు తెలుగునోట ప్రతిచోట నిరంతరం వినిపిస్తూంటాయి.

అజరామరమైన కీర్తనలతో ఆంధ్ర గేయవాఙ్మయాన్ని పరిపుష్టం చేసిన రామదాసు కీర్తి రామనామం లాగా నిరంతరమైనది.

# ప్రజాకవిత—పాఠ

కావ్య పరమార్థాన్ని గురించి లాక్షణికులు ఎన్నెన్నో లక్షణాలను, లక్ష్యాలను చెప్పి, ఆనాటి సంఘ మర్యాదలకూ, సామాజిక వాతావరణానికీ తగినట్లు కొన్ని నిర్దేశిక సూత్రాలను ప్రవచించిపెట్టారు.

అసలు కావ్యాత్మను సామాజిక దృష్టి నుంచీ, తృక్పథం నుంచీ పరిశీలించినప్పుడు అంతమంది ప్రాచీన ఆలంకారికులు ఒకరితో ఒకరు ఏకీభవించకుండా ఒక్కొక్కరూ తలొక్క రీతిగా సాహితీ ధర్మాన్నీ, కవితార్థసారాన్నీ వివరించడం ఏమిటీ అని ?

అప్పుడూ ఖండన మండనలు లేకపోలేదు. లక్షణాలను ధిక్కరించి, లక్ష్యాలనే ప్రబోధించడానికి వారికి తోచిన ఆనుకూలమూ, సామకూలమూ అయిన ఛందస్సూత్రాలతో అక్షరాలకు చెవిపోగులూ కుట్టించారు – రుద్రాక్ష తావళాలూ అల్లించారు.

అప్పుడూ ప్రాచీన కవులలో ఏకీభావం లేదు సరికదా - ఒకరి ఆశయాన్ని మరొకరు ఎద్దేవా చేయడం పుణికిపుచ్చుకున్నట్లుగా అలనాటి ప్రబంధ సుందరీ అలంకరణల నుంచి మొన్నటి పలనాటి వీరుల చరిత్రదాకా ఎన్ని మార్గాలు, ఎన్ని పాయలు, ఎన్నెన్ని విమర్శలు?

అంటే– నాడూ ఉన్నదే సాహిత్య ప్రయోజనం ఏమిటి? సాహిత్య పరమార్థం ఏమిటీ అనే ప్రశ్న!

ఆలా అలా మారుతూ, పారుతూ ప్రవహించిన సాహితీసాగరంలో ఎన్నెన్ని విశేషాలో ప్రాచీన భారతీయ సాహితీ చరిత్రలో మనం చూశాం.

సాహిత్యం పరిణామశీలి! అన్నది నిజం.

నాటి కవులూ ఘంటాన రచియించి, కంఠాన పలికించి- అప్పటి సాహితీ నందనంలో కవిత్ర కోయిలచేత కుహు కుహూ రాగాలు పలికించారు. రంగు రంగుల పుష్పకదంబాలనూ విరబూయించారు.

మారేది కాలం కనుక- మారుతూ వచ్చింది కాలం!

సాహిత్యం పరిణామశీలమైనది కనుక క్రమానుగతవికసనంతో ఆటు పోటులను తట్టుకొంటూ, నేటి సామాజిక వాతావరణానికి,రాజకీయ పరిస్థితులకూ, నవతరపు ఆశల ఉచ్ఛ్వాసనిశ్వాసాలకూ తగినట్లుగా కవితారూపం, సాహిత్యావలోకనం- పరిఢవిల్లుతూ వచ్చింది.

గతంలో ఏది రాసినా చూడని ఒక మూఢనమ్మకాన్ని కావ్యవస్తువుగా చేసి–నమ్మించడానికి అప్పటి అధ్యాత్మిక సమాజం ప్రయత్నించిం దనిపిస్తుంది. ఎందుకయ్యా అంటే–ఇప్పటికీ అ స్తవ్య స్తంగా నమ్మలేని నిజాలుగా,అభూత కల్పనా కథాకావ్యాలుగా దేశంమీద, జాతిమీద, సమాజంమీద బలమైన ప్రభావతాముద్రను వేసిన అనేక పురాణాలూ, చరిత్రలూ ఖండనమండనలతో నవతరానికి రోతపుట్టిస్తూన్నాయనడానికి ఇటీవలి కాలంలో, భారతం అసలు జరిగిందా? రామాయణం నిజమేనా? అన్న చర్చ మేధావివర్గంలో ఆపూర్వ సంచలనాన్ని కలిగించి, ఆ గ్రంథాల ఉనికినే రచ్చకీడ్చి, బండవేసి, దండోరా వేయించిన దుమారం మరచిపోలేం కదా ?

ఏతావాతా- ఎందుకు చెప్పొచ్చానంటే- మారిన, మారుతున్న సామాజిక పరిస్థితులను, రాజకీయ, ఆర్థిక, సాంఘిక పరిణామాలతో అవగాహన చేసు కొన్నప్పుడు-

సాహిత్య పరమార్థం-అభూత కల్పనా చాతుర్యంతో కూడిన విన్యాసం కానక్కరలేదని, చచ్చాక జరిగే అస్థిపంజర హరికథాకాలక్షేపం అవసరంలేదని మారినచరిత్ర ఘోషిస్తూ వస్తూనే ఉంది.

గతాన్ని తిట్టడం, నమ్మకాలను దుయ్యబట్టి ఆసభ్యపదజాలంతో ఫాతని రోతగా చిత్రించ నవసరంలేదు. హృదయాలలో భావస్పందనను తీసుకు రావాలి.

వేయి పూవులు వికసించనీ ! వేయి మరిమళాలు పరిమళించనీ ! ! అదే సాహితీ సందర్శన మూ ర్తికి ధ్యేయం కావాలి.

నేడు మనం సామాన్యుల భాషలో చెప్పుకునే సూ క్తి ముక్తాయింపులూ, భజగోవిందనామ సంస్మరణలూ, చీకటిసమర నాదాలూ, వెలుగు బావుటాల ఆవిష్కరణలూ జరగక పోలేదు.

అలా కొంతలో కొంత సామాజికదృక్పథంతో సాహిత్య సింహావలోకనం చేస్తూ - వస్తూన్న సంప్రదాయానికి కొంచెం మార్పును సూచిస్తూ, కొ త్తను జోడిస్తూ వచ్చారు కనుకనే నేడు మనం సాహిత్యావలోకనంలో వెతుకుతూన్న కొ త్తప్రక్రియలు ఎన్నో చూడగలుగుతున్నాం.

నదీప్రవాహంలాంటిది కాలం ! కాలంతో మారేది సాహిత్య పరిణామం.

అదీ ఆధునిక చేతనావిష్కరణానికి స్వాగతం పలికే కొ త్త గొంతు ఆశించే ధర్మం - నిర్మించే బాట - సాగించే ప్రస్థానం.

ఇన్ని జరిగినా సాహిత్యం ఇదీ అని కాని, కవితాత్మకు ఇదితప్ప వేరే ధ్యేయం, దృక్పథం లేదని కాని గిరిగీచి చెప్పినవారు ఎవరు?

ఎవరు చెప్పింది ఎవరు విన్నారు కనుక, ఎవరు వేసినబాటను మరొకరు నడిచారు కనుక?

అలా నడిచే ఉంటే-నేడు సాహితీలోకంలో ఇన్ని మతాల పతాకాల ఛాయల నీడల్లో, నినాదాల రణగుణధ్వనుల్లో కవితాప్రపంచం వికావికలై ఉండేది కాదేమో?

ఔనన్నా, కాదన్నా ఇది జరిగిన సత్యం !

ఆ స్తమానం చర్చించుకోడం చర్విత చర్వణం ! లేకుంటే - కావ్యసృష్టికి ఇన్ని రాద్ధాంత సిద్ధాంత చర్చలా ?

సాహిత్య పరమార్థానికి ఇన్ని రకాల గొంతుల రణన్నినాదాలా ?

ఏది ఏమైనా నేడు మారుతున్న ప్రపంచ వరిణామ క్రమవికాసంలో యువతరపు ఆశల ఆశయాల పరవళ్లు చెప్పే సత్యాలు కోకొల్లలు.

చీకటి పోవాలి ! ఎవరూ కాదనరు. తమసోమాజ్యోతిర్గమయ అన్నా, చీకటి నుంచి వెలుగుకు అన్నా ప్రపంచ మానవాత్మ ఆశయం ఇదే.

అయితే చిక్కెక్కడ ?

ఈ చిక్కు విడేదెట్లా ?

అనేక దేశాలలో పరిస్థితులు మారాయి. సామాజిక శ్రేయస్సే పరమ లక్ష్యంగా ప్రజలూ, ప్రభుత్వాలూ, సాహితీలోకం, మేధావివర్గం వారూ మారారు. మారాలికదా మరి !

మారం, గతాన్ని వదలం అంటే ఎలా ?

కాలప్రభావంవల్ల నేడు పాత ఎవరినీ ఆకర్షించనప్పుడు, జనం అర్థంచేసుకొనేదీ, జనం జగం కోరేదీ, సమాజానికి అవసరమైనదీ, సమాజ శ్రేయోదాయకమైనదీ ఏదో 'ప్రస్తుతం' గుర్తించాలి.

గుర్తించండీ–అనే ప్రజాహృదయం ఘోషిస్తూంది.

గుర్తించం అంటే - ఎదిరించమంటూంది.

అంతేనా- యువత జలపాతమై విరుచుకుపడుతూంది !

అలాంటి మార్పును - కొత్తని, రేపుని, సమాజాన్ని -అందరికీ కావాలసి గొంతెత్తి అడుగుతూన్న వారు ఎందరో.

అందులో ఒక్కొక్కరిది ఒకొక్కపద్ధతి.

అందరిదీ ఒకే పద్ధతి అయితే ప్రపంచం ఇలా ఉండేదికాదు.

మార్క్సిజం ఒక్కటే ! - దానికి భాష్యాలూ, భాష్యకారులూ ఎంత మందో ?

పెట్టుబడిదారీ విధానం నాశనం కావాలనీ, సామాన్యుడు అసామాన్యుడు కావాలనీ, సమసమాజం పరిఢవిల్లి నవసమాజంలో అందరికీ సౌఖ్యం అందాలనీ మార్క్సిజం కోరుతుంది.

ఇది నిజంగా అందరూ కోరేదే !

వస్తే, సాధిస్తే మరీ మంచిది.

ఏది ! రష్యాలో ఒకతరహా మార్క్సిజం, చైనాలో మరో మార్క్సిస్టు అవగాహన, క్యూబాలో మరోపద్ధతి, యుగోస్లావియాలో మార్క్సిస్టు విధాన అనుసరణం వేరు.

భారతదేశంలోనూ ఎన్నిరకాల మార్క్సిస్టు వర్గాలు - దానికి ఎన్నెన్ని భాష్యాలు !

ఆయావర్గాల సిద్ధాంతాలను నమ్మి, 'కమిట్‌మెంటు' అన్న నినాదంతోనూ సాహిత్యసృష్టి చేసే వారిలోనూ అన్నివర్గాలూ, మరిన్ని మార్గాలూ, కోకొల్లల నినాదాలూ, వాద ప్రతివాదాలూ !

అందుకే తెలుగుకవులలోనూ ఎన్నిసంఘాలు, ఎన్నిమార్గాలు, మరెన్ని వర్గాలు, గ్రూపులు - మఖలోపుట్టి పుబ్బలో మాడిపోవడాలు.

ప్రబంధకవులమీద తిరుగుబాటుగా భావకవులు, వారిమీద దాడిలా అభ్యుదయ కవితోద్యమం, వారిమీద ఆసంతృప్తితో దిగంబరకవులు, అక్కడినుంచి విప్లవకవులు - వీరేదో మంచో, చెడో చేస్తున్నారన్నట్లుందే అని అనుకొనేలోగా నలుగురూ నాలుగు పక్కలకూ మూటా ముల్లే కట్టేశారు.

తిరిగి మళ్ళీ ఓ ఆశ ! ఓ నలుగురిని చేర్చి ఒకటో రెండో సంస్థలు - తీరా చూస్తే కాస్తో, కూస్తో ఒక స్పష్టమైన ప్రణాళిక, ఒక పద్ధతిలో రాజకీయాల జోలికిపోని రచయితల సంఘాలే నలుగురినీ కూడగట్టుకొని వస్తూన్నట్లుగా అనిపిస్తూంది.

పైన చెప్పినవారేనా - జనసంఘం మైండ్‌గలవారు ప్రాచీన అభ్యుదయ భావ మిశ్రమకవులు, అనుభూతివాదులు, రసవాదులు, ఫ్రీవర్స్ ఫ్రంట్‌లు, కవి సేనలు, అరుణసాహితి, జనసాహితి, సాహితి - వీరూ ఎవరికీ తీసిపోలేదు.

ఎవరికి తోచిన మార్గంలో వారు సాహిత్యసేవ చేస్తున్నారు, ఇందుల్లో మేధావివర్గం, మేతావివర్గం అంటూ ఏముంది ?

వారిని వీరూ, వీరిని వారూ అడే అంటున్నారు. మధ్యన పాఠకులే తికమక పడవలసి వస్తూంది.

ఒక మాట నిజం.

తమ ఆశయం ఇది, ధ్యేయం ఇది, గమ్యం ఇది అని దాపరికం లేకుండా-పదునుబెట్టిన కత్తిలాగా-హోరెత్తే జలపాతంలాగా చెప్పడంలో ఉంది నిజాయితీ.

అందుకే అటువంటి యువతరం సాగించే ప్రస్థానంవైపు సమాజం ఆశతో ఎదురు చూస్తూంది- అలా ఎదురు చూడడంలో ఆశ్చర్యం ఏముంది ?

ఇప్పుడు ప్రధాన విషయం ఇరవైసంవత్సరాల ఈ మధ్యకాలంలో ఆధునికాంధ్ర సాహిత్య పరిణామం - అందులో ప్రజాకవిత - ఆ ప్రజాకవితలో -పాట అన్న విషయం.

అందుకని ప్రజాసాహిత్యంలో పాటల పారిజాతాలను గురించిన విషయానికి వద్దాం.

— ప్రజాకవిత, ప్రజాప్రభుత్వం, ప్రజావాణి, ప్రజానాయకుడు-ప్రజాసాహితి-ఇవి ఎక్కువగా వినిపిస్తూంటాయి.

ప్రజాకవిత ! అన్నప్పుడు ఏది ? అన్న ప్రశ్న ఉదయించకమానదు.

కొందరిదృష్టిలో దేశాన్ని, రాష్ట్రాన్ని, ప్రభువుల్ని పొగడటం ప్రజాకవిత, కొందరికి ప్రజా సమస్యలకు సంబంధించి రాసిన విషయమే ప్రజాకవిత.

ప్రజాకవి ఎవరు ? అది ఈ రోజే కాదు. ప్రభువుని కాదన్న పోతన్న ప్రజాకవికాదా, రాజ్యాన్ని భోగించవలసిన యోగి వేమన్న ప్రజాకవి కాదా !

ఈ రెండు దశాబ్దాలుగా ప్రజలకోసమని కలంచేతబట్టి కంఠం విప్పిన వారు లేరా ?

ప్రాచీనవాదుల దృష్టితో ప్రజాకవిత వేరు, అభ్యుదయవాదుల దృష్టిలో ప్రజాకవిత వేరు.

విప్లవవాదుల భావంలో ప్రజాకవిత వేరు.

అందుకని - మనం ఆశించే, ప్రేమించే ఆశయాలు, అవగాహననుబట్టి ప్రజాకవిత, ప్రజాకవి, ప్రజాప్రభుత్వం, ప్రజలభాష, ప్రజాసమస్యలు అనేవి నిర్ధారణ అవుతాయి.

అసలు దేశానికి స్వతంత్రం వచ్చేనాటికే తెలుగుకవి భావం చాలాముందుకు సాగిందనే చెప్పాలి. అంటే స్వతంత్రం వచ్చినంత మాత్రాన అభ్యుదయ లేదా ప్రజాకవిత్వంలో పెద్దమార్పు-ప్రభావం ఏంకలగలేదనే చెప్పవలసి ఉంటుంది.

ప్రజాకవులు, ప్రజాసాహితి-కోరుకున్న సమాజరూపం, స్వేచ్ఛ ఇవి కావు-వారి ఆలోచనలోనిది మరో ప్రపంచం.

దేశానికి స్వాతంత్ర్యం వస్తే ఏదో జరుగుతుంది అనుకున్న యువతరం ఆశ నిరాశే అయింది.

అందుకే వారి సాహితీరంగంలో విప్లవ ప్రజాధోరణులు ఆగిపోలేదు.

ఇక్కడ ఒకటి గ్రహించాలి.

కవిత్వం నాడూ నేడూ ఏనాడైనా కారుణ్యావాచమూ ఒక ఆశయంగా పయనిస్తుంది. ఆది లోపిస్తే అది ప్రజాసాహితి అనిపించుకోలేదు.

ఏ రచనకైనా హృదయస్పందన కావాలి. కరుణభావం గుండెల్లో పొంగి పొరలాలి. అప్పుడే మనం చూసిన సంఘటనలను మన రచనల్లో ప్రతిఫలించ గలుగుతాము.

విశ్వజనీన కావ్యాలను రచించేకవి మహర్షివంటివాడు. అతనికి దర్శనశక్తి వర్ణనశక్తీ రెండూ ఉంటాయి. అందుకే-"నానృషిః కురుతే కావ్యం" అన్నారు.

విశ్వజనీనతలో హితం ఏ రూపంలో ఉన్నా ఉంచవచ్చు.

విశ్వమానవ పరిణామంతో పాటు కవితాలక్షణం కూడా పరిణామం చెందుతూంది. నేడు గేయకవులు తమ జీవితాల్లోని విచిత్రానుభూతుల్నీ, రసవత్తర సన్నివేశాల్నీ కలిపి రచనలు చేస్తున్నారు.

కవిత్వానికి పనికిరానిదేదీ లేదు ఈనాడు.

ఏది కవిత, కావ్యం, ప్రజాకవిత్వం అన్నప్రశ్న ఏదోరూపంలో అప్పుడూ ఉంది.

కవిత్వ తత్త్వ మీమాంస నిన్నటిదీ కాదు, మొన్నటిదీ కాదు – నేడూ జరుగుతూనే ఉంది. దీనిని ఒక్కొక్కరూ ఒక్కొక్క విధంగా నిర్వచించారు.

రసాత్మకమైన ఒక్క వాక్యమయినా కావ్యమే నన్నారు. రమణీయార్థ ప్రతిపదికమయితే అదీ కావ్యమే నన్నారు. సరే! అంతదాకా బాగానే ఉంది.

'విశ్వశ్రేయః కావ్యం' అని వక్కాణించారు. మరి దీని సంగతి ఏమిటి? ఈ నిర్వచనాలలో దేనిని మనం ప్రధానంగా తీసుకోడం? ఇందులో ఏది నిజం, ఏది ముఖ్యం?

కావ్యం కాగల రసాత్మకవాక్యమూ, రమణీయార్థాన్ని ప్రతిపాదించే శబ్ద విశేషమూ విశ్వశ్రేయస్సాధనకు ఉపకరించవలెననే నియమం ఏమున్నది?

సరసమైన సాయంకాల వర్ణన రమణీయంగానే ఉండవచ్చును. ఏ రాజునో పొగడిన పద్యం కూడా రసాత్మకంగానే ఉండవచ్చును.

కాని అవి విశ్వశ్రేయస్సును సాధించినవా?

సాధించిన వనుకొన్నారు ఆనాటి ఆ తరహా కవులు. కారణం? ఆ దర్బారు, ఆ రాజు అదే వారిలోకం. అదే వారికి కావ్యవస్తువు.

మరి నేడు అవి లేవు.

ఆధునిక యుగంలో అభ్యుదయ భావ ప్రేరితుడైన కవికి ప్రజలూ; ప్రజా సమస్యలే ఇతివృత్తాలు.

ఆకారణం చేతనే జానపద గేయాలు, పదాలు, పాటలూ అస్తైన సిస్తైన ప్రజాసాహిత్యం అన్నది నిర్వివాదాంశం.

మొట్టమొదటి ప్రజాసాహిత్యం జానపద కవితలే !

అందులో – మనిషిని మనిషిగా ప్రబతకమంటుంది. జీవితానికి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతో పాటు కర్తవ్యబోధ చేస్తుంది. త్యాగం సూచిస్తుంది. సమాజాన్ని కళ్ళకు కట్టినట్టు ప్రతిబింబిస్తుంది.

వీరుల గాథలూ, వీరపదాలూ జానపదాలలో కోకొల్లలు.

అందుకే దీనిని ప్రజాకవిత్వ మంటున్నారు. ఇవి ప్రజల కవితా మణిహారా లంటున్నాను.

శ్రీ కె. వి. రమణారెడ్డిగారన్నట్లు, ప్రజాకవిత్వం అంటే తిట్టడం, కొట్టడం, నరకడం, దుర్భాషలాడటం- కిట్టని వారిని, పట్టని వాటిని కుష్ఠు నామావళితో నోరుపారేసుకోడమే అంటే వారికో నమస్కారం.

కాని, సమాజ స్పృహతో సమాజానికి దగ్గరగా-నీతులూ, ప్రబోధాలూ కూడా అవసరమే కదా. మేమన్న చెప్పింది అందుకే ప్రజాకవిత అయింది.

గురజాడ గీతం ప్రజాకవిత అయింది. శ్రీ శ్రీ గీతం ప్రజాకవిత అయింది.

ప్రజలకోసం ప్రజలగురించి చెప్పిందీ ప్రతిదీ ప్రజా కవిత్వం అయింది.

ఇక్కడ ఒక్కమాట చెప్పదలచాను.

మార్క్సిజం, కమ్యూనిజం, కమిట్‌మెంటు ఇలాంటి నిబద్ధతలు నిండి ఉండాలి. అదే ప్రజాకవిత అంటే నేను ఏకీభవించలేను. యుపకవుల మీద, నేటి తరంమీద గతితార్కిక భౌతికవాద ప్రేరణ ఉంది-ఉంటుంది.

మొన్నమొన్నటి వరకూ- అంటే భావకవిత్వం మీద తిరుగుబాటు చేసే వరకూ, అభ్యుదయ రచయితలు జన్మించేవరకూ మార్క్సిజం ప్రధానంగా వీరిలో ధ్వనించినా, తిలక్ పంటి వారి కవితల్లో ప్రగతి గోచరిస్తుందే కానీ మార్క్సిస్టు ఛాయలు కానరావు.

మంచిని బోధించడానికి ఏ ఛందం అయినా బాగానే ఉంటుంది.

మార్క్సిస్టు అవగాహన ఉంటేనే ప్రజల పాటలు రాయగలడన్న సూత్రం ఏంలేదు. ఉంటే మంచిది.

జానపద సాహిత్యంలో ఎన్నో స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను వినిపించే పాటలు ఉన్నాయి—అనాడు మార్క్సిజం ఎక్కడిది? ఏ కమిట్‌మెంటు ఉంది?

సరే! అది అలా ఉంచుదాం.

భావగీతాలు—ఆ కాలంలోనే ప్రజల భాషలో, ప్రజల బాణీలో ఎంకి పాటలు, బంగారుమామ పాటలు వెలువడ్డాయి. ఈ నాటికీ వాటి ప్రాధాన్యం మనకు తెలిసిందే!

అవి ప్రజాకవితలా? అంటే మనం చూసే చూపునుబట్టి, ఆలోచనను బట్టి ఉంటుంది.

గురజాడను అందరూ ప్రజాకవిగా గుర్తిస్తున్నారా?

సమ సమాజ స్థాపనకు మార్క్సిజాన్నే ఏకైక సూత్రంగా అందరూ అందికరిస్తున్నారా?—ఇదీ అంతే!

ప్రబంధాలు, కావ్యాలు తాత్వికపుతాకిడి నుంచి భావకవితలు విడిసి విప్పారినాయి. అందుమీద అభ్యుదయకవులు ఉద్భవించారు.

తర్వాత తర్వాతి కాలంలో వచనకవితకు ప్రాచుర్యం లభించింది. అంటే రీతికన్నమాట.

వచనకవిత ఎక్కువగా మార్క్సిస్టు ప్రచారం, కమిటెడ్ సిద్ధాంతాలతో చాలా వెలువడినా, వచనకవితలోనూ చక్కని కవితారసాన్ని, రసవాదాన్ని ప్రవేశపెట్టపచ్చని నిరూపించిన కవితా సంపుటాలు—తిలక్ 'అమృతం కురిసిన రాత్రి', శేషేంద్రశర్మ 'శేషజ్యోత్స్న', ఎల్లోరా 'రేపటి వసంతం' మొదలైనవి.

అయితే ఒకనాడు మార్క్సిస్టు భావాలకే వాహికగా ఉన్న వచనకవిత పరిధి పెరగడం జరిగింది.

అభ్యుదయ కవులుగా పరిగణింపబడడానికి ఇష్టంలేని వారు సైతం వచన కవితా నిర్మాణాన్ని చేపట్టారు.

## ఈ రెండు దశాబ్దాలలో ప్రజాకవిత-పాట

ఈ ఇరవై సంవత్సరాల కాలంలో ప్రజాసాహిత్యం అంటున్న జానపద పాటలను, సినిమాకవులు హాయిగా అన్నింటినీ పల్లవులుగా, చరణాలుగా మలుచుకోవడం గమనించతగ్గది.

ఇది గొప్పమలుపు! ఎందుకంటే, తిరస్కృతాంధ్రవాఙ్మయంగా ఛాందసుల చేత పట్టాపొందిన ప్రజాకవితలు నేడు సినిమాలలో, పత్రికల్లో, రేడియోల్లో, టెలివిజన్‌లో, గ్రంధాలుగా ఎన్నోచోట్ల పీఠం వేసుకోవడం.

ఇదీ ఒక విశేషం !

మరిఒక ప్రత్యేకత ఏమిటీ అంటే విప్లవకవులూ, అభ్యుదయకవులూ, దిగంబరులు వేరు అనుకోండి. వీరంతానూ వీరితోపాటు- ఏ రాజకీయ సిద్ధాంతంతోనూ సంబంధలేని కవులు ప్రజాసమస్యలను జానపదసరళిలో ప్రజల పాటలుగా రాసి, పాడి ప్రచారం చెయ్యడం !

తమ సిద్ధాంతాల ప్రచారం ప్రజలకు దగ్గరగా వెళ్ళడానికి, గేయాలుగా కాకుండా పాటలుగా పాడుకోడానికి వీలుగా రాయడం అన్నది ఇప్పుడే కాదు, ఆదినుండి ఉంది. అయితే ఈ దశాబ్దికాలంలో ప్రజాసంఘాలలో- ప్రజాకవితలో పాట ప్రాధాన్యం వహించింది.

ప్రజను మేలుకొలుపడానికి, సమాజానికి మంచిని ప్రబోధించడానికి, దేశభక్తిని రగిలించడానికి, దోపిడికి ఎదురు తిరగమని చెప్పడానికి సరైన సామాజిక స్పృహ ఉండటం అవసరం. రాజకీయాల మలుపులన్నీ తిరుగగలరనుకోవడం భ్రమ.

ప్రముఖకవులు డాక్టర్ దాశరథి, నారాయణరెడ్డి, ఆరుద్ర, శేషేంద్ర శర్మ ఇలా ఎందరో-ఏ పార్టీకి చెందకనే విప్లవకవితావీణను మీటి ప్రజావాణిని కుదిపి కదిలించడం లేదా ?

భీమన్న, బాపురెడ్డి మొదలు, ఎందరో పాటలు రాశారు. చెరబండరాజు మొదలయినవారు పాటనే ప్రచారసాధనంగా ఆవిష్కరించారు.

ఈ 20 ఏళ్లలో కాస్త ఆటూ, ఇటూగా ప్రజాకవిత్వల్లో పాట ఎలా సింగారించుకొందో చూద్దాం.

ఇక్కడ రెండు పాటలు చాలాకాలంనాటివి స్మరించుకొని, ఈనాటి పాటల మధురిమను పరిచయంచేస్తాను.

'దేశమును ప్రేమించుమన్నా
మంచియన్నది పెంచుమన్నా
ఒట్టి మాటలు కట్టిపెట్టోయ్
గట్టిమేల్ తలపెట్టవోయ్'

అని గురజాడ ప్రబోధించారు.
ఏ పార్టీకోసం రాసింది కాదు ఇది.

అలాగే శంకరంబాడి సుందరాచారి ఎంత దేశభక్తిని ప్రబోధిస్తాడో—

'మా తెలుగుతల్లికీ మల్లెపూదండా
మాకన్న తల్లికి మంగళారతులూ
కడుపులో బంగారు, కనుచూపులో కరుణ
చిరునవ్వులో సిరులు
దొరలించు మా తల్లి'

ఈ రెండు రచనల్లో వారికి దేశమంటే ఉన్న అవగాహన స్పష్టతకమవుతుంది. అలాగే ఏనాడో రాసింది. గరిమెళ్ళ సత్యనారాయణది— 'మాకొద్దీ తెల్ల దొరతనము...'అనే పాట. ఈపాట నాటి సమాజాన్ని తట్టి మరీ కుదిపింది. జానపదగేయంలో ప్రజలపాట.

'ఊరిముందర చేను
చేయకుర అన్న
ఊళ్ళోన వియ్యంబు

అందకుర అన్న
ఊరిముందర చేను
కాకుల్ల పాలు
ఉళ్ళోన వియ్యంబు
మాటలా పాలు'

అలాగే—

'జప తపంబులకన్న
చదువు సాముల కన్న
ఉపకారమే మిన్న
ఓ కూనలమ్మా!—'

ప్రముఖాంధ్ర ప్రజాకవి ఆరుద్ర చేతితో చెప్పినట్లల్లా కొత్తగొంతులో ఎన్నో పాటలు ఈ కూనలమ్మ పాడింది.

అలాగే మరోటి— ఇది సినిమాపాట కాదు. ధీనినే సినిమాయలోకం దక్కించుకొంది.

'సిన్నీ నా సిన్నీ
ఓ సన్నజాజుల సిన్నీ
పొన్నపూల సిన్నీ'

ఇలా ఎన్నో!

అలాగే ఇదీ సినిమాలో వినిపించే ఉంటుంది.

'నల్ల నల్ల మబ్బునుండి లగ్గో పిల్లా
చేను చేను గలిసినట్టు లగ్గో పిల్లా
మేను మేను కలపరాద లగ్గో పిల్లా—'

ఇలా ప్రజల పాటలు అనేకమంది సినీకవులకు పాటలుగా మారి కీర్తిని ఇస్తూందడం గర్వకారణమే మరి!

అలాగే ప్రజాకవితలో నేటికవుల పాటలు కొన్ని :
కవి భీమన్న— 'గుడిసెలు కాలిపోతున్నై
ఓహో! కాలిపోతున్నై

ఎవరిగుడిసెలో పాపం
మాలమాదిగలవే అయి ఉంట్రై
గుడిసెలు మరెవరి కుంట్రై' ॥గుడి॥

తన జాజి పాటల్లో పైడిపాటి సుబ్బరామశాస్త్రి-
'నాచుదారులు పోక
త్రాచులా సాగాలి
రేచుల్రై ఒకరొకరు రెచ్చిపోవాలీ...'
అంటారు.

నిజాం నిరంకుశత్వంపై కవులు ఎలా విరుచుకుపడ్డారో పాటల్లో ఈ రెండు ల్లాంటి గెరిల్లా యాదగిరి భావాలు చూడండి.

'చుట్టుపట్టు సూర్యాపేట
నట్టనడుమ నల్లగొండ
ఆవాల హైద్రబాద
తర్వాతా గోలుకొండ
గోలుకొండజిల్లా క్రిందనే
గొరీ కడ్తాం కొడుకో
నైజాము సర్కారోడ
నాజీల మించినోడ'

ఈ పాట రచయిత ఆశలు ఫలించాయి. ఇతనిశాపంవల్ల నిజాంకు గోరీ కట్టడం జరిగింది.

— అనూచానంగా వస్తున్న ఈ జానపద గేయాల బాణీలలో, బాసలో అటు సినీమావారు, ఇటు ప్రజోద్యమాలకోసం రాసే కవులూ, అదే బాణీలలో రాజకీయ సమస్యలను ఇతివృత్తంగా తీసుకుని రచనలు చేయడం ఇక్కడ గమనించాలి. మచ్చుకు —

'నందామయా గురుడ నందామయా
అందరూ ఇది ఆలకించండయా
లాఘవంబుగ ప్రజలు లంఘించి తంతుంటే
తాత నొదిలీ తోక ముడిచారయా-'

యువకులు చాలామంది పాటలనే ప్రజాసమస్యలకు వాహికలుగా చేసుకోడం కనిపిస్తుంది.

'ఏమి బతుకిది-ఏమి బతుకన్నా
ఒక మెతుకు దొరకని
అతుకు గతుకుల బతుకు గిదిరన్నా-'

ఇలా సాగుతుంది.

అలాగే-మరో యువకవి తన నిప్పురవ్వల్లో-
'ఎగిలివారి పోతూందిరా
ఓ కూలన్నా
ఎండెక్కి పోతూందిరా !
ఎన్నాళ్ళీ చీకట్లో
దోబూచులాడతావు
భూదేవిని కన్నాడా
భూమి నాదె అంటాడు
ఒళ్ళొంచి దున్నాడా
ఒడ్లు నావె అంటాడు
నిజం తెలుసుకోని నడువరా
ఓ కూలాన్నా
సిప్పవయీ లేచి దుముకిరా
ఓ రైతన్నా !'

—విప్లవకవులు ప్రత్యేకంగా గేయాలూ, వచనకవితలవల్ల జనాన్ని కదిలించ లేమనీ, వారి శైలిలో వారి కర్థమయ్యే భాషలోనే వారి సమస్యలను ఎత్తిచూపడం అవసరమనీ, అందుకు పాడుకోడానికీ, ప్రచారానికీ, వీలుగా పాటలు రాయడం ప్రారంభించారు.

ఈ ఆలోచన, ఈ జానపద కళారూపాలను ప్రజావసరాలకు మలచుకొని ప్రచారసాధనాలుగా వాడుకోడం ప్రజానాట్యమండలి, అభ్యుదయ రచయితల సంఘం రెండు దశాబ్దాల క్రితమే ప్రారంభించాయి.

ప్రజాకవితలో ప్రత్యేకించి పాటకున్న ప్రత్యేకత చాలా విలువైనది.

తన భాషలో, తనకు వినబడే సంగీతలయలో - అంటే జానపదశైలిలో నడకలో పాట వింటే ఆకర్షితుడౌతాడు, కొత్త అని కానీ, అర్థం కానిది కానీ ఉండదు.

దానికి ఉదాహరణంగా చెరబండరాజు 'జన్మహక్కు' లో వాడిన వరుసలూ, భాష భావాలూ చూస్తే అర్థమవుతుంది.

చెప్పదలుచుకున్న వస్తువులోనే కాకుండా, చెప్పేరీతిలో కూడా వైవిధ్యం సాధించడం ఈ రకం రచయితలలో ప్రత్యేకత.

ఇదే పుస్తకానికి ఆముఖం రాస్తూ 'చేరా' అంటాడు—'ప్రజాకవిత్వం రాసేకవి ప్రజలకు సన్నిహితమైన ప్రకృతిని తన వస్తువుకు అనుకూలంగా వాడుకుంటాడు. ఈ పద్ధతి ఒకేసారి కవిత్వపు స్థాయిని పెంచుతుంది, ప్రజలకు సన్నిహితమూ అవుతుంది' అన్న మాట నిజం.

ఈ తరహా పాటలు-శివుడు, శివసాగర్, పాణిగ్రాహి, చెరబండరాజు మొదలయిన వారి పాటలు ప్రజల పాటలే.

వారి సిద్ధాంతాలతో మనం ఏకీభవించక పోవచ్చు.

సుంకర, వాసిరెడ్డి, నాజర్ మొదలయిన కవులు ఈ పనిని ఏనాడో చేశారు.

ఈనాడు ఈ కవులు చేస్తున్నారు. 'సరుడా-భాస్కరుడా' అన్న గేయం శివుడిది లక్షలాది ఆమాయకుల గుండెల్లో ధైర్యాన్ని, స్థైర్యాన్ని, ఆలోచననీ రేకెత్తించి బానిస సమాజంపై ఎదురుతిరగడానికి ఊపిరి నిచ్చింది.

ఎందుచేత ?

నేను ముందే నుడివినట్లు వారికి తెలిసే భాష, వారి యాసలో, వారి సమస్యలతో నిండిన పాట.

గుండెను కుదిపే పాట-అది ప్రజలపాట.

చెరబండరాజు అంటాడు —

'కొండలు పగిలేసినం
బండలనూ పిండినం
మా నెత్తురు కంకరగా
ప్రాజెక్టు గట్టినం
శ్రమ ఎవడిదిరో
సిరి ఎవడిదిరో'.

ఇలా అంతా సాగుతుంది.

ఇటీవలి కాలంలో జానపద శైలిలో రచనలే వస్తూన్నాయని చెప్పానుగదా!

ప్రజలను పోరాటానికి, ఉద్యమానికి ఆయత్తం చేయడానికీ ఈ యాసలో ఈ శైలిలో రచించేవీ ఉన్నాయి. రసవాదంతో, ప్రకృతివర్ణనాత్మకతతోనూ రచిస్తున్నవి ఉన్నాయి.

ఎంకి పాటలు, బంగారుమామ పాటలు. వీటిలో సమాజం, విప్లవం కనిపించవు.

అయితే ఏం- మనిషి కనిపిస్తాడు. మనసు కనిపిస్తుంది. బ్రతుకులోని ఆశల ఉచ్ఛ్వాస, నిశ్వాసాలు వినిపిస్తాయి. అందుకే అవి ప్రజల పాటలే అంటాను—ప్రజాకవిత్వమే అంటాను.

'పల్లెల్ల పొద్దు పొడిసింది'
అని యెల్దండ రఘురామా రెడ్డి రచన-ఇందులో చాలా విలువ గోచరిస్తుంది.
'సేతుల్ల సింతోల పండున్నదీ దాన్ని
సించంగ మీదపడె ఎరుకె తదీ
పల్లెల్ల తెలువని జనమున్నదీ వాళ్ళను
గిల్లంగ ఎగవడ్తె మరుకయితదీ' అని.

ఇది, సీతాఫలం పండు చించితే మీదపడ్డట్టు, ప్రజలను గిల్లితే తెలుస్తుంది పస అంటున్నాడు.

ఇటీవలే వరవరరావు రచించిన కవితా సంపుటిలో అంటాడు.

కొందరు కవులు ఏలినవారి అడుగులకు మడుగు లొత్తుతారూ అని-వారిని సర్కారీకవులు అంటాడు.

ఇక్కడే ఆలోచనాసరళి, అవగాహన, అంచనాలలో భేదం అంటున్నాను.

వామపక్ష పార్టీలు ఏలుతున్న రాష్ట్రమో, దేశమో అనుకుందాం. వారిని పొగిడే కవులు విరిదృష్టిలో సర్కారీకవులు కారా ? అంటే దీనర్థం యాంటీ ఎస్టాబ్లిష్‌మెంట్ అన్నమాట.

వారిని కాదనే మరోపార్టీ ఏలుతున్న రాష్ట్రంలోని వారే సర్కారీ కవులు.
ఇవి సిద్ధాంత భేదాలు.
ప్రజలు నిగ్గు తేల్చుకోవలసిన సత్యాలు. కాలం చెప్పే నిజాలు -

వరవరరావు పాటల్లో జానపదశైలీ విన్యాసం అంతగా లేదు చెరబండ రాజులా.

మచ్చుకు–

'పేద ప్రజల కష్టంలో
రగిలిన కోపాగ్నులం
పీడిత జన విప్లవాలు
పాడుతున్న రచయితలం...' అంటాడు.

ప్రకృతినుండి ధ్వనీ, ధ్వనినుంచి సంగీతమూ వుడుతున్నట్లుగానే ప్రజలతో ప్రజాసమస్యలతో సంబంధం ఉన్న కవిత ప్రజాకవితగా విలసిస్తుంది.

అందుకు పైనచెప్పిన పాటలు సాక్ష్యాలు. ప్రఖ్యాతకవి ఆరుద్ర కూసలమ్మచేత సమాజంలోని మంచి చెడులను చక్కగా చెప్పించాడు.

ఆయన, 'పైలా పచ్చీసు'లో అంటాడు-

'కేకేసి దూకండి
ఈ అగ్నిలోన
ఈ వేడి కన్నీళ్ళు
మనచెమట బిందువులె
ఈ బాధ నాపాలి
ఈ మంట నార్పాలి
కేకేసి దూకండి' అని-.
దీనివెనక సామాజిక చైతన్యం కనపట్టం లేదా!

సమాజిక స్పృహ, అవగాహన నిజమైన కవికి ఉంటుంది. అందుకే ఆరుద్ర అనగలిగాడు.

వాల్మీకి హృదయంలో కరుణ అనేది ఉంది కనుకనే పక్షి పరితాపాన్ని భరించలేక శోకించాడు, శ్లోకం రాశాడు. దానిని ఆ రోజున కమిట్‌మెంటనీ మార్క్సిజమనీ అనలేదు. కాని, ఆ దృశ్యాన్ని, ఆ సంఘటనని నేటికవులే చూస్తే ఏమనేవారు అన్నది నా ఆలోచనలో శిల్పించుకున్న భావచిత్రం.

ఆ ధర్మాన్ని సహించలేనివాడు కవి. అందుకే కవి జగత్తుకోసం తపిస్తాడు. అధర్మం అనుకున్నదానిని ఖండిస్తాడు.

కవి పుట్టుక కవి కోసం అంటే నేను ఏకీభవించను.

కవి మనిషిని బ్రతికించడానికి - సమాజాన్ని తట్టి మేలుకొలుపడానికి – ఇదే నా నిశ్చితాభిప్రాయం.

ఇక ప్రజాకవితను గురించి ఒక్కమాట చెప్పి ముగిస్తాను.
ఈశావాస్యోపనిషత్తు వర్ణించింది—
'యస్తు సర్వాని భూతాని ఆత్మన్యేవాను
పశ్యతి సర్వ భూతేషు చాత్మా
నం, తతోన విజుగుప్సతే' —అని.

అంటే ఇలా అర్థం చెప్పుకుందాం.

'ఎవడు సమస్త భూతాలలోనూ తన ఆత్మనే చూసుకొంటాడో వానికి అన్ని భూతాలలోనూ తానే కానవస్తాడు. జుగుప్సాభావం ఉండదు'-అంటోది.

ఈ స్థితి కవితాభ్యాసానికి అవసరం అంటే అభ్యంతరం లేదనుకుంటాను.

కవిత్వానికి ప్రాచీనత లేదు- ఆందుకు రామాయణం ఉదాహరణ. ఆందులోని సాంఘిక ధర్మం, అండులోని ఆలోచన కవిత్వం.

కనుక కవిత్వం మనిషిని, తద్వారా ,సమాజాన్ని మార్చాలంటే రాసే కవిత్వం సమకాలీన జీవన ప్రతిబింబం కావాలి. మనుషుల జీవన్మరణ సమస్యలతో నిండి నిబిడీకృతం కావాలి. అలా ఉండబట్టే జానపద గేయాలింకా బతికి బట్ట కడుతున్నాయి.

ప్రజాకవిత-అంటే అతనికి అర్థం అయ్యేభాషలో అతని సమస్యలను వినిపిస్తూ, తరణోపాయం చూపిస్తూ- కాంతిపథానికి, క్రాంతిపథానికి జనతను నడిపించే శంఖారావం కావాలి.

ఇది-పాటలో పాడుకునేటట్లు ఒక రాగయుక్తం, తాళయుక్తంగా ఉంటే అది ప్రజాకవిత అనీ, ప్రజలపాట అనీ నా అభిప్రాయం.

మచ్చుకు కవితలో-ప్రజాకవితలో రసవాదం—
సండూరి వారి జానపదశైలీ విన్యాసంలో-
"రవల వెలుగుల గంగి రమ్మందిరా యెంకి
శివమెత్తి తానాలు చేసిందిరా !"

తెలంగాణా ప్రజాకవిగా చాలామంది చేత గౌరవింపబడుతూన్న కాళోజీ కవితలో-

'దొంగలు దొంగలు
ఊళ్లు పంచుకొని
దొరలై వెలిగేదెన్నాళ్ళు?'

అని ప్రశ్నిస్తూన్నాడు. ఇదీ ప్రజాకవిత లక్షణం. ప్రజాకవి లక్ష్యం!

కవి గొంతు ఒక శాశ్వత నైతిక శంఖారావంలా నినదిస్తూనే-జనాన్ని కదిలిస్తూనే-దోపిడిగుంపులను ఒణికిస్తూనే ఉండాలని ఆశ-ఆ ఆశ ఫలించడానికి తగినబాట—పాట !!—

# జీవిత సత్యాలను

# చిత్రించే ప్రజా కవితలు

జానపద సాహిత్యం మన ఆచారాలు, నాగరకతా విలువలు ప్రతిధ్వనించే ఉత్తమ కవితా సంచయం. మన ప్రాచీన కావ్య సాహిత్యంలో జానపదులకు స్థానం కనుపించకపోయినా, జానపద సాహిత్యంలో మటుకు వాటి విరాట్ స్వరూపం స్పష్టంగా, పరిపుష్టంగా గోచరిస్తుంది.

తెల్లారకుండా లేవడం, గుంపులు గుంపులుగా కూడి నిద్రపోతున్న వారిని గూడా లేపడం, అక్కడ నుంచి ఆటలు, తరువాత ఉయ్యాల లూగడం - కడుపునిండా అట్లూ, తిమ్మనం ఆరగించడం ఎంత విచిత్రమైన పండుగ - అట్లతద్ది నోము !

నాలుగింటికే లేస్తారు మగ పిల్లలూ, ఆడపిల్లలూ.
"అట్లతద్దోయ్
ఆరటోయి
ముద్దపప్పోయ్ !
మూడట్లోయ్ !
పిడకలక్కిందా

పిల్లల్లారా
లేచి రారండోయ్"

అని ఒక్కటిగా ఈ పాట పాడుకుంటూ బయలుదేరుతారు !

ఈ ఆట పాటలతోనే తెల్లారుతుంది ! అక్కడ నుంచి (ఈ నోముకు ఏడు వుయ్యాలలనుకుంటా - ఊగాలనే శాస్త్రం వుంది) ఉయ్యాల లూగటానికి బయలుదేరుతారు.

ఈ పండుగ వస్తుందంటే చాలు - ప్రతి వాకిటా, ప్రతి ఇంటా ప్రతాడు ఉయ్యాలలూ, బల్ల ఉయ్యాలలూ వేసి సిద్ధం చేస్తారు. గ్రామాలలో పెద్ద పెద్ద చెట్లకు ఉయ్యాలలు వేసి అందరూ ఊగుతారు.

ఉయ్యాల పాటలలో...

"ఓయి భామాలారా ఉయ్యాలా
భామలందూనా ,,
రాజు మారాజు ,,
ఏడుగురు కొడుకులు ,,
ఆర్గురు కొడుకులకు ,,
కళ్యాణమయింది ,,
కడవారపు కొడుకుక్క ,,
కళ్యాణ మవలేదు ,,
ఓయి భామలారా ,,
ఉయ్యాలా! ,,
భామలందూనా ,,
ఉయ్యాలా !..."

సరే ! ఈ నోములు తాము ముందు ఏదో ఫలితం పొందదలచి చేశారు.

నాగుల చవితి అన్నప్పటికి పాలు పుట్టలో పోసి నాగమయ్యను ప్రార్థిస్తారు.

"..... .....
పడగలె త్తకు పాము
పగవారముకామూ !
పడగెత్తి చూసింది
నాలుకలు రెండూ !
నాలుకలు దూయకే
నీవారము నాగూ !
మంచి నాగువై తే
పంచేలెట్టేమూ !
కోడెనాగూవై తే
కోకలెటేము !"
..... .....
"మా పత్తి పండితే
పంచెలెట్టేము
పడగెత్తకే నాగు
పగవారము కాము
నీ పూజ చేసెదము
సీకు మ్రొక్కెదము..."

అని నాగుమయ్యని ప్రార్థించిన వీరే చివరకు ఆ నాగుమయ్యని బంధుత్వము గావించి, ఆప్యాయతతో సలహాలిస్తారు.

"పుట్టలో నాగన్న
బూచి నాగన్న
ఎండలో పొడుకోకు
వెర్రి నాగన్న
.....
అటుబోకు నాగన్న
చాకిరేవులకు !

సాలిపురుగని నిన్ను
చంపుతారు వారు"

అంటూ బుద్ధులు చెబుతున్నారంటే మనకు వింతగా లేదంటారా ? అలా నోములు పూర్తి అయాక అమ్మాయిని అత్తవారింటికి పంపుతారు. అలా పంపుతున్న తల్లి కూతురికి బుద్ధులు చెబుతుంది.

"మాయమ్మ లక్ష్మీదేవి
పోయి రావమ్మా ?
పోయి నీ అత్తింట
బుద్ధి కలిగుండూ
ఎవ రేమాడినా
ఎదురాడ కమ్మా
వీధి నిలుచుండి తల
విప్పి ముడవకు మీ
మాట లెన్నాను
మాటాడకమ్మా
పలుమారు మామీద
ప్రేమలుంచకుమా !
అతని కాదనీ పూలు
ముడవాబోకమ్మా..."

అని తల్లి సలహా యిచ్చి సాగనంపుతుంది.

ఈ పాట వింటూంటే ఓ బంధువుకు దూరమైపోతున్నట్లు మనం బాధ పడతాము. అలా పుట్టింటి నుంచి అత్తింటికి వెడుతూన్న పడుచు చెల్లెలితోనూ, అక్కా అన్నలకు అప్పగింతలు పెడుతూంది.

"బొమ్మరిల్లున్నాయి
బొమ్మలున్నాయి
నేను ఆడేటి

సాలలున్నాయి
నా మారుగా మీరు
ఆడుకోరమ్మా
పోయి నా అ త్తింటికి
పోయి వస్తాను !
దీవించు అన్నయ్య
దీవించు అక్కా...''

అని కంట తడితో బండి ఎక్కుతుంటే అంతదాకా ఆడుకొన్న చెల్లీ, తమ్ముడూ ఏ విధంగా బాధపడతారో ఈ పాటలో ప్రతిధ్వనించడం గమనించండి.

అలా అ త్తింటికి వెళ్ళిన కోడలుకు నూతన దాంపత్య జీవితం ప్రారంభమవుతుంది. ఊ అంటే భర్త అలుగుతాడు.

అలా అలిగిన భర్త, భార్యతో సూటిగా మాట్లడకుండా ఏ చిలుకమీదనో పెట్టి పనులు ముగించుకోచూస్తాడు.

అటువంటి విచిత్రమైన ఈ పాట చూడండి.

ఎదురుగుండా తడిక కనబడుతుంది. తడిక ప్రక్కనే భార్య...తడికతో రాయబారాలు—

"కొట్టిగూర తెచ్చాను
గోంగూర తెచ్చాను
వండమని చెప్పావే
తడికమ్మా..."

అని భర్త కబురు పంపుతాడు.

భార్య మాత్రం ఏంతీసిపోలేదు. ఆ తడికతోనే—
''కొట్టిగూర తెస్తేను
గోంగూర తెస్తేను

వండననీ చెప్పావే
తడికమ్మా''
అని సమాధానం యిస్తుంది.

ఈ విధమైన తడిక రాయబారాలు, చిలుక రాయబారాలులాటి పాటలు చాలా ఉన్నాయి. కాని ఇక్కడ చిన్న అనుమానం. కూనలమ్మ పదాలని కొన్ని ఉన్నాయి. ఈ కూనలమ్మ పదాలు అన్నవి మనం అనుకునే ''కూనిరాగాలు తీస్తున్నాడనీ'' ''కూనలమ్మ సంగీతాలు తీస్తున్నారనీ'' అంటున్నాము ! వీనికి సంబంధించినవే ఈ క్రింది పాటలు :

"జప తపంబుల కన్న
చదువు సాముల కన్న
ఉపకారమే మిన్న
ఓ కూనలమ్మా

అన్నమిచ్చినవాని
నాలి నిచ్చినవాని
నపహాసించుట హీని
ఓ కూనలమ్మా

మగని మాటకు మాట
ఎదురు బల్కెడు బోటి
మృత్యుదేవత సాటి
ఓ కూనలమ్మా"

ఈ పాటలు "కూనలమ్మ''తో చెబుతూన్నట్లు వేదాంతపరంగా పాడు తారు.

కాని. ఈ పాటలో కొన్ని చరణాలు ఇంకోలాగా కూడా విన్నానునేను. మచ్చుకు—

''ఆడి తప్పిన వాని
ఆలి మరచిన వాని
ఆదరించుటి
మోసమన్నా''
అంటూ 'మోసమన్నా' అన్న సంబోధనగా నడుస్తాయి.

బాల్యంలో ఆటపాటలతో చక్కగా పెరిగి పెద్దయిన అమ్మాయి యుక్త వయస్సు వచ్చేటప్పటికే నోములని, వ్రతములని ప్రారంభిస్తారు. అక్కడినుంచి వివాహమో, అత్తింటికి వెళ్ళడమో జరుగుతుంది.

అక్కడినుండి సంసార తాపత్రయం, గృహిణిగా కర్తవ్య నిర్వహణ ప్రారంభం.

ఈ గృహకృత్యంలో జరుపుకొనే ప్రతి పనికీ ఒక్కొక్క పాట ఉంది.

అందు క్రిందనే దంపులు, విసురు, రోటి పదాలు, నీళ్ళుతోడు పాటలు మొదలైనవి వస్తాయి.

అలా అత్తింటికి వెళ్ళిన కోడలిని దంపు దంపమని అత్తగారంటుంది. ఒక్కతే దంపుతూంటే ఊసుపోవాలిగా మరి. అందుకు–

"నాచేతి రోకళ్ళు
నల్లరోకళ్ళు
వేయించు అన్నయ్య
రాగిపొన్నుల్లు
.....
కోడలా కోడలా
కొడుకు పెళ్ళామా
పచ్చిపాలమీది మీగడేది
వేడిపాలమీది వెన్నలేవి !
.....
పాపమ్మ చేసుకుని

బావిలో పడితే
పై మురికియేగాని
పాపాలు పోవు
దంపు దంచాలేను
దండె త్తలేను
ఏపచెట్టూకాడ
నా బొమ్మరిల్లు
కూకోర అన్నయ్యా
కూడొండలేను
కూటికే కాదప్ప
కూతురూ కొచ్చాను'' లాంటి పదాలు వందలకొలదీ ఉన్నాయి.

ఈ పాటలద్వారా కష్టాలు సుఖాలు, నీతులు నియమాలు చెప్పుకుంటూ పనిలో వుండే కొంత శ్రమని ఈ పాట పాడటంలో మరచిపోతారు.

అలాగే విసురురాతి పదాలని ఉన్నాయి. పిండి విసురుతూ ఈ పాట పాడుతారు.

''చిలునీళ్లు తోడేరు
జలకమాడేరు
హంస అన్నము లండె
ఆరగించేను
వెలదీ మంచములాయె
వెన్నెలల బై టా.....''

లాంటి పదాలు గృహకృత్య సారస్వతంలో చిరపరిచితాలు !

అప్పుడే లేచింది కోడలు, ఉదయమయ్యేటప్పటికి కవ్వము ఎదురు.

కోడల్ని పిలిచి మజ్జిగ చేయమంది అత్తగారు. కవ్వంతో మజ్జిగ చేస్తూ పాడుతూంది ఈ పాట :

''అన్నా బిందేడు పాలు
కిన్నెరల మోత

అన్నా చేసేది చల్లాయా !
అమ్మా చేసేది చల్లా
కవ్వాల మోత
రాగిదీ కవ్వామోయా''

లాంటి మజ్జిగ కవ్వం పాటలు తెలియని తెలుగువారు-అందులో రైతు కుటుంబాలలో అరుదే అనుకుంటాను.

ఈ పాటలు కొంచెము తేడాతో పరికిస్తే కోలాటం పాటలకు దగ్గరగా కనిపిస్తాయి.

ఆ కవ్వాన్నే ఇద్దరు ఎదురెదురుగా నిలబడి తిప్పుతూ పాడితే కోలాటమే అనుకొనవచ్చును.

ఆలాగే రాట్నాల పాటలు. మన భారతదేశానికే ముఖ్యంగా తెలుగునాడులో కూడా కుటీర పరిశ్రమలే కదా జీవనాధారం. ఈనాడంటే రాట్నాలు, మగ్గాలు, పిల్లలబొమ్మలు మొదలగు పరిశ్రమలు మూలపడుతున్నాయి గాని, నాడు ఇవేగదా మనకు జీవనాధారం.

అటువంటి రాట్నమును త్రిప్పుతూ పాడే పాటనుకుంటాను ఇది :

"అందచందములేని
ఆడకూతురికీ
అంద మేరుపరుచు
ఆ పత్తిచెట్టు
కవ్వమాడని ఇల్లు
కదురు తిప్పని కొంప
మగ్గములే నూరు
మరి కానరాదు !"

చూడండి ! ఈ పాటలో మన పాత చరిత్ర, ఒక యథార్థ సత్యం ఎలా ప్రతిధ్వనిస్తుందో !

అందంలేని ఆడ కూతురుకి బట్టలు సింగారిస్తే సరి ఎక్కడలేని అందం వస్తుందట. ఈ మాట నిజం కాదంటారా, విచిత్రంగా లేదంటారా ?

పూర్వకాలంలో కవ్వము, కదురు, మగ్గమూ లేని కొంపే లేదని, ఆ రోజు లక్కో వాటికి అంత విలువ, బలిమి వుండేదని మనకు లెక్కలూ అందిస్తూ ఉంది.

ఈ పాటను పరికిస్తే కొంచెం పదాల వరుసలో కనిపిస్తూందనుకుంటాను.

అత్తగారు ఏదో పనిచేస్తుంది. కోడలు వూరికే కూర్చుంటే ఎలాగ అని కదురు అందుకుంది. ఆ సమయంలో పాడే పాట ఇది :

వడుకు వడుకూ కదురా
వడకవే కదురా !
ఏకుల్ల బుట్టంత
ఎల్లుండి సంత !
ఏకేకు ఒక బార
ఎల్లుండి సంత !
నా ఏకు లై పోయె
నాకేమి చింత
కదురు సల్లాగుండె
ఢిల్లీ సల్లాగుండె
నా మగడు రాకున్న
నాకేమి చింత—

ఈ పాటలో స్త్రీ దేశసౌభాగ్యంలో ఎంత భాగస్వామో, పూర్వము దేశ సౌభాగ్యం కోసం స్త్రీ ఎంత సహాయపడిందో చూపడానికి ఈ పాట మచ్చు తునక !

ఢిల్లీ చల్లగుండాంట-అంటే ప్రభుత్వం అనుకొంటాను. ఢిల్లీ ప్రభుత్వ సైనికుడు అనుకొంటాను ఈమె మొగుడు ! అతను భార్యకోసమని ప్రభుత్వపు పనులు మానివేసి వస్తే ఎలాగ ? రాడు ! ! అలా రాకూడదనే ఈమె కోరిక ! అందుకే "కదురు సల్లాగుండె (పొట్ట గడవాలిగా మరి!) అందుతో పాటు ఢిల్లీ సల్లాగుంటే - నా మగడు రాకున్న నాకేమి చింత" అని ఎంత ధైర్యంగా చెబుతూందో గమనించండి !

స్త్రీల పాటలలో మంగళహారతులకు ప్రత్యేకత వుంది.

ఈ క్రింది పాటలో పార్వతి ఎక్కడికో బయలుదేరడం, ఆ సమయంలో చెలికత్తెలు ఎక్కడికని ప్రశ్నించడం, సంభాషణ రూపంలో శివుని అవతారాన్ని కన్నులకు కట్టినట్లుగా అవతరింపజేసే పద్ధతిలో సాగుతుంది. ఆ పాట ఇదీ :

ఘల్లూ ఘల్లునా పాద
గజ్జెలందెలూ మ్రోగ
కలహంసా నడకాల
కలికీ ఎక్కడికే ?
జడలోనూ గంగానూ
ధరియించుకొన్నట్టి
జగములేలే సాంబ
శివునీ సన్నిధికే !!
మంగళం - మంగళం !

బొడ్లూ మల్లెలూ జాజీ
దండాలూ మెడానింద
అందా మెరిగిన జగ
దంబా ఎక్కడికే ?
అందముగ విభూతీ
అలరూ గంధామూ
నలచీన నీల
కంఠేశు సన్నిధికే ! !
మంగళం - మంగళం !!

తళతళ మనూ రత్న
తాటంకములూ మెరయ
పసిడీ మండలమూల
పడతీ ఎక్కడికే ? ?
కలియూగా జన్మమూ
గల శివుడైనట్టి
గురులైనా శంభు
శంకరుని సన్నిధికే !!
మంగళం - మంగళం !!

ఇటువంటి గేయాలు ఇంకా ఎన్ని ఉన్నాయో. *



# జానపద కళలు

ప్రజల మధ్యనే స్వతస్సిద్ధంగా పుట్టి ప్రవర్ధమాన మయిన కళారూపాలు అవడంవల్లనే వాటికి జానపద కళారూపాలని పేరు వచ్చింది.

ఈ జానపద కళారూపాలు జాతి జీవితంలో సామాజికపరంగా, సాంస్కృతిక పరంగా పెనవేసుకుని ఉండడంచేత దేశంలో, సమాజంలో రాజకీయ, సాంఘిక పరిణామాలు ఎన్నివచ్చినా అనూచానంగా వస్తూన్న ఈ కళారూపాలు చెదరకుండా అలానే నిలచిఉన్నాయి.

మన ప్రాచీన కళారూపాలైన కురవంజి, యక్షగానం, తోలుబొమ్మలాటలు, కలాపం, బుర్రకథ, హరికథ, వీధినాటకం, చోడిగాడు, భాగవతమేళం, పగటి వేషాలు, వాలకం, రుంజలు (జానపద గాయకాలు), భజనలు, పిచ్చుకుంటలు, దాసర్లు, చిందుమాదిగలు, బైండ్లు, కాటికాపర్లు, కాశీకావళ్లు, జంతరుపెట్టె, గంటి భాగోతులు, విప్రవినోదులు, సాధనాశూరులు- ఇలా మరెన్నో వున్నాయి. వీటన్నిటినీ జానపద కళారూపాలనే అంటారు.

ఇవన్నీ ఇప్పుడు ఉన్నాయా అని ప్రశ్నించుకొంటే– కాల ప్రభావంలో కొన్నికొన్ని కాలగర్భంలో కలిసిపోయి ఉండవచ్చు. కాని చాలామట్టుకు పల్లెల్లో ఉన్నాయి. పల్లెజనాభిని అలరిస్తూన్నాయి.

జానపద కళారూపాలు అనేవి ఒక్క మనకే పరిమితమైనవి కావు. ఇవి, అంటే జానపద కళారూపాలు ఏ దేశంలో, ఏ ప్రాంతంలో ఉన్నా, ఏ వేషభాషల్లో ఉన్నా అక్కడి ప్రజల ఆశలకూ ఆశయాలకూ, ఆలోచనా సరళికీ ప్రతిరూపాలుగానే చెప్పుకోవలసి ఉంటుంది. ఇటువంటి ప్రత్యేకతలను కలిగివున్నాయి కాబట్టే ఈ కళారూపాలు ప్రజలను ఆకట్టుకోడం జరుగుతూంది.

వీటిని ఇలా విభాగించుకోవచ్చును : 1. స్వాభావికరూపాలు, 2. వృత్తి సంబంధీక రూపాలు, 3, హ్యంగ్యరూపాలు, 4. మిశ్రమాలు.

"సర్వశాస్త్రార్థ సంపన్నం సర్వశిల్ప ప్రదర్శనమ్
నాట్యసంజ్ఞమియం వేదరీతేసిహాసం కరోమ్యహమ్.
ఏవం సంకల్ప్య భగవాన్సర్వాన్వే దానను స్మరన్
నాట్యవేదం తపశ్చక్రేచతురేదాజ్ఞ సంభవమ్
జగ్రాహ పాఠ్యమృగ్వేదాత్సామభ్యోభినయ మేవచ
యజర్వేదా దభినయా న్రసానా థర్వణాదతి
వేదోపవేద సంబంధో నాట్యవేదో మహాత్మనా
ఏతీంక్షగవతా సృష్టో బ్రహ్మణా లలితాత్మనా
ఉత్పాద్యనాట్య వేదంతు బ్రహ్మోవాచ సురేశ్వరమ్"

ఋగ్వేదంనుంచి వాచకాన్ని, యజుర్వేదంనుంచి అభినయాన్ని, అధర్వణ వేదంనుంచి రసాన్ని, సామవేదంనుంచి సంగీతాన్ని గ్రహించిన బ్రహ్మ నాట్య వేదమనే పంచమ వేదాన్ని ప్రవచించినట్లు భరతముని చెప్పి ఉన్నాడు. అంటే వేదాలలోనే రూపక బీజాలున్నవన్నది మనకు బోధపడుతుంది.

వీధి నాటకాలకు చాలా వయసు ఉన్నట్లుగా హల శాతవాహనుడు రచించిన గాథా సప్తశతి మనకు చెబుతూనే ఉంది. సుమారు రెండువేల ఏళ్ళకు పూర్వమే వీధి నాటక లక్షణాలు, దేశి వాద్య విశేషాలు ఉన్నట్లు- నాటి శిల్ప ప్రతికృతుల రూపావశేషాల ద్వారా గుర్తించవలసి ఉంటుంది.

వాల్మీకి రామాయణంలో శ్రీరామచంద్రుని జనన వర్ణన చూడగా, దేశి సారస్వతంగా ప్రచారం పొందిన జానపద రచనలు ప్రచారంలో ఉండి ఉన్నట్లు బోధపడుతుంది.

గంధర్వుల మధురగానం, అప్సరసల నాట్యం, దేవతల దుందుభి వాద్యము, వీధులలో నటీనటుల నాట్య ప్రదర్శనలు, సూత, మాగధ వంది జనుల వాద్యాలను గురించీ వర్ణించబడింది.

నన్నయ కాలానికి నాటకాదులు ప్రచారంలో ఉన్నాయనడానికి—

"...ఉదాత్త రసాన్విత కావ్య నాటక క్రమములు బెక్కు సూచితి" అన్న పద్యంద్వారా బోధపడుతుంది. రెండు వేల ఏళ్ళనాడే ప్రచారంలో ఉండిఉన్నట్లు భాగవతంలో కృష్ణుని జన్మ సమయంలో గోపికలు ఈ తరహా పాటలనే పాడినట్లు దశమస్కంధంలో వర్ణించబడెందికూడా. అంతటి ప్రాచీనమైన దేశి సారస్వత శాఖలో సంగీత రూపక ప్రధానమయిన యక్షగానాలను పరిశీలిద్దాం.

యక్షగానం అనగా దేశీయ ఛందోబద్ధమయిన నాటకము. దీనినే పాటగా కూడా పేర్కొనక పోలేదు. యక్షగానాల గురించి బ్రౌణ్య నిఘంటువులో పాటగా పేర్కొనబడింది. అయితే అప్పకవి దృష్టిలో యక్షగానం పాటలుగల ప్రబంధం అయివుండవచ్చునని తోస్తుంది. ఎందుచేతనంటే అప్పకవీయంలో యక్షగాన ప్రశస్తి ఉంది. అందులో అర్ధచంద్రికలూ, త్రిపుట, జంపె, ఆటతాళము 'వీన యక్షగాన ప్రబంధంబులతుకవచ్చు' అని పేర్కొన్నాడు.

శ్రీనాథుని కాలంలో ఇవి చాలా ప్రచారంలో ఉండి ఉన్నట్లు "కీర్తింతు రెద్దాని కీర్తి గంధర్వులు గాంధర్వమున యక్షగాన సరణి" అన్న దానినిబట్టి తెలుస్తూంది.

ఈ యక్షగానాలు తెలుగులో సుమారు 400 దాకా ఉన్నట్లూ, మిగిలినవి అముద్రితాలనీ చారిత్రక పరిశోధకుల అంచనా.

ఈ యక్షగానాలకు వసంత ఋతువు తంజావూరు రాజుల కాలంలో. ఆ కాలంలో స్త్రీలు కూడా వేషాలు ధరించడం ఉండేది.

తెలుగునాడున వీధి నాటకాలు ఉన్నట్లుగానే తమిళ దేశంలో "తెరక్కుత్తు" లనీ, కన్నడంలో "బయలాటము" లనీ వ్యవహారంలో ఉన్నాయి.

ద్రవిడ భాషయందు మొట్టమొదట కురవంజి అనే దృశ్య రచనలు బయలు దేరినవి. ఈ కురవలు ఆటవికులు. వీరికి అడుగువేస్తూ నృత్యం చేయడం అల వాటు.

అయితే యక్షగానాలలో గేయానికి ప్రాధాన్యత ఉంటే, కురవంజిలో నృత్యానికి ప్రాధాన్యం.

ఈ యక్ష.గాన ప్రదర్శనము ఏ రూపంలో ఉంటుందో చూడండి.

"...ఢక్క హుడక్క జ్ఝర్ఝరల్
ఝల్లరి యాదిగా గలుగు శబ్ద
పరంపర . తాళబద్ధమై
యుల్లసిలం ప్రబంధముల
కొప్పగ నాడుదు రగ్రవేదిపై"

బసవ పురాణంలో పాల్కురికి యక్షగాన ప్రదర్శనల రూపం ఇలా ఉంద న్నాడు:

"...పాటలుగా గట్టి పాడెడు వారు, బ్రస్తుతోక్తుల గద్య పద్య కావ్య ముల విస్తారముగ జేసి వినుతించువారు, నటుగాక సాంగభాషాంగ క్రియాంగ పటు నాటకంబుల నటియించువారు."

ఈ యక్షగానాలలో చాలా హాస్య ప్రధానమయిన సాంప్రదాయిక పాత్రలు ఉన్నాయి. ప్రతి యక్షగానంలోనూ అందలి ఇతివృత్తం వేరు అయినా హాస్య పాత్రలు ప్రతిదానిలోనూ ఉంటాయి. ఈ పాత్రలన్నీ కూడా హాస్యం కోసం ఉద్దేశించబడినవే.

మన పరిశోధకుల నిర్ణయాలను బట్టి చూస్తే-చెన్నసౌరి శౌభరి చరితమే మొదటి యక్షగాన రచనగా తెలియ వస్తూంది. ఇది క్రీ॥శ॥ 15 వ శతాబ్ది ఉత్తరార్ధం లోనిదని అంచనా. అయితే మనకు లభ్యమయిన యక్షగానాలలో - కవి కాలం తెలిసినంత మట్టుకు కందుకూరి రుద్రకవి సుగ్రీవ విజయమే ప్రాచీన మైనదిగా పరిగణించబడుతూ ఉంది.

యక్షగానాన్ని దేశీ రచనగానే పరిగణిస్తూన్నారు.

సంస్కృతంలో విదూషకుని పాత్రే పాశ్చాత్యదేశాలలోని కోర్టుఫూల్, కోర్ట్ జెస్టర్, బఫూన్‌లు.వీరికి సరిపోలినవే తోలుబొమ్మలలో జుట్టు పోగలిగాడు,గాంధోలి గాడు, బంగారక్క: యక్షగానాలలో కోణంగి; కురవంజిలో సింగి; సింగడు.

అలాగే మాధవిపాత్ర కూచిపూడి వారి సృష్టి. ప్రతి భామాకలాపంలోనూ ఇతడు మనకు ప్రత్యక్షమౌతాడు. విదూషకునిలాగ హాస్య ప్రసంగాలూ, కథనూ నడిపిస్తాడు. మాధవి పాత్రను సింహళ రూపకంలోని 'తోరాతరు కథా కారయ', బర్మావారి నాటకంలోని 'లూ–బయట్'లతో పోల్చుకోవచ్చును.

వేషాలు వేసుకుని, పాడుతూ ప్రదర్శించే రూపకమే యక్షగానం.

జానపద కళారూపాలు - ప్రాంతానికో విధంగా ఉండి ప్రచారం అయినవి కొన్ని, రాష్ట్రానికంతటికీ కాస్త ఇటూ అటూగా ప్రచారం పొందినవి, మండలాలలో ఆయా ప్రజల భాషలో ప్రాచుర్యం పొందినవి - ఇలా ఎన్నో ఉన్నాయి.

తెలంగాణా ప్రాంతంలో కొన్ని కళారూపాలకు మంచి ప్రాచుర్యం ఉంది. ఆలాగే విశాఖ, విజయనగరం, శ్రీకాకుళం ప్రాంతాలలో కొన్నింటికి ప్రచారం ఉంది.

బుర్రకథ, తోలుబొమ్మలు, వీధి నాటకాలు, కలాపాలు వంటివి దేశం మొత్తం మీదనే ప్రచారం, ఆదరణ పొందాయి.

జానపద కళారూపాలు – యక్షగానం, కురవంజి, హరి కథలు, ఒగ్గు కథ, చెక్కభజనలు, బుర్రకథలు, కలాపాలు, పగటి వేషాలు, గిరిజన నృత్యాలు, పిచ్చుగుంట్లు - ఇలా మరెన్నో.

జానపద గాయకులు - రంజవారు, బీరన్నలవారు, వీర ముష్టివారు, బవనికలవారు, జంగములు, పిచ్చుక గుంట్లవారు, దాసరులు, శారదకాండ్రు మొదలయినవారు.

వీరు అనేక విధములయిన వాద్య విశేషములతో ఊరూరా తిరుగుతూ వాద్యాలను వినిపిస్తూ, పాటలు పాడుతుంటారు.

జానపద వాద్య విశేషాలు :- పీరణములు, గుమ్మెట, ఒగ్గులు, కోలలు, శంఖము, శారద, అందెలు, కటివాద్యము, డప్పు, తప్పెట, తాళాలు, తంబుర,

జమిడికలు, చిరుతలు, నాగస్వరము, గజ్జెలు, ఢిక్కీ పిల్లలగ్రోవి, కొమ్ము బూరలు, బుర్రలు, రుంజ మొదలయినవి.

వీరు పాడే పాటల్లో, చెప్పే కథల్లో చారిత్రక, పౌరాణిక, పారమార్థిక ఇతివృత్తాలు ప్రధానాలు.

## పగటి వేషాలు

ప్రత్యేకంగా పగటిపూట ప్రదర్శించే వేషాలు కావడం వల్ల వీటికి "పగటి వేషాలు" అని నామకరణం వచ్చింది.

ప్రజా వినోదం ప్రధాన ఆశయంగా, ప్రజల ఆశలకూ, ఆశయాలకూ దర్పణంగా ఇవి దేశంలో ప్రచారం పొందాయి.

వీటిని గురించి అనేక కథలు ప్రచారంలో ఉన్నాయి.

నాటి పరిపాలకుల దృష్టికి ప్రజా సమస్యలను తీసుకురావడం, వర్తమానాలను చేరవేయడం కొరకు ప్రధానంగా ఈ ప్రదర్శనలు ప్రచారంలోకి వచ్చాయని ప్రతీతి.

కృష్ణాజిల్లా కూచిపూడి పగటి వేషధారులకు నిలయం. నృత్య నాటికాలు ఆడేవారు నాట్య మేళములుగా ఏర్పడి తమకున్న కళానైపుణ్యంలో ప్రదర్శనలూ ఇస్తున్నారు.

కూచిపూడి వారిలో కొందరు సంవత్సరంలో కొన్ని నెలలు సంచార మేళములుగా ఏర్పడి ప్రజలలో విజ్ఞాన ప్రబోధం చేస్తూ- తద్వారా ఆనందాన్నీ, ఆలోచననూ కలిగిస్తూంటారు.

అయితే ఇక్కడ మనం ఒక విషయాన్ని మరచిపోకూడదు. కూచిపూడి-భాగవత కథా ప్రదర్శనలకు ప్రత్యేకత అయితే, గడ్డిపాడు - పగటి వేషాలకు ప్రసిద్ధి పొందింది-అసలు పగటి వేషాలకు ఒక విలువను చేకూర్చిన వారు గడ్డిపాడు వారే అనిపిస్తుంది.

గడ్డిపాడు వారు సుమారు 60 రకాల వేషాలను ప్రదర్శించేవారు. . .

ఈ వేషాలలో నిత్యజీవితంలో ఉండేవి కొన్ని, పౌరాణికంగా కొన్ని, కల్పిత వేషాలు కొన్ని, పూర్తిగా హాస్య ప్రధానమైనవి కొన్ని. వీరి వేషాలలో ఉండే గొప్పతనం నమ్మించడం. అంటే గొర్రెలుకాచే గొర్రెల కాపరి వేషం ధరిస్తే అక్షరాలా అలాగే ఉండడం.

కూచిపూడి వారైనా, గడ్డిపాడు వారైనా - దేశంలో ఉన్న మతాలనూ, కులాలనూ, మాండలిక భాషనూ ఆకళింపు చేసుకొనడంలో వీరికి వీరే సాటి.

పగటి వేషాల ద్వారా-రాజులలో మార్పును తేవడం, ప్రజల్లో చైతన్యాన్ని కలిగించడం ప్రత్యేకించి ఉదహరించవలసి ఉంటుంది. కాకతీయ యుగంలో యుగంధరుడు పిచ్చి యుగంధరుడుగా నటించి 'ఢిల్లీ సుల్తాన్ పట్టుక పోతాన్' అంటూ ఢిల్లీ సుల్తానులను జయించింది పగటి వేషంతోనే. అంతదాకా ఎందుకు ? కళింగ గంగరాజు పగటి వేషాల వారి సాయంతోనే శత్రువులను జయించాడనే కథ విన్నదేకదా.

జనంలో ప్రచారం పొందిన పగటి వేషాలలో కొన్ని ఇక్కడ ఉదహరిస్తాను.

1. శక్తివేషం, 2. భేతాళుడు, 3. దేవర పెట్టె, 4. భోగం వేషం, 5. పాములవాడు, 6. ఎరుకల వేషం, 7. దొమ్మర వేషం, 8. కోయవేషం, 9. కాశీ ప్రయాణం, 10. ఫకీరు వేషాలు, 11. బ్రహ్మంగారి తత్వాలు, 12. అత్తకోడళ్ళ సంవాదం, 13. గొల్లభామ, 14. పుంచుల వేషం, 15. దాదినమ్మ వేషం, 16. జేగంటి భాగవతులు, 17. హరిదాసులు, 18. భట్రాజు వేషం, 19. లింగబలిజ వేషం, 20. సోడిగాడు, 21. బట్టల ఆమ్మకం, 22. దాసరి వేషం, 23. రెడ్డి వేషం, 24. గంటి భాగవతం, 25. బైరాగుల వేషాలు, 26. బుడబుక్కల వేషం. 27. సోమిదేవమ్మ, 28. అర్ధనారీశ్వరుడు, 29. వైష్ణవ వేషాలు, 30. పంతులు వేషం, 31. సోడె, 32. వితంతువు, 33. మాదిగ వేషం 34. తహశీల్దారు, 35. జంతరు పెట్టె, 36. చిట్టిపంతులు, 37. దివాను వేషం, 38. సింగి-

సింగడు, 39, అవధాని, 40. మొండి బండవాళ్ళు, 41. లంబాడి పడుచు, 42. రాధాకృష్ణ సంవాదం, 43. సోమయాజులు, 44. శారద వేషం, 45. జంగమ దేవర, 46. సాతాని వేషం, 47. పఠాను వేషం, 48. కోమటి వేషం, 49. కాశీ కావళ్ళు, 50. పానాలమ్మ, 51. పడుచు పెళ్ళాం, 52. ముసలి మొగుడు, 53. గయ్యాళి పెళ్ళాం, 54. పిట్టల దొర, 55. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్-ఇలా మరెన్నో పగటి వేషాలు ప్రచారం పొందాయి.

ఒకనాటిమాట-భారత దేశంలో స్వతంత్ర, సామంతరాజుల పాలనలోనూ చిత్రవిచిత్రములయిన ఈ వేషాలు చాలా ప్రచారంలోకి-వ్యాప్తిలోకి వచ్చాయని అంటారు.

రకరకాల మారువేషాలు ధరించి గూఢచారులుగా సమాచారాలను అందించే వారని చరిత్ర చెబుతూండి. వీరు వర్తకులుగా-రత్నాలు-వజ్రాలు అమ్మే వ్యాపారులుగా కోటలోకి ప్రవేశించి రాజును వంచించడం-అక్కడి విషయాలను చూసి, అక్కడి బలహీనతలను సేకరించి, దండయాత్రలు చేయడం జరుగుతూ ఉండేవి ఒక్క మాటలో చెప్పాలంటే అలా ప్రారంభమైనవే ఈ పగటి వేషాలు. వీటిని ఒకప్పుడు 'బహురూపాలు' అని పిలిచేవారు.

భరత కోశంలో వీటి ప్రస్తావన ఉంది. సర్వేశ్వర శతకంలో వీటి ప్రస్తావన ఉంది. పండితారాధ్య చరిత్రలో వీటి వివరణ కనిపిస్తుంది.

ఇంతవరకూ మనకు లభ్యమయిన చారిత్రకాధారాలను బట్టి - సుమారు మూడుపందల ఏళ్ళనాడు మైసూరు ప్రాంతం నుంచి పల్లావరుల వెంకట రామయ్య అన్న ఆయన ఆంధ్రదేశం రావడం, రేపల్లెలో ఉంటూ, మన వారికి కొందరికి ఈ పగటి వేషాలు నేర్పాడని అంటున్నారు. తరువాత తరువాత గడ్డిపాడు ప్రధాన కేంద్రం, నివాస స్థానం అయిందని పరిశీలకుల అంచనా.

వీధి భాగవతాలకు కూచిపూడి ఎలా ప్రధాన కేంద్రంగా ఉందో, పగటి వేషాలకు గడ్డిపాడు ప్రధాన కేంద్రం అయింది. పగటి వేషాలు ధరించే వారిలో పల్లాపర్రులవారు, శ్రీకారంవారు, కూచివారు, కనుపూరివారు, బెల్లంకొండవారు, బాపట్లవారు, కవులవారు ఇలా మరికొందరు. వీరందరినీ తీర్చిదిద్దిన ఆయన పైన పేర్కొన్న మైసూరు బ్రాహ్మణుడు.

కూచిపూడి పగటి వేషాలకు కీర్తిని సంపాదించిపెట్టిన కీర్తిశేషులు - పెద్దిబొట్ల దశరథ రామయ్య, పెద్దిబొట్ల జానకి రామయ్య, పసుమర్తి శేషయ్య, పసుమర్తి చలపతి, పసుమర్తి గోపాలం, హరి లక్ష్మీనారాయణ, చింతా శివ రామయ్య, భాగవతుల కుమారస్వామి, భాగవతుల పిచ్చయ్య, వేదాంతం వేంక టేశ్వర్లు, వేదాంతం లక్ష్మీనరసింహం, మహంకాళి లక్ష్మయ్య మొదలయినవారు.

వీరు గతించినా ఆ కళను ఆరాధిస్తూ కళాసేవ చేస్తూన్న ఇప్పటి వారు మహంకాళి సత్యనారాయణ, వేదాంతం ఘంటయ్య, వేదాంతం పార్థసారధి, హేమాద్రి శివరామకృష్ణయ్య, చింతా సూర్యప్రకాశరావు, పసుమర్తి అంజయ్య, పసుమర్తి సూర్యనారాయణ, పసుమర్తి సుందర రామయ్య, పసుమర్తి వెంక టేశ్వర్లు, పసుమర్తి విశ్వనాథం, పసుమర్తి శ్రీరామమూర్తి, భాగవతుల కుటుంబ శాస్త్రి, భాగవతుల నాగలింగయ్య, భాగవతుల వెంకటాచలపతి.

ఇలా పగటి వేషాలు తెలుగు ప్రజలకు ఆనందాన్ని తద్వారా విజ్ఞానాన్ని అందిస్తూన్నాయి.

## వీధి నాటకాలు

ఇప్పుడంటే రంగస్థలం హాలు, కర్టెన్లు - ఇలా ఎన్నో విధాల అభివృద్ధి చెందిందిగాని, ఒకనాడు వినోద ప్రదర్శనలు అన్నీ వీధుల్లోనే జరిగేవి.

అసలు ఒకనాడు గ్రామ పంచాయతీల పాలనా వ్యవహారాలన్నీ వీధుల్లోనే ఏ వేప చెట్టుక్రిందో, ఏ రావి చెట్టు క్రిందో జరిగేవి.

ప్రధానంగా రామాయణం, భారతం, భాగవత గాథలూ, బసవపురాణ కథలూ వీధి నాటకాలుగా ప్రదర్శిస్తూండడం పరిపాటి.

వీటిని దేశి నాటక ప్రదర్శలు అంటే సరిపోతుందనుకొంటాను. ఈ దేశి నాటకాల పురోగతి శివకవుల అధ్వర్యంలోనే జరిగింది.

వీధులలో ప్రదర్శించేవారు గనుక వీధి నాటకాలని పేరు వచ్చింది. వీటిని ప్రదర్శించేవారిని భాగోతులనీ అనడం తెలిసిందే.

క్రీ॥ శ॥ 16 వ శతాబ్దంనుంచీ ఆంధ్రదేశంలో ఎక్కువగా యక్షగానాలు రచించడం జరిగింది. అప్పటికే దొరసముద్రపు నటులు వీధి నాటకాలను అనేక రీతులలో ప్రదర్శించినట్లు, అలాగే కూచిపూడి భాగవతులు, జంగాలు వీధి నాట కాలను ప్రదర్శిస్తూండేవారనీ తెలుస్తూంది.

యక్షగానాల్లో నాటకోచితమైన రచనా విధానాలు ప్రవేశ పెట్టబడినట్లు సుగ్రీవ విజయం సాక్ష్యంగా చెప్పుకోవచ్చు.

సుగ్రీవ విజయ నాటకంలో కొన్ని కొన్ని పాత్రలలో పాటలు పాడేవారనీ, తక్కిన సంధి వచనాలూ మొదలయినవి ఒకరిద్దరు సూత్రధారులు పఠించడంవల్ల సుగ్రీవ విజయంవంటి యక్షగానాన్ని వీధి నాటకంగా ప్రదర్శించేవారనీ శ్రీ నేల టూరి వెంకట రమణయ్య వంటి చరిత్రకారులు పేర్కొనే ఉన్నారు.

కూచిపూడి భాగవతుల పేరు 15 వ శతాబ్దం నాటికే ప్రచారంలో ఉందన డానికి 1502 నాటి మచ్చుపల్లి కైఫీయత్ ఆధారం. నాటినుంచి నేటివరకూ కూచిపూడివారు ప్రదర్శించేవన్నీ వీధి నాటకాలే.

ప్రధానంగా కూచిపూడి భాగవతుల వారి ఇతివృత్తాలన్నీ పురాణాలకు సంబంధించినవే, ఆధ్యాత్మికమైనవే. నాట్యరూపంలో వీరు ప్రదర్శించే అన్నిటా మనకు భారత, భాగవత, రామాయణ గాథలే ప్రధానం.

వీరి ప్రదర్శనలలో ప్రధానంగా పేర్కొనవలసినవి-త్యాగరాయ కృతులు, జయదేవుని అష్టపదులు, మువ్వగోపాల పదాలు, భద్రాచల రామదాసు కీర్తనలు, నారాయణ తీర్థుల తరంగాలు, సారంగపాణి కీర్తనలు, తుంగతుర్తి కృష్ణదాసు కృష్ణలీలలు, అన్నమాచార్య పదాలు, సింహపురి పదాలు, చిదంబరం ఉషాపరి ణయం, సుబ్రహ్మణ్యకవి ఉషాపరిణయం, గొల్ల కలాపం, భామా కలాపం, దాదినమ్మ వేషం, దశావతారాలు, ప్రహ్లాద పట్టాభిషేకం, పరశురామ స్తవం, రామ పట్టాభిషేకం, బాలగోపాలతరంగం వంటివి మరెన్నో ప్రదర్శనలు ఇస్తూంటారు.

సిద్ధేంద్రుని ఆశీస్సులతో వెలుగొందిన కూచిపూడి భాగోతుల కీర్తి దేశం నలుమూలలా ప్రచారం పొందింది. అగ్రహారాన్ని దానంగా అంది పేరుపొందింది.

# కురవంజి

మన ప్రాచీన కళారూపాలలో చాలా ప్రాచీనమైంది కురవంజి అని కొందరి అభిప్రాయం.

అసలు మన ప్రాచీన కళ కురవంజని పేర్కొనడమూ జరిగింది.

తెలుగు కావ్యాలలో కురవంజి ప్రస్తావన చాలా చోట్లే అగుపిస్తుంది.

కొందరు కొరవంజి అనీ, కురవంజి అనీ పిలువడమూ కద్దు. ఇంకా పరిశోధకుల దృష్టినుంచి ఆలోచిస్తే కొరవంజి పరిణామమే యక్షగానం అనీ చెప్పక పోలేదు.

కురవంజి విశేషాలను గురించిన విషయ సేకరణలో కురవంజి అంటే కొరవజాతి స్త్రీ అనీ, ఎరుకలు చేసే నాట్య విశేషమనీ చెప్పబడింది.

పదహారవ శతాబ్దిలోనే కురవంజి నృత్య విశేషం ఉందనీ, అప్పటికే అది చాలా ప్రాచీనమయిందనీ అంటున్నారు.

అయ్యలరాజు రామభద్రుడు రామాభ్యుదయంలో 'జక్కణి కొరవంజి మేళముల గేళికలు సల్పిరి' అని పేర్కొనడంచేత అప్పటికే చాలా కాలంగా కొరవంజి నాట్యం చాలా ప్రాచుర్యం పొందిఉన్నట్లు ఊహించవచ్చు.

ఎరుక చెప్పడం మనకు తెలిసిందే-అంతేనా ? స్తంభన, వశీకరణ, ఆకర్షణ, సాముద్రికం - ఇలాంటి విద్యలెన్నో తెలుసు.

ప్రప్రథమంలో విడిగాఉన్న కురవంజి పాత్ర ఏనాడు, ఎలా దృశ్య కావ్యాలలో ప్రవేశించిందో ఇదమిత్థంగా ఇదీ అని చెప్పలేము.

ఈ కురవంజులలో రెండు విభాగాలు గోచరిస్తున్నాయి. అంటే శృంగార కురవంజులు, వేదాంత కురవంజులు అన్నమాట.

అక్కడ కొన్ని విషయాలను పరిశీలించక తప్పదు.

శృంగార కురవంజులు - అన్నప్పుడు నాయికా నాయకుల ప్రణయానికి సంబంధించినదన్నమాట.

వీటిని ఒకటి, రెండు మూడు భాగాలుగా విభజన చేసుకోవలసి ఉంటుంది.

1. కొరవ నాయకుల ప్రణయాన్ని మాత్రమే చిత్రించే కొరవంజి. వీటి క్రిందకు వచ్చేవి - ఉదాహరణకు గరుడాచల యక్షగానం, కిరాత విలాసం. ఈ తరహా కురవంజిలో కురవంజి సోది చెప్పదు.

2. ఇందులో రెండో రకం ఉంది. ఈ రకం శృంగార కురవంజులలో ఏ పార్వతీదేవో, కథానాయకుడో కురవంజి వేషంలో వెళ్ళి నాయికకు సోది చెప్పడం ఆన్నది ఉంటుంది. అంటే - ఇందుకు ఉదాహరణగా తులాభారం, మన్నారుదాస విలాసాలను పేర్కొనవలసి ఉంటుంది.

3. మూడవ రకం కొరవంజి ఉంది. ఆ కొరవంజిలో ఎరుకత మామూలు ఎరుకతేగాని దేవగణానికి చెందిందికాదు.

ఇక వేదాంత కురవంజిని గురించి చెప్పవలసివస్తే - ఇది ప్రధానంగా వేదాంత బోధకు సంబంధించి ఉంటుంది.

## కలాపాలు

ప్రజలలో పుట్టి, ప్రజల ఆదరణతో పెరిగి, ప్రజల కళలుగా అనుక్రమంగా వస్తూన్నవే ఈ కళలు. మన జాతి సామాజిక, సాంస్కృతిక జీవన విధానంతో పెనవేసుకొని ప్రజా జీవితాలను ప్రతిబింబిస్తూంటాయి కనుకనే యివి జానపద కళారూపాలుగా చెప్పబడుతున్నాయి.

ఒకనాటి మన సంప్రదాయాలు ఏమిటి ? ఆనాటి సామాజిక, రాజకీయ, కళాత్మక విలువలు ఎలా ఉండేవి ? అని తెలుసుకోడానికి ఈ జానపద కళా రూపాలు చూస్తే బోధ పడుతుంది.

ఆనందంతో, ఆవేశంతో ప్రకృతికి పులకించి పలికిన పలుకే పాటై ప్రవహించింది, వేసిన అడుగు నృత్యమై వెలసింది.

జానపద కళారూపాలలో కలాపం చాలా ప్రసిద్ధమూ, ప్రాచీనమూ అయినది.

భామా కలాపం, గొల్ల కలాపం చోడిగాని కలాపం - ఇలా కలాపాలన్న పేరున చాలా ఉన్నాయి.

ఏక పాత్రతో కూడిన నాటకాలనుంచి ద్విపాత్ర, బహు పాత్రలలో కూడిన నాటకాలవరకూ వచ్చాయి. ఏదో ఒక వాయిద్యాన్ని ఉపయోగిస్తూ నాట్యంచేస్తూ ఒక వీరగాధనో, మరో గాధనో గానం చేయడం అన్నది నాటకానికి తొలి రూపంగా మనకు గోచరిస్తుంది.

ఒక్క మాటలో చెప్పుకోవాలంటే యక్షగాన ప్రబంధాలకు రూపాంతరాలే కలాపం, బుర్రకథ, హరికథ.

ఏదో ఒక నాయిక పాత్రను ధరించి ఆడుతూ, పాడుతూ తన కథను తానే మనకు చెప్పే యక్షగాన రూపమే కలాపం.

భామాకలాపం, గొల్లకలాపం వంటివి దేశీకిందకు రావు. మార్గ శాఖకు చెందినవి. అయితే చోడిగాని కలాపం మొదలయినవి దేశీ శాఖకు చెందినవి.

కలాపం అన్నది, కలాప రచనలు అనేది వ్యవహారంలో ఉన్న పేరు.

సరే ! భామా కలాపం, గొల్ల కలాపం మొదలయినవి పేరులోనే కలాప పదాన్ని అలంకరించుకొన్నాయి.

అంతేకాకుండా, కూరాకుల, కురవంజి, దాటిని, దాక్షిణీ, పంతులు వేషాలు మొదలయిన కూడా తమ కథా కథనాన్ని కలాపమనే పేరుతోనే వ్యవహరిస్తూ ఉంటాయి.

కలాపాల ముఖ్య లక్షణం ఆడిపాడి అభినయించడం. పామరులను సైతం ఆకర్షించుకొని, అర్థం అయేలా నిలచిన కలాపాలు - రసాత్మకతను నింపుకొని ఉండడమే ఇప్పటికీ సజీవ కళలుగా నిలిచి ఉండడానికి కారణం.

ఇంతకీ ఈ కలాప ప్రదర్శనలు ఎప్పటినుంచి ప్రచారంలోనికి వచ్చాయి? అని ప్రశ్నించుకొంటే ఇదే సమయమని చెప్పడానికి తగిన ఆధారాలు కనిపించవు. అపూర్వ ప్రచారం తెచ్చిపెట్టినవారుగా కూచిపూడి వారినే పేర్కొనవలసి ఉంటుంది.

చోడిగాని కలాపం - చోడిగాని వేషం - చేతిలో వంకర కర్ర, కాలికి కడియాలు, గోచీ, కంబళీ, అర్ధంగా కట్టిన తల గుడ్డతో చోడిగాడు మనకు ప్రత్యక్షం అవుతాడు.

ఇతగాడి వేషం హాస్యంగా ఉంటుంది. ఆహార్యం - ఒంటినిండా సున్నపు బొట్టులూ, మధ్య నల్ల చుక్కలూ, కాకి ఈకల కుచ్చు ఇదీ ఇతని వాలకం.

పల్లెలలో - దసరా ఉత్సవాలలో గొంతాలమ్మ పండుగలలోని ప్రదర్శనల్లో ఇతగాడిదే అగ్ర తాంబూలం.

ఇతనికి పేర్లు అనేకంగా వినిపిస్తాయి. సోలెగాడు, చోలెగాడు, చోడిగాడు, సింగడని ఇలా పిలుస్తూంటారు.

ఇతగాడి పాత్ర మనకు కొత్త ఏంగాదు. ఆంధ్రజన జీవితంలో-ప్రాచీన కళారంగంలో జీవించి ఉంది.

తోలుబొమ్మల ఆటలో జుట్టు పోలిగాడు, బంగారక్క, అల్లాటప్పగాడులకి ఎటువంటి ప్రాముఖ్యం ఉందో ఈ చోడిగాడిని కలాపంలో అంతటి ప్రాధాన్యం ఉంది. ఇక్కడ జుట్టు పోలిగానికీ, చోడిగానికీ పాత్రలలో కాస్త తేడా ఉంది. బొమ్మలాటలలో అవి హాస్య పాత్రలు మాత్రమే. చోడిగాని కలాపంలో ఇతడు హాస్యగాడూ, కథానాయకుడూ కూడాను. కురవంజి కథా రూపంలో సింగీ సింగని ప్రణయ కలహమే ఈ చోడిగాని కలాపానికి కథా వస్తువు. దీనిని ఎరుకల అసీ పిలవడం కద్దు. దీనిలోని కథా వస్తువైన చెంచులక్ష్మి నృసింహుల వివాహగాథను క్రీ॥శ॥ 1600 ప్రాంతంలో గరుడాచల మహాత్మ్యమనేపేర ఓబయమంత్రి యక్షగానంగా రాశాడు.

## తోలుబొమ్మలు

మన ప్రాచీన కళా రూపాలలో తోలుబొమ్మలు ఒకటి. ఇవి క్రీస్తు పూర్వం 3 వ శతాబ్దినాటికే చాలా ప్రచారంలో ఉన్నాయని తెలుస్తూంది.

తెనుగువారి ప్రాచీన కళా వైదగ్ధ్యాన్ని ఖండాంతరాలకు వ్యాపింప చెట్టిన కళ ఇది. నేడు పాశ్చాత్య దేశాలలో గొప్పగా చెప్పుకొనే ఛాయా ప్రదర్శనాలకు మూలం ఈ తోలుబొమ్మలే.

ఖండాంతరాలకు - జావా, బోర్నియో, సుమిత్ర, బలి, సయాం, కంబోడియా, బర్మా మొదలయిన దేశాలలో - మన దేశంనుంచీ వలస వెళ్ళినవారు- తోలుబొమ్మలను ప్రదర్శిస్తూ, రామాయణం, భారతం మొదలయిన కథలను ఎక్కువగా ప్రదర్శిస్తుంటారు. వీటిని ప్రదర్శించేవారు బొందిలీలు, బొందిలీ క్షత్రియులు, బొందిలీ కాపులు. వీరి భాష మరాఠీ.

వీరికి ఉన్న ఆస్తి ఒక్క తోలుబొమ్మలే. పాల్కురికి సోమనాథుని కాలానికే ఇది వినబడింది. ఈ బొమ్మలను రెండు రకాల చర్మాలతో తయారు చేస్తారు. దేవతా విగ్రహాలకు జింక చర్మాన్నీ, రాక్షస బొమ్మలకు మేకచర్మాన్నీ వాడడం కద్దు.

ప్రదర్శనకు- ఒక తెల్లని తెర, హార్మోనియం, తబలా, కాగడాలు- ఇవీ వస్తువులు. వినాయకుని బొమ్మ తెరమీదకు రావడంతో ప్రార్థన చేయడంతో ప్రదర్శన ప్రారంభం అవుతుంది.

## భజన కూటములు

మన గ్రామాలలో ప్రతిచోటా దేవుని మందిరం- ప్రార్థన మందిరం లేకుండా లేదు. ఇక్కడ నృత్యంచేస్తూ, చిరుతలు, తాళములు పుచ్చుకొని, కాళ్ళకు గజ్జలు గట్టుకొని "హరిలో రంగ హరీ..." అంటూ అడుగులు వేస్తూంటే భక్తి పారవశ్యంలో మునిగిపోతాం.

కూచిపూడి భాగవతులు శ్రీకృష్ణజన్మాష్టమి మొదలయిన పండుగలో అనేక మంది సాతాని భక్తులూ - నామాలు ధరించి, దీపపు సెమ్మ పుచ్చుకొని గానం చేయడం కద్దు.

భజన సమాజములో నృత్యం చేసేవారు 20 మందిదాకా ఉంటారు. ఇటు వంటి భజనలలో నోటితో పాటు, చెక్కలచ్వారా తాళం, గజ్జెలు అలంకరించిన కాళ్ళతో నృత్యం- చూడడానికి, వినడానికి ముచ్చటగా ఉంటుంది,

దీనిని లయతప్పకుండా ప్రదర్శించాలి. శ్రమతో కూడిన కళ. మన భక్తి రస ప్రధానములయిన కళా రూపాలలో భజనలు ఒకటి. హరి భజనలు, పండరి భజనలు-ఇలా మరెన్నో ఉన్నాయి.

## బుర్రకథలు

మన జానపద కళా సంపదకు లోటులేదు. కావలసినన్ని జానపద కళా రూపాలు మనకు ఉన్నాయి.

బుర్రకథలు ఎప్పటినుంచీ ప్రచారంలో ఉన్నాయో సరిగా తెలియదు. కాని రామాయణ కాలానికే - ఇవి ఉన్నట్లు తెలుస్తూంది. మొత్తంమీద బుర్రకథలు చాలా ప్రచారంలో ఉన్న ప్రాచీన కళ. వీటిని జంగం కథలు అంటారు. మత ప్రబోధానికీ, రాజకీయ ప్రబోధానికి, దేశభక్తికీ నిలయంగా ఇవి ఉండేవి. జంగం కథలను ఎక్కువగా జంగాలే చెప్పడంవల్ల వీటికి ఆ పేరు వచ్చింది. ఈ కథలను ఎక్కువగా ప్రచారంలోకి తెచ్చినవారు సిరికి జంగాలు, బురిగె జంగాలూ, సెట్టి బలిజెలు, సెట్టి ఫణిజెలు. ఈతముక్కలవారూ వంశ పారంపర్యంగా ప్రచారం లోకి తీసుకువచ్చారు.

శైవ వైష్ణవ కలహాల కాలంలో ఈ కథకు చాలా ప్రాచుర్యం లభించింది. క్రీ॥ శ॥ 1150 నాటికే ఈ కథలు బాగా ప్రచారంలో ఉన్నట్లు తెలియవస్తూంది.

జంగం కథను సంగీత జానపద కళారూపంగా చెప్పుకోవచ్చు. ఈ కథలకు బహు నామాలు, కథకులకు బహు రూపాలు.

ఒకనాడు శైవ, వైష్ణవ మతాల ప్రచారాలకు, భక్తి ప్రబోధానికీ ఉప కరించిన ఈ బుర్రకథలు ప్రస్తుతం రాజకీయ ప్రచారాలకు ఉపయోగిస్తున్నాయి.

## జానపద కళారూపాలు ఎన్నో - మరెన్నో

జానపద రూపాలలో ఒకొక్క కళను గురించి ఒకొక్క గ్రంథం రాయ వచ్చు. ఇక్కడ స్థలాభావంచేత పేర్లతోనే ముగిస్తున్నాను.

కీలుబొమ్మలు, బుట్టబొమ్మలు, శారదగాండ్రు, మూకాభినయాలు, వీర భద్ర విన్యాసం, జముకుల కథలు, గారడీ ప్రదర్శనలు, డప్పుల కోలాటం, గరగ నృత్యం, పులివేషాలు, కాముని పున్నమి వినోదాలు, గొల్లసుద్దులు, వీరముష్టివారు, ఫకీరు వేషాలు, తుమ్మెద పాటలు, గోండుజాతి నృత్యాలు, విప్ర వినోదులు, బతుకమ్మ, బొడ్డెమ్మ పండుగలు, సాధనాశూరులు, గంటె భాగవతులు, కాటి పాపటివాళ్లు, బైండ్లవాళ్లు, కోలాట నృత్యం, దొమ్మరాటలు, జంతరు పెట్టె, వీధి పురాణం, అశ్వ నృత్యం, పిచ్చుకుంటల కథలు, హరిహరీ పదాలు, ఘటనృత్యం, కాశీకావళ్లు, బుడబుడక్కలు - ఇలా ఒక టేమిటి - తెలుగు కళామతల్లి మణి హారాలుగా ఎన్నో వర్ధిల్లాయి - వర్ధిల్లుతున్నాయి.

ప్రతి కళకూ ఒక చరిత్ర - ఒక ప్రత్యేకత ఉంది

జానపద కళారూపాలు - ఇంకా ఎన్నో మరెన్నో దేశవ్యాప్తంగా ప్రజల మధ్య - ప్రజానందాన్ని అందిస్తూ - ప్రజాకళలుగా వర్ధిల్లుతూనే ఉన్నాయి.

ఒక పట్టుదలతో కూడిన సంస్థ ఏర్పడి - జానపదోద్ధరణకు, కళోద్ధరణకూ నడుంబిగిస్తే - ఆంధ్ర జానపద కళలు తిరిగి విజయ పతాకను ఎగరేస్తాయనడంలో సందేహం లేదు.



# యక్షగానాలు

"ఋగ్రాహ పాఠ్యం ఋగ్వేదా
త్సామభ్యో గీతమేవచ,
యజుర్వేదా దభినయాన్
రసా నాథర్వణాదపి,
వేదోపవేదై స్సంబద్ధో
నాట్యవేదో మహాత్మనా,
ఏవం భగవతా సృష్టో
బ్రహ్మణా లలితాత్మకః"—

ఋగ్వేదంనుంచి వాచకాన్ని, యజుర్వేదంనుంచి అభినయాన్ని, అధర్వణ వేదం నుంచి రసాన్ని, సామవేదం నుంచి సంగీతాన్ని గ్రహించిన బ్రహ్మ నాట్య వేదమనే పంచమ వేదాన్ని ప్రవచించినట్లు భరతముని చెప్పివున్నాడు. అంటే వేదాలలోనే రూపక బీజాలున్న వన్నది మనకు బోధపడుతుంది.

వీథి నాటకాలకు చాలా వయసువున్నట్లుగా హలశాతవాహనుడు రచించిన గాథా సప్తశతి మనకు చెపుతూనేవుంది. సుమారు రెండువేల యేళ్ళకు పూర్వమే వీథినాటక లక్షణాలు, దేశీ వాద్య విశేషాలు వున్నట్లు నాటి శిల్ప ప్రతికృతుల రూపావశేషాలద్వారా మనం గుర్తించవలసి యుంటుంది.

"జగుః కలంచ గంధర్వా నన్వృతు శ్చాప్స రోగణాః
దేవదుందుభయో నేదుః పుష్పవృష్టిశ్చ ఖాత్పతత్
ఉత్సవశ్చ మహానాసీ దయోధ్యాయాం జనాకులః
రథ్యాశ్చ జనసంవాదా నటన ర్తక సంకులాః
గాయనైశ్చ విరావిణ్యోవాదనైశ్చ తథాపరైః
విరేజుర్వీపులా స్తత్ర సర్వారత్న సమన్వితాః
ప్రాదేయాంశ్చ దదౌ రాజా సూత మాగధ వందినామ్;"—

వాల్మీకి రామాయణంలో శ్రీరామచంద్రుని జనన వర్ణన చూడగా, దేశి సారస్వతంగా ప్రచారం పొందిన జానపద రచనలు ప్రచారంలో వుండివున్నట్లు బోధపడుతుంది. రామాయణ, భాగవత చరిత్రలలో మనకు ఈ విషయము తెలియకపోదు.

'గంధర్వుల మధురగానం, అప్సరసల నాట్యం, దేవతల దుందుభి వాద్యము, వీధులలో నటుల నాట్యము, సూత, మాగధ, వందీజనుల వాద్యాలను గురించి పైన వర్ణింపబడింది. ఈ సమయంలో గంధర్వులు గానంచేసినవి గేయాలే కదా? అవే తర్వాత తర్వాత దేశకాల పరిస్థితులనూ, ప్రభావాలనుబట్టి రూపు దిద్దుకొని, కొత్త కొత్త రూపాలలో సాక్షాత్కరించి వుండవచ్చును. అది కాకుండా సంస్కృతంలో ఆదికావ్యం రామాయణ మన్నది చర్చలేని విషయం.

నన్నయార్యుని కాలానికి నాటకాదులు ప్రచారంలో వున్నాయనడానికి ఈ క్రింది ఉదాహరణము చాలుననుకుంటాను.

"విమలమతిన్ బురాణములు
వింటిననేకము, లర్థధర్మ శా
స్త్రముల తెరంగెరింగితి
నుదాత్తరసాన్వితకావ్యనాటక
క్రమములు పొకుసూచితి, జ
గత్పరిపూజ్యములైన యీశ్వరా

గమములయందు నిల్పితి ప్ర
కాశముగా హృదయంబు భక్తితోన్''—

అన్న పద్యభాగము ద్వారా మనకు బోధపడుతూనే వుంది.

దీనినిబట్టి ఈతరహా దేశిరచనలు రెండువేల యేళ్ళ క్రితమే ప్రచారంలో వుండి వున్నట్లు మనమూహింపగలము. భాగవతంలో కృష్ణుని జన్మ సమయంలో గోపికలు ఈ తరహా పాటలనే పాడినట్లు దశమ స్కంధంలో వర్ణింపబడి వుంది కూడా. అంతటి ప్రాచీనమయిన దేశి సారస్వత శాఖలో సంగీత రూపక ప్రధానమయిన యక్ష గానములను గురించి కొంచెం చూదాము.

యక్ష గానమనగా దేశీయ ఛందోబద్ధమయిన నాటకము. తంజావూరు నాయకరాజు విజయరాఘవుడు తన యక్ష గానాలను నాటకాలనే పేర్కొన్నాడు. దీనినే పాటగాకూడా పేర్కొనక పోలేదు. 'యక్షగానాల' గురించి ప్రౌఢ్య నిఘంటువులో పాటగా పేర్కొనబడింది. అయితే అప్పకవివ్యుత్పత్తిలో యక్షగానం పాటలు గల ప్రబంధం అయివుండవచ్చునని తోస్తుంది.

ఎందుచేతనంటే అప్ప కవీయములో యక్షగాన ప్రశస్తి వుంది. అందులో అష్ట చంద్రికలూ, త్రిపుట, జంపె, ఆటతాళము, 'వీనయక్ష గాన ప్రబంధంబు లతుకవచ్చు' అని పేర్కొని వున్నాడు. యక్షగానాలు 12 వ శతాబ్ది నుండి ప్రచారంలో ఉన్నా అప్పకవికి పూర్వం ఏ లాక్షణికుడూ కూడా వీటిని ప్రస్తావించలేదు.

శ్రీనాథుని కాలంలో యక్షగానాలు చాలా ప్రచారంలో వుండివున్నట్లు ఈ క్రింది పాఠం వలన మనకు సుబోధకమవుతూంది.

''కీర్తింతు రెద్దాని
కీర్తిగంధర్వులు,
గాంధర్వమున
యక్షగాన సరణి''—

అనియూ సూచించి వున్నాడు !

అదేకాదు. ఈ యక్షగానాలు తెలుగులో సుమారు నాలుగు వందలకు పైగా వున్నట్లున్నా, ఇందులో సుమారు రెండు వందలదాకా ముద్రితము లయినట్లున్నా, మిగిలినవి అ ముద్రిములుగా వుండినట్లున్నా చారిత్రక పరిశోధకులు ఒకరు పేర్కొని వున్నారు.

తరచి చూడగా చూడగా నా ఊహకు తట్టినంతమట్టుకు యక్షగానము సంగీత రూపకము అంటే సరిపోతుందని తోస్తుంది. ఈ యక్షగానాలు చక్కని రసవత్ ప్రబంధాలనడంలో సందేహంలేదు. మచ్చుకు ఒక పరిచయం.

సుగ్రీవ విజయము అనే యక్షగాన ప్రబంధాన్ని కందుకూరి రుద్రయకవి రచించాడు. ఈ యక్షగాన రచనలో రుద్రయ కవి ఏ ఏ దేశి ఛందస్సులను చూపాడో చూడండి. "లేని సంధి వచనాలు, 14 జంపెలు, 11 ద్విపద మాలికలూ: 9 త్రిపుటలూ, 6 అర్ధ చంద్రికలూ, 5 ఆటతాళములూ, 4 గీత ములూ, 2 సీసములూ, 1 ఉత్పలమాల, 1 కురుజంపె, 1 ఏతాళమూ, 1 కందమూ, 1 ధవళమూ, 1 ఏలపదమూ-వున్నవి."

దీనినిబట్టి యక్షగాన స్వరూపం మనం వూహింపగలం. యక్షగానాల గురించి ఇంకా చాలా వివరాలూ, విషయాలూ తెలిసికోవలసి యుంది.

ఈ యక్ష గానాలకు వసంతఋతువు, తంజావూరు రాజులకాలంలో అని చెప్పవలసి వుంటుంది. తంజావూరి రాజుల కాలంలో యక్షగానాలకు మంచి ఆదరణా, ప్రోత్సాహమూ, ప్రోద్బలమూ లభించాయి.

తంజావూరును పాలించిన నాయక ప్రభువు రఘునాథుడు అనేకమైన ఇతర రచనలతో బాటు రుక్మిణీ పరిణయమనే యక్షగానం కూడా రచించాడు. అయితే అది లభ్యం గాలేదు. యజ్ఞనారాయణ దీక్షితుల ప్రాతలను బట్టి ఈ విషయం మనకి తెలిసింది. రఘునాథుడి ఆస్థానంలోనున్న కృష్ణాధ్వరి అనే విద్వత్కవి కళ్యాణ కందర్ప నాటకం రచించాడట. బహుశ అది యక్షగానమై వుండొచ్చనని విమర్శకుల అభిప్రాయం. విజయరాఘవ నాయకుడు దాదాపు ఇరవై యక్షగానాలు రచించాడు. వాటిలో రఘునాథాభ్యుదయం, విప్రనారాయణ

చరితలు అచ్చయినాయి. *"విజయరాఘవుడు తన యక్ష గానములలో త్రిపుటాది తాళములను గేయములతో కూడా ప్రాసియుండినను రగడలను విడిచి దాని స్థానమున దరువు పదము మున్నగు నూతన రచనలను ప్రవేశపెట్టినాడు. అతడు ప్రవేశపెట్టిన మరియొక ముఖ్యమైన మార్పు సంభాషణ పద్ధతి. అంతకు ముందున్న యక్షగానములలో మధ్యమధ్య ఈ పాత్ర ఈ గీతము పాడుచున్నదను కవి వచనములు కానబడుచుండును. ఇదియును ప్రబంధ పద్ధతియే. విజయ రాఘవుడీపద్ధతిని విడిచి సంస్కృత నాటకములందు వలె పాత్రోచితమైన భాషలో నాయకపాత్రల నొండొంటితో సంభాషింపజేసినాడు. తరువాతి వారు పలువురు ముఖ్యముగ రంగాజమ్మ, తమ యక్ష గానములలో నీవిధానమునే యవలంబించి నారు." విజయరాఘవుని పట్టపుకవి కామరసు వేంకటపతి సోమయాజి విజయ రాఘవ చంద్రికా విలాసమనే యక్షగానం రచించాడు. విజయరాఘవుని కుమా రుడు మన్నారు దేవుని హేమాబ్జనాయికా పరిణయం యక్షగానమే.

ఇక్కడ ఒక చిన్న విషయము చెప్పవలసి యుంటుంది. యక్షగానము వేరు, వీధి నాటకము వేరూ అనికూడా ఒక వాదము వుంది. అలా చూసినా యక్షగానాలూ, నాటకాలూ కూడా తంజావూరి రాజుల కాలంలో ప్రదర్శించే వారు.

నాటి రాజులు వీటి ప్రదర్శనలకు చక్కని ఏర్పాట్లు కలుగచేయటమూ, చక్కని ఆదరణ అందివ్వడమూ - యక్షగానాలు ప్రకాశవంతమూ, ప్రచారమూ అవడానికి కారణమయింది. ఆ రోజులలో స్త్రీలుకూడా యక్షగానాలు రచించా రన్నది గమనార్హం. వీరి కాలంలోనే రచించబడిన "మన్నారుదాస విలాసం" రంగాజమ్మ అను కవయిత్రి రచించిందే.

ఈ తరహా యక్షగానాలకే జక్కులపాటలని కూడా పేరువుంది. ఈ నాటికీ రాయలసీమలో అనంతపుర ప్రాంతంలో జక్కుల చెరువు అనే ప్రాంతం, ఆ చుట్టుపట్ల జక్కుల జాతివారూ వున్నారు.

---

* ఆంధ్ర నాట్యము చరిత్రము - డా॥ దివాకర్ల వేంకటావధాని

ఆ జక్కుల్నే కాబోసును- అనాటికే వున్నారు కూడా కాబట్టి- పాల్కురికి సోమనాధుడు పండితారాధ్య చరిత్రలో "అచట గంధర్వ యక్ష విద్యాధరాదులు పాడెడు, నాడెడు వారు" అని పేర్కొన్నాడు.

తెలుగునాడున "వీధినాటకా" లున్నట్లుగానే తమిళదేశంలో "తెరుక్కూత్తు" లనీ, కన్నడదేశంలో "బయలాటము"లనీ వ్యవహారములో వున్నాయి.

యక్షగానమనగా పద్యాలూ, దరువులూ మొదలగువాటితో వుండే సంగీత రూపకం లాంటిదేనని ముందే చెప్పివున్నాను. అయితే ఈ యక్షగానాల్లో వేష ధారణ యక్షవేషాలే వేయడం పరిపాటి !

"ఒకనాడు రాజాంతఃపురాలలో, కలవారి ప్రాంగణాలలో, మార్గనాట క్కాలూ వేశ్యా నృత్యాలూ జరుగుతూ వుండేవనీ, జరిగినాయనీ మనమూహించుకో డానికీ, తలచి అంచనా వేసుకోడానికీ చాలా అవకాశాలు వున్నాయి. సరే ! ఇది యథార్థమే అనుకుందాము. మరి నాటి సామాన్య ప్రజానీకం సంగతి ఏమిటి ? అనేది కూడా మనం చూడవలసి యుంటుంది.

వారికి–అంటే సామాన్య జనావళికి ఆ లోటును లేకుండా తీర్చినది ఈ యక్షగానాలే అని చెప్పుకోవచ్చును. చెప్పవలసివుంటుంది. కూడా! యక్షగాన ప్రాధాన్యాలలో ఇది చాలా ప్రాధాన్యమయింది.

మన వాజ్మయంలో యక్షగానాలకున్న వయస్సు తమిళ, కన్నడ వాజ్మయాలలో వున్నట్లు కనిపించదు.

యక్షగాన ప్రశస్తి ముందుగా మన వాజ్మయంలోనే కానపస్తుంది" అని మన చరిత్ర పరిశోధకుల అంచనా. అది ముమ్మాటికీ నిజంకూడాను! ఈ యక్ష గానాలను మనమంచే ఇతరులు గ్రహించారని చెప్పుకోవచ్చును.

మన వాజ్మయ ప్రక్రియలన్నీ ఇతర భాషా వాజ్మయాలనుంచే గ్రహిం చామని అనుకొన్నా, యక్షగానం మాత్రం మనదనీ. ఈ విషయంలోనైనా

మనము అనుకర్యులము కామనీ గర్వంగా చెప్పుకోవచ్చు అన్న యక్షగాన పరిశోధకులు శ్రీ యస్. వి. జోగారావుగారి పలుకులు గమనించదగినవి!

ద్రవిడభాష యందు మొట్టమొదట కురవంజి అనే దృశ్యరచనలు బయలు దేరినవి. అసలు ఈ కురవలు అనువారు అటవికులు.

వీరు అడుగువేస్తూ నృత్యము చేయడం అలవాటు. "అంజె" అనగా "అడుగు"-అన్న అర్థము వుంది. అందుకే దీనికి కురవంజి అని వాడుక అయింది.

అయితే యక్షగానాలలో గేయములకే ప్రాధాన్యము అయివుంటే, కుర వంజిలో నృత్యం ప్రాధాన్యం వహించింది.

యక్షగాంధర్వాది వేషములు కలిగి, గానప్రధానమై వుండుటచే వీటికి యక్షగానములనే నామప్రచార మొచ్చిందనేది విదితమే.

ఆ యక్షగాన ప్రాచీన ప్రదర్శన కళలో మొదటిదిగా ఓబయమంత్రి రచించిన "గరుడాచలం"ను పేర్కొనవచ్చును. తరువాత కందుకూరి రుద్రయ రచించిన "సుగ్రీవ విజయం"ను పేర్కొనవలసియుంటుంది.

ఈ సుగ్రీవ విజయము యక్షగానములందు ప్రసిద్ధి, ప్రచారము పొందిన కృతి. ఇందలి కథ రామాయణములోనిది.

పోతే ఈ 'సుగ్రీవ విజయము'నకు అంతటి ప్రసిద్ధి యక్షగానాలలో రాపడానికి కారణం దేశిరచన అవడమూ, గేయ రూపంలో రచించబడటము.

మచ్చుకు ఒక చరణం చూద్దాం.

"తరణి కులమున బుట్టి
శరచాపములబట్టి
తరుణి గోల్పడుకంటె,
మరణమే మేలు
నను శౌర్యవంతుడని తన వుత్రి నిడినట్టి,
ఉనకవిభు డీవార్త విని వగువకున్నె"

తరుణిని కోలుపోయిన శ్రీరామచంద్రుని మనస్సునందలి బాధను హృదయకవి చాలా చక్కగా చూపించినాడు.

అసలు ఈ దేశీయ రచనలలోనే అంతటి మహత్తూ, హుందా కనిపిస్తుంది. అందుకే అనుకుంటాను నన్నెచోడుడూ, పాల్కురికీ జానుతెనుగునే కవిత్వం చెప్పారు.

"సరళముగాగ భావములు
జానుతెనుంగున నింపు
పెంపుతో"—అని

నన్నెచోడుడూ,

జానుతెలుగు 'విశేషప్రసన్నతకు' ననియు ఆరూఢ గద్యపద్యాది ప్రబంధపూరిత సంస్కృత భూయిష్ఠరచనమానుగా సర్వసామాన్యంబుగామి జానుతెనుగుననే యుత్తమకవితా విశేషముల జూపియు సోమనాథుడునూ జానుతెనుగును విశేషముగ గౌరవించిరి.

ఈ యక్షగాన ప్రదర్శనములు ఏ రూపంలో వుంటాయో కూడా మనకు తెలిపినవాడు శ్రీనాథుడు!

".....
ధకధహుదకధజర్ఝరల్
ఝల్లరి యాదిగాగలుగు కబ్ది
పరంపరతాళబద్ధపై
యుల్లసిలం ప్రబంధముల
కొప్పగ నాడుదు రగ్రవేదిపై..."

అని సూచించియున్నాడు.

బసవపురాణంలో పాల్కురికి సోమనాథ కవి యక్షగాన ప్రదర్శనల రూపం ఇలా సూచించి యున్నాడు :

"".....
పాటలుగాగట్టి పాడెడువారు
బ్రస్తుతోక్తుల గద్యపద్య కావ్యముల
విస్తారముగజేసి వినుతించువారు
నటుగాక సాంగభాషాంగ క్రియాంగ
పటునాటకంబుల నటియించువారు"

(బసవపురాణం)

పండితారాధ్య చరిత్రలో పాల్కురికి సోమనాథుడు ఇలా పేర్కొని వున్నాడు :, నాడు ప్రదర్శించిన నాటకాలు సంస్కృత నాటకాలు కాదనీ, యక్ష గానా లనబడే దేశి నాటకాలే యివి అని మనకు సోదాహరణంగా యిచ్చి వున్నాడు - చూడండి :

"భ్రమరులు కౌశెముల్ బయనముల్ మెరసి
రమణ బంచాంగ పేరణయాడువారు,
ప్రమధ పురాతన పటుచరిత్రములు
క్రమమొంద బహు నాటకము లాడువారు,
లలితాంగ రసకళాలంకార రేఖ
లలవడ బహురూప మాడెడువారు,
అమరాంగనలు దివినాడెడు మాడ్కి
నమరంగ గడలపై నాడెడువారు,
ఆ వియద్గతి యక్షలాడెడు నట్టి
భావన ప్రేమకులపై నాడువారు
భారతాది కథలు చీరల మరగు
నారంగ బొమ్మల నాడించువారు
కడు నద్భుతంబుగ గంభసూత్రంబు
లడరంగ బొమ్మల నాడించువారు,
వారట గంధర్వ యక్ష విద్యాధ
రాదులై పాత్రల నాడించువారు"—

(పండితారాధ్య చరిత్ర)

ఈ యక్షగానాలలో చాలా హాస్య ప్రధానమయిన సంప్రదాయక పాత్రలు వున్నాయి. ప్రతి యక్షగానంలోనూ అందలి యితివృత్తం వేరు అయినా హాస్య పాత్రలు ప్రతి దానిలోనూ వుంటాయి. ఈ పాత్రలన్నీ కూడా హాస్యం కోసం ఉద్దేశించబడినవే! రుచులలో ఉప్పుకు ఎంత ప్రాధాన్యం వుందో రసములలో హాస్యం అంత విలువ కలిగినది. అందుకే సంస్కృత నాటకాల నుంచి దేశి రచనలవరకు ఈ హాస్యానికి గౌరవం, విలువ వుంది. ఈ హాస్యం అందరికీ సమానమయింది.

అటు పామర జనం, ఇటు పండిత జనం-యిద్దరికీ వినోదాన్ని యిస్తాయి ఈ పాత్రలు. మన కీ విషయం తోలుబొమ్మలలో బంగారక్క, జుట్టుపోలిగాడు ఘట్టంలో తెలిసినదే!

అసలు ఈ సంప్రదాయిక హాస్య పాత్రలు వీటిల్లో లేకపోతే ప్రేక్షకులకు హుషారు అనేది వుండదు. ఎంతో పెద్దగా వుండే ఈ ప్రదర్శనలకు ముఖ్యంగా హాస్య పాత్రలు చాలా అవసరం.

ఈ హాస్యం కొంత మోటుగానూ, వెగటుగానూ వుంటుందని ఈనాడు మన మెంత ఇదిపడ్డా ఒక నాడు వీటికి ఉన్న గౌరవం చాల పెద్దది.

నాడు రాజాంతఃపురాలలో రాజులకీ, రాణులకీ, పల్లెలలో సామాన్య జనతకీ కూడా సరిసమానమయిన వినోదాన్ని యిచ్చి, చక్కని గౌరవం అందుకున్నవే.

పోతే ఈ హాస్య పాత్రలు విజ్ఞానయుతమయినవి కాకున్నా అవి లేకుంటే ప్రదర్శకులను ఆకర్షించలేమన్నది గుర్తించబట్టే నాటి నాటక కర్తలు ఈ సంప్రదాయిక పాత్రలను విడువక పోషించారు.

తోలుబొమ్మలలో లాగనే యక్షగానాలలోనూ, తత్ రూపాంతరములయిన గొల్ల, భామ కలాపములు, కురవంజులు మొదలగు వానిలోనూ కొన్ని కొన్ని పాత్రలు హాస్యరస ప్రధానములే.

ఈ తరహా హాస్యరస ప్రవృత్తి కలిగిన ఒకటి రెండు పాత్రలు పరిచయం చేయడానికి ప్రయత్నిస్తాను.

అన్ని కాలాలలోనూ అన్ని తరహాల ప్రజలనూ పక్కున నవ్వించకలిగింది హాస్యం! నవ్వని, నవ్వలేని, నవ్వురాని మానవుడు వుంటాడనుకోను! హాస్యం లేనిదే శృంగారమే లేదేమో! అందుకే మన లాక్షణికులు హాస్యం శృంగారానికి మైత్రీ రసమన్నారు. ముఖ్యంగా హాస్యరసం నాటకంలో ముఖ్యం. అందుకే హాస్యపాత్రలను ప్రతి నాటకంలోనూ ప్రవేశ పెట్టారు. ప్రేక్షకుల కా వినోదాన్ని కలిగించే ఉద్దేశంతోనే సంస్కృత నాటకాదులలో విదూషకుని పాత్రను సృష్టించింది.

సంస్కృతంలో విదూషకుని పాత్రే పాశ్చాత్య దేశంలో 'కోర్టఫూల్', 'కోర్టజెస్టర్', 'బఫూన్' లు. వీటికి సరిపోలినవే తోలు బొమ్మలలో 'జుట్టుపోలిగాడు', 'గాంధోలిగాడు', 'బంగారక్క', యక్షగానాలలో 'కోణంగి', కురవంజులలో 'సింగీ, సింగడు'—

అలాగే 'మాధవి' పాత్ర! కూచిపూడివారి సృష్టి! ప్రతి భామాకలాపంలోనూ యితడు మనకు ప్రత్యక్షమవుతాడు!

విదూషకునిలాగ హాస్య ప్రసంగాలూ, కథనూ నడిపిస్తాడు. పాత్ర పరిచయాలూ పల్లిస్తాడు.

మాధవి అచ్చు ఎలాగుంటాడో శ్రీ యస్వీ జోగారావుగారు పరిచయం చేశారు. "ఇత డచ్చు మచ్చు సింహళదేశపు నృత్యరూపకం - 'కోలంనాటిమా'లోని 'తోరాతరు కథాకారయ' లాంటివాడు. బర్మాదేశపు వీధినాటకము 'నిభబికిస్' లో 'లూ - బయట్' లాంటివాడు.

మొత్తం మీద ఈ మాధవి పాత్ర చాలా ప్రాముఖ్యం కలిగింది. కథకు కలసివచ్చే పాత్ర. కేవలం వెనుకనుండి హంగు చేసేవాడు గనుక నాయికా నాయకులకు సహాయకుడుగా వ్యవహరించే పాత్ర మాధవి. వెటకారాలు విసరటంలో యితడికి ప్రత్యేక స్థానం వుంది.

ఈ హాస్యరస ప్రాధాన్యములయిన నాటకాదులలో ఈ తరహా పాత్రలకు రకరకాల రూపాలు చూపారు. కాని మొత్తంమీద అన్నీ సరిసమానంగానే వుంటాయి. చూదాం సంస్కృత నాటకాదులలో విదూషకుడు ఎలా వుండేవాడో.

ఈ విదూషకుని ప్రత్యేకత నవ్వు పుట్టించడం. కాని ఆకారాన్ని, వింత సంభాషణలూ తెచ్చి పెట్టుకొని వినోదింపదిచేయడం యితనిలో గొప్పతనం.

ఈ విధంగా రాజాస్థానాలలో పూర్వం వినోదం కోసం కొంత మందిని పోషించేవారు. పాశ్చాత్యదేశాలలో 'కోర్టుఫూల్', 'కోర్టు జెస్టర్' అనే వారు యిటువంటివారే. దీని ప్రకారకే విదూషకుడిని, లేక మాధవిని, లేదా సుంకరి కొండడిని తీసుకోవచ్చు ! విదూషకుని రూపం యీ ప్రకారి విధంగా వుండేదని పేరొక్కన్నారు.

భరతముని మత ప్రకారం విదూషకుడు బట్టతల, మరుగుజ్జు, వికార స్వరూపం, గూని, ఎత్తు పళ్ళు, ఎఱ్ఱటి కళ్ళు - కలవాడుగా చెపుతున్నారు.

ఇంకో విధంగా విదూషకుని రూపం యిలా వర్ణించబడింది :

జుట్టు రాగిది, పీచుగడ్డం. మొత్తం మీద ఈ వర్ణనను బట్టి సంస్కృత నాటకాలలో విదూషకుని పాత్ర కేవలము హాస్యం కోసమే సృష్టించినట్లు కనిపిస్తుంది.

సంస్కృత నాటకాలలో విదూషకుని అవతారము అలాగుంటే-మన గొల్ల కలాపాలలో సుంకరి కొండడి వాలకం ఎలాటిదో చూదాం : వీడి వాలకం 'లాలా కన్నయ' దృష్టిలో యిది. యిలా వర్ణించాడు :

"గడితపు చల్వాచల్లడము పైన బిగించి
తగరాణ మెరయగా దట్టి జుట్టి
పిక్కటి బిరుదుగా బిగియుచుందురు గుంటి
చొక్కాయ పిక్కలె నంటదొడిగి

జరికుసుంబారంగు శాలుపాగా మీద
రవగుల్ల కలిల్ల తురాయి చెకిల్ల
గుబ గుబాళించు సౌరభము గుడిమేనలెల్ల
కమ్మి దుప్పటి వేటుగా నమర్చి
కత్తి ఝుళిపించి వరకరాగ్రమున నుంచి
వాడి కొనగోళ్ళ మీసంబు దీడిదీడి
దుండగీడౌచు సుంకరి కొండ డదిగొ
వచ్చె కాబోలు వినవమ్మ వారిజాక్షీ''

ఏతావాతా చెప్పొచ్చేది మన దేశ ప్రదర్శనాలలోని హాస్యపాత్రలు చాలా ప్రాధాన్యము వహించినవనియే ! అంతటి ప్రధానమయి వుండబట్టే అన్నిటా ఆ పాత్రలు మనకు ప్రత్యక్షమై గిలిగింతలతో నవ్వించి, కవ్వించి, మురిపించి, కూర్చున్న చోటునుంచి మనలను, ప్రేక్షకులను కదలకుండా కూర్చోబెడు తున్నాయి.

ఇక హాస్యపాత్రలను విడిచి అసలు విషయంలోకి వద్దాము. నేను మొద టనే సూచించి వున్నట్లు వేషాలు వేసుకొని పాడుతూ ప్రదర్శించే రూపకమే-యక్షగానమన్నది నిర్వివాదాంశం.

దేశి సారస్వతమణియై వెలసిన యీ వీథి నాటక రూపం, యక్షగానాల లోని భాష జీవద్భాష ! వీటిని అంతగా ఎవరూ ఆదరించక పోయినా నిల ద్రొక్కుకుని ప్రచారం పొందాయి. చారిత్రక పరిశోధకులకు ఈ యక్షగానాల లాంటి దేశీయ రచనలు ఒక మ్యూజియంలాంటివి. నాటి ఆచారాలూ, కథలూ, గాథలూ, రూపాలూ, నమ్మకాలూ కళ్ళకు కట్టినట్లు వీటిద్వారా తెలుసుకొనవచ్చును. ఇటువంటి ఈ యక్షగాన రచనలు ప్రాచీన సంస్కృతికి నిలయంగా వెలసిన భాండాగారాలంటే అందంగా వుంటుందనుకుంటాను.

# సాహిత్య సమారాధన

ప్రాజ్ఞన్నయ యుగానికి చెందిన శాసనాలను బట్టి నన్నయకు పూర్వమే తెలుగులో కవిత్వ రచన కొనసాగేదనటం స్పష్టం. ఈ శాసనాల్లో కనిపించే పద్యాలు దేశి పద్ధతికి చెందిన తరువోజలు, మధ్యాక్కరలు, సీసములు మొదలైనవి.

బౌద్ధ యుగ ఘటియలలో ఆంధ్రభాషలో సాహిత్యం మృగ్యమనే చెప్పాలి. ఉన్నది కాస్తా ప్రాకృతంలోనే ఉంది. పైశాచీ భాషలో గుణాఢ్యుడు రచించిన బృహత్కథ, హాలుని గాథా సప్తశతి ఆనాడు వెలుగొందిన సాహిత్య సృష్టికి తలమానికాలు. వీటిలో నాటి సామాజిక జీవితం అన్ని కోణాలలో దర్శనమిస్తుంది.

వివిధ ప్రాంతాల నుండి చేరిన తెలుగు ప్రజలలో అనేకభాషలు వాడుకలో ఉండేవి. అతి ప్రాచీనులైన నాగ యక్ష జాతులవారు తెలుగునే మాట్లాడే వారట! ద్రావిడ భాషల పరిణామ క్రమంలో తమిళ, కన్నడాల తరువాతి స్థానం తెలుగుదే.

క్రీ. శ. ఒకటవ శతాబ్దానికి చెందిన అమరావతి స్తూపంలోని శిలాఫలకం మీద కానవచ్చే 'నాగబు' అనే పదంలో 'బు' అనేది ప్రథమా విభక్తి ఏకవచన అమహత్ప్రత్యయమైన 'ము' యొక్క ప్రాచీన రూపమే. అనంతర కాలానికి చెందిన సంస్కృత, ప్రాకృతాది శాసనాలలో కూడా తెలుగు ప్రత్యయాలు, పదాలు, గ్రామనామాలు, వ్యక్తుల నామాలు కనిపిస్తాయి.

మొట్టమొదటి తెలుగు శాసనం క్రీ. శ. 575 లో రచించబడ్డది. ఇది కడప జిల్లా కమలాపురం తాలూకా ఎర్ర గుడిపాడు గ్రామంలోని చెన్నకేశవ దేవాలయంలో ఉన్నది. దీనిని రేనాటి చోళరాజు ఎజ్జికళ్ ముత్తురాజు వేయించాడు.

తెలుగు భాషకు ఒక విశిష్టత, తెలుగుజాతికి నిండు గౌరవమూ పాదుకొన డానికి చాళుక్య ప్రభువు రాజరాజనరేంద్రుని ప్రోత్సాహం మరువరానిది. ఆదికవిగా ఆంధ్రజాతి నివాళులర్పించే నన్నయ భట్టారకుడు రాజరాజు ఆస్థానం లోనివాడు. ఈయన పంచమ వేదమైన మహా భారత రచనకు పూనుకున్నాడు. భారత యుద్ధంలో అర్జునుడికి శ్రీకృష్ణుడు సహాయపడినట్లు భారత రచనలో నన్నయకు నారాయణ భట్టు సహాయ పడ్డాడు. నన్నయ మిగిల్చిన భాగాన్ని తిక్కన, ఎఱ్ఱనలు వేరు వేరు కాలాంలో పూర్తి చేశారు. ఈ కవిత్రయ కవుల నడిమి కాలంలో శివకవుల వలన దేశి సారస్వతం వైభవోపేతంగా విలసిల్లింది. తిక్కన సోమయాజి తన భారత రచనలో తెనుగు పలుకుబడిని గుప్పించి ప్రజల భాషకు పుష్టిని చేకూర్చాడు. ఎఱ్ఱనకు ప్రబంధ పరమేశ్వరుడనే బిరుదమున్నది. అయితే, తిక్కన, ఎఱ్ఱనల నాటికి ప్రబంధ శబ్దం కావ్యమనే అర్థంలోనే ప్రయుక్త మైందనుకోవడం బాగుంటుంది. తిక్కన తన భారత పర్వాలను ప్రబంధ మండలి అని పేర్కొన్నాడు గదా !

తదనంతరకాలము ప్రబంధమనగానే వర్ణనా బాహుళ్యంతో కూడిన ఒకా నొక తరహా కావ్యమనే అర్థం ఏర్పడింది. ఇటువంటి ప్రబంధాలలో అగ్ర తాంబూల మీయదగినది పెద్దనగారి కృతి.

నాటి కవులలో అధిక భాగం కవిత్వాన్ని రాజుల విలాసాలకి విక్రయించారు. అటు రాజులకీ, ఇటు కవులకీ కూడా నాడు శృంగారమే ముచ్చటగా తోచింది. రాజులను కాదని భగవంతుణ్ణే నమ్ముకున్న పోతన"...కోమల కావ్య కన్యకన్ కూళలకిచ్చి యప్పడుపు కూడు భుజించుట కంటె సత్కవుల్ హాలికులైననేమి" అన్నాడు. ప్రబంధ కవులకు పూర్వుడైన శ్రీనాథుడు మార్గ పద్ధతిలో రచన సాగించినా తెలుగు నుడి సౌరభాన్ని తన కావ్యాల్లో గుప్పుమనిపించిన మాట ఎవరూ కాదనలేరు. మంజరీ ద్విపదలో రచింపబడిన పల్నాటి వీరచరిత్ర శ్రీనాథకృతమే నంటారు. కానీ ఈ కావ్య కర్తృత్వ విషయంలో విభిన్నాభిప్రాయా లున్నాయి.

దేశి శాఖలుగా చెప్పదగినవి జానపద గేయాలు, రగడలు, ద్విపదలు, యక్షగానాలు, స్త్రీలపాటలు, శతకాలు, ఏలలు, చదువులు ఇత్యాదులు. ప్రజా జీవితాన్ని వాస్తవంగా చిత్రించే సాహిత్యమిదేనని నిస్సందేహంగా చెప్పవచ్చు.

ఆచార వ్యవహారాలు, కట్టుబాట్లు, విశ్వాసాలు, విలువలు కళ్ళకు కట్టినట్లు చిత్రించేది జానపద సాహిత్యమే. హంగులేని ఈ సాహిత్యానికి ఆదరణ కొర వడింది. క్రానీ ఈనాడు ఈ సాహిత్యంపై తిరిగి గౌరవం పెరుగుతోంది. కొంతమంది శ్రమించి ఈ సాహిత్యాన్ని గ్రంథస్థం చేస్తున్నారు, పరిశోధనలు జరుగు తున్నాయి. ఇది ఎంతైనా అభిలషణీయం.

తంజావూరు నాయక రాజుల కాలంలో యక్షగాన వాజ్మయం మూడు పువ్వులు ఆరు కాయలుగా వెలుగొందింది. శతక వాజ్మయం విషయమై ప్రజా కవితకు కీర్తిపతాక మెత్తిన యోగి వేమనకు అగ్రతాంబూల మివ్వవచ్చు. తన 'ఆట వెలదుల' ద్వారా సమాజానికి నూతన సందేశా న్నిచ్చాడు వేమన.

ఆంధ్ర సాహితీ ప్రస్థానంలో ఆధునిక యుగానికి చేరుకునే సరికి ధ్రువ తారలా జాజ్వల్యంగా వెలుగొందుతూ మనకి కనిపించే వ్యక్తి కందుకూరి వీరేశ లింగం పంతులుగారు. ముందుగా బాల వ్యాకరణ కర్త చిన్నయసూరిని, ఆయన సలక్షణమైన వచన రచన నీతి చంద్రికను స్మరించుకుని ముందుకు సాగాలి. ఆంధ్ర సాహిత్యానికి ఎనలేని సేవ చేసిన మహానుభావుడు బ్రౌనుదొర తెలుగువారికి ప్రాతఃస్మరణీయుడు. తెలుగు భాషకు, చరిత్రకు, సాహిత్యానికి సేవ చేసిన మెకంజీ వంటి పాశ్చాత్యులలో బ్రౌను దొరను ముందుగా తలచుకోవాలి.

యుగకర్త కందుకూరి వీరేశలింగం గారి బహుముఖప్రజ్ఞ లోకవిదితమే. తెలుగు నవల, ప్రహసనం, జీవిత చరిత్ర మొదలైన ప్రక్రియలకు ఆద్యుడు పంతులుగారే. ఈనాటి వచన రచనా విస్తృతికి ఆనాడు బీజం నాటిన మహా నీయుడు పంతులుగారే. గద్యతిక్కన్న, నవయుగభానుడు అనేవి వీరి సార్థకమైన బిరుదులు.

"నన్నయార్యుని గంటాన, తాణ్మహేంద్రంవారి రత్నాల మేడలో జనిం చిన ఆంధ్రసాహితీ శిశువు-వివిధ కాలములయందు వివిధ కవివరుల పోషణలో నుండి కాలానుగుణముగా మార్పుల నొందుచు, దశదిశల యశశ్చంద్రికలు వెద జల్లుచు, పూర్ణవయస్సుకు వచ్చినపుడు... దేశభాషలందు తెలుగు లెస్స... అని సాహిత్య సమరాంగణ సార్వభౌముని ఆశీస్సులనొంది నేటికిని తన సహజ లావ ణ్యమును, అందచందములను, ఇంపులనూ, సొంపులనూ కోలుపోకుండా వున్నది.

"రాజరాజుని రత్నాల మేడలో తూగుటుయ్యాలలూగి అనేక కీర్తిగౌరవాలు అందుకొని రాయలచేత పసిడి కంకణము తొడిగించుకొన్నది. ప్రాచీనాంధ్ర సాహిత్యమున, సాహితీప్రమదకు ప్రజలు నివాళులెత్తిరి." కాని అది పూర్వపు మాట అన్నారు ఒక వ్యాసకర్త. నిజమే, అది నిన్నటి మాట. మొన్నటి చరిత్ర.

కాని నేడు-కాలచక్రంలో ఎన్నో నూతన రీతులు ఆవిర్భవించాయి. ఎన్నో నూతన ప్రక్రియలు పొడసూపాయి.

నిన్న స్పూత్నిక్ వింత, టెలివిజన్ కొత్త, నేడు వాటిమీద మానవుని ఆధిపత్యం వుంది. కాలానికి కళ్ళెం వేస్తాం అన్న మాట నిన్నను వింతగా వినపడినా నేడు స్వర్గానికి నిచ్చెనవేయగలమన్న ఆశ చిగురింతలు పెడ్తూంది.

అలానే మన ఆంధ్ర సాహితీరంగంలోనూ అనేక మార్పులు, వింతలు, విశేషాలు జరిగిపోయాయి.

కావ్యసృష్టి ఎవరికోసం, ఎందుకోసం? అనే చర్చ ముమ్మరంగా నాడూ నేడూ జరుగుతూనే వుంది. అది తప్పదు. రెండు నూతన ప్రక్రియలమధ్య సంఘర్షణ తప్పదు.

కావ్యపరమార్థం ఏమిటి? ఉత్తమ కావ్యలక్షణం ఎలాటిది? అని.

కవితాలతకు కల్పన బీజం వంటిది, భావన పాదు వంటిది, సాధన దోహదక్రియ వంటిది.

"కవిత్వ తత్త్వమీమాంస నిన్నటిదీ, మొన్నటిదీ, నేడూకూడా జరుగుతూనే వుంది. దీనిని ఒక్కొక్క రొక్కొక్క విధంగా నిర్వచించారు.

"రసాత్మకమైన ఒక్క కావ్యమైనా కావ్యమేనన్నారు. రమణీయార్థ ప్రతిపాదికయైతే అదీ కావ్యమేనన్నారు. అయితే విశ్వశ్రేయః కావ్యం అని వక్కాణించారు మరి. ఈ నిర్వచనాలలో ఏది నిజం? ఏది ముఖ్యం? కావ్యంకాగల రసాత్మకమైన వాక్యమూ, రమణీయార్థాన్ని ప్రతిపాదించే శబ్దవిశేషమూ విశ్వశ్రేయోసాధనకు ఉపకరించవలెననే నియమం ఏమున్నది?

"సరసమైన సాయంకాల వర్ణన రమణీయంగానే వుంచవచ్చును. ఏ రాజునో పొగడిన పద్యంకూడా రసాత్మకంగానే వుండవచ్చును. కాని, అవి విశ్వశ్రేయస్సును సాధించినవా? సాధించినవనుకున్నారు ఆనాటి కవులు. ఎంచు చేతనంటే వారి విశ్వం బహుచిన్నది"— అన్న తాపీ ధర్మారావుగారి పలుకులు కొంచెం చదవండి.

ఇక్కడే శ్రీశ్రీ చటుక్కున మనకు కళ్ళముందు కనిపిస్తాడు. కవిత్వమును గూర్చి శ్రీశ్రీ ఏమన్నాడో కూడా కొంచం చూద్దాం.

కదిలేదీ, కదిలించేదీ
మారేదీ, మార్పించేదీ
పాడేదీ, పాడించేదీ
పెనునిద్దుర వదిలించేదీ
మునుముందుకు సాగించేదీ
పరిపూర్ణపు బ్రదుకిచ్చేదీ—

కవిత అని నిరూపించాడు శ్రీశ్రీ. భోగలాలసతలో చంద్రుణ్ణి గురించీ, మలయమారుతాలను గురించీ రాసేరోజులు వెనుకబడ్డాయి అన్నాడు.

అసలు భావకవిత్వపు మార్గానికి మొలకవేసింది శ్రీ రాయప్రోలు సుబ్బారావుగారు.

అయితే యిక్కడ యింకొకవ్యక్తిని గురించి మరువకూడదు. కవిత్వంలో ఛాందస పద్ధతులను వ్యతిరేకించి తెలుగు సారస్వత క్షేత్రంతో నాగలిపట్టి కొత్త సాలు వేసిన మరొక ప్రతిభాశాలి శ్రీ నండూరి సుబ్బారావుగారు. ఆ రోజులలో వీరి ఎంకిపాటలు ఎంత దుమారం లేపినవో గమనార్హం.

ఇక కృష్ణశాస్త్రి గారి మాట అంచరికీ తెలిసిందే. అయన రచనలు అమితా కర్షణ శక్తి కలవి.

నాయనిలోని అప్రయత్న కృతమైన ప్రతిభ, వేదులలోని ధారాళత అందరకూ పరిచితమే అనుకుంటాను.

1930 ప్రాంతాలలో అనుకుంటాను నవ్యసాహిత్య పరిషత్తు ఉద్భవించింది 1920 - 30 మధ్యకాలంలో సారస్వ సంఘాలూ, సమాజాలూ, పత్రికలూ చాలా వెలువడసాగాయి.

సాహితి అనే పేరుతో వెలువడిన పత్రిక సాహితిసమితీ పక్షాన వెలువడింది. తదుపరి సాహితి పేరుతోనూ, సఖి పేరుతోనూ నడుపబడ్డాయి.

సాహితీ సమితితో పొసగని కారణాన విశ్వనాధవారు స్వంతంగా జయంతి అనే పత్రిక నడిపారు. తదుపరి కాశీనాధునివారి భారతి వచ్చింది. నేటికీ చక్కగా సారస్వతసేవ చేస్తూన్న పత్రిక భారతి.

మద్రాస్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తులు శ్రీ పి.వి. రాజమన్నారుగారు కళ అనే పత్రికను నడిపారు.

దేశంలో రాను రాను సత్యాగ్రహోద్యమం తీవ్రరూపం దాల్చుతూన్న సమయంలో అందరిలోనూ కలిగిన స్వాతంత్ర్య భావనా పటిమ - కవులలోనూ కలిగింది. నాటి పరిపాలకులు హింసను చేబట్టారు. అప్పుడు... మా కొద్ది తెల్లదొరతనమూ ... అంటూ ఆంధ్రదేశాన్ని మారుమ్రోగించాడు గరిమెళ్ళ సత్యనారాయణగారు.

యుద్ధం రోజులు - హిట్లరు దండయాత్ర. ఈ సమయంలో వెలువడిన నూతన ఛందోదర్పణమన దగిన - మహా ప్రస్థానం.

1935-36 కాలంలో అభ్యుదయ రచయితల సంఘం నెలకొనింది. 1940 నాటికి నవ్యసాహిత్య పరిషత్తు సన్నగిల్లడం - ఒక మహా శక్తివంత మయిన సంస్థగా ఆంధ్ర అభ్యుదయ రచయితల సంఘం పెంపొందడం జరిగింది.

కవితకు పనికి రానివస్తువు ఏదీ లేదన్నాడు శ్రీ శ్రీ.

''కుక్కపిల్లా, అగ్గిపుల్లా
సబ్బు బిళ్ళా —
హీనంగా చూడకు దేన్నీ
కవితా మయమేనోయ్ అన్నీ.
రొట్టెముక్కా, అరటితొక్కా
బల్లచెక్కా
... ... ...
తలుపుగొళ్ళెం, హారతి పళ్ళెం
గుర్రపు కళ్ళెం
కాదేదీ కవిత కనర్హం
ఔనౌను శిల్పమనర్ఘం
ఉండాలోయ్ కవితావేశం
కానీవోయ్ రసనిర్దేశం...''

ఇవన్నీ కవితకు మూలాలన్నాడు. వీటినుంచి కూడా కవిత చిగురించాలంటున్నాడు శ్రీ శ్రీ. పాలచెంబులతో పోల్చే స్తన వర్ణన కలవాటుపడ్డ కొంద రికి ఇది వింతగానూ, విడ్డూరంగానూ తోచవచ్చు.

తోచడం వేమిటి - ఆధునిక కవితను మొదట ఎంతమంది దుయ్యబట్ట లేదు?

కవితాప్రయోజనం ... అన్న శీర్షిక క్రింద శ్రీ శ్రీ - ఆరుద్రలకు జరిగిన ప్రసంగంలో శ్రీ శ్రీయే అంటున్నాడు.

''ఆదిలో అవహేళన పాలైన ఆధునిక కవిత అభ్యుదయ మార్గంలో పయనించడం చూసి ఆదరించడం లేదా నేటి మేలుకొన్న జనత—''. ''— కవిత్వం అంటే ఏమిటని, ఎవరికోసం కవిత్వమని, ఎందుకోసం నవత్వం'' అని ఆరుద్ర అడుగుతాడు శ్రీ శ్రీని.

అందుకు సమాధానంగా శ్రీ శ్రీ ...

"మనిషికోసం కవిత్వం
మంచికోసే నవత్వం
... ... ...
నవత్వం ప్లస్ మానవత్వం
ఈక్వల్ టు కవిత్వం —"

అంటున్నాడు వినండి.

నవ్య కవిత్వం పేరిట తొలిరోజులలో కొంత అలజడి జరిగింది. దానికి పూర్వసీసకవి రాజులూ కారకులే — నవ్యకవిత్వా మార్గావలంబులూ కారకులు గానే చెప్పవలసి యుంటుంది.

ఛందశ్శాస్త్రాన్ని ఆధారంగా గొని సీసములూ, ఉత్పలమాలలూ రచించే పెద్దలు నవకవుల గేయాలు కవితే కాదన్నారు. దుయ్యబట్టారు. అందుకు సమాధానంగా అనుకుంటాను— శ్రీ పట్టాభిగారు... వచన పద్యాలనే దుడ్డుకర్ర లతో పద్యాల నడుములు విరగదంతాను ... అన్నారు. కాని శ్రీ పట్టాభిగారూ నేడు రకరకాల మాత్రాఛందస్సులలో రచన సాగిస్తున్నారు.

శ్రీ కె.వి. రమణారెడ్డిగారు వారి భువన ఘోషలో "అభ్యుదయ రచనోద్యమ ప్రారంభదశలో సంప్రదాయ నైరాశ్యం ప్రబలంగా వుండినప్పుడు ఛందోబందోబస్తులను ఛట్ ఫట్ మని త్రెంచాము... కాని వస్తువుయొక్క అవసరాని కనుగుణమయిన ఛందస్సును మనం స్వీకరించక తప్పదు ... ఛందస్సులోకూడా దేశిఛందో రీతులనే అభ్యుదయ కవులు ఎక్కువగా స్వీకరించ వలసివుంటుంది—" అని పేర్కొన్నారు.

శ్రీ శ్రీ ఛందస్సును చులకన చేశాడనే దిక్కూడా వుంది.

"ఛందస్సుల్లా పరిష్వంగం వదలి
వ్యాకరణాల సంకెళ్ళను విడిచి
పదండి ముందుకు—"

అన్నాడని.

1955 సంవత్సరంలో ఆంధ్ర అభ్యుదయ రచయితల మహాసభలో వాడుక భాషకూ - మాత్రా ఛందస్సుకూ అవినాభావ సంబంధం వుందని పేర్కొన్నాడు - ఇది కూడా గమనార్హం.

శ్రీ శ్రీ ఛందస్సుకు బానిసత్వం వహించడు-తన గీతాలను కదంతొక్కినట్లునూ, తన ఛందో మార్గాలవెంట - మాత్రా ఛందస్సును అనుసరించి కదం తొక్కించాడు - సీసములు రచించి ''ఛందస్సుమాది ఎంత ఇంపుగా వుంద''ను కొనే పెద్దలకు పిచ్చి ఎక్కించాడు.

నేడు పైకి కాకపోయినా లోపలే అనుకోండి - మహా ప్రస్థాన గేయాలను చూసి ఎలా నడిపాడురా పదాలనూ, భావాన్నీ, మాత్రలనూ అనుకోనివారు లేరంటే అతిశయోక్తి కాదు.

---కాని శ్రీ శ్రీని కొత్తలో చులకన చేసినా ఈనాడు శ్రీ శ్రీది ఒక యుగం-నవ్యకవితాచార్యుడు - నాటి శ్రీ శ్రీ నవ్యకవితా ప్రక్రియ నేడు మహాసంస్థ.

అప్పుడే ప్రజానాట్య మండలి పేరుతో ఒక నాటక సమాజం ఏర్పాటైంది. రాజకీయ సమస్యలనూ, సాంఘిక పరిస్థితులనూ ఎత్తుకొని దేశభక్తి పూరితము లయిన రచనలు వెలువడ సాగాయి.

సుంకర, వాసిరెడ్డిగార్ల ... ముందడుగు, మా భూమి, ... ఆత్రేయ ఎన్.జి.ఓ. మొదలగు రచనలు ప్రజలలో ఎంతో ఉత్సాహోద్రేకాలను కలిగించాయి.

అంతదాకా నిజాం రాజరికం క్రింద నలిగి మూల్గులు విడుస్తూన్న - నిద్రాణమైవున్న తెలంగాణా మేలుకొంది. దాశరథీ, కాళోజీ, సి. నారాయణరెడ్డి గారలు ప్రజాశక్తిని వారి గొంతులద్వారా నినదింపచేశారు. వారి కలాలతో రాజరికాన్ని కుళ్ళపొడిచారు.

తెలంగాణా కవి దాశరథి నాటు అన్నమాటలు చూడండి ...

"తరతరాల దరిద్రాల
బరువులతో కరువులతో
క్రుంగి క్రుంగి కుమిలి కుమిలి
కష్టాలకు నష్టాలకు
ఖైదీలకూ కాల్పులకూ
సహనంతో శాంతంతో

బలిపశువై తలవాల్చిన
దీన పరాధీన జాతి
శ్రమికజాతి శ్రమిక జాతి
దెబ్బతిన్న బెబ్బులివలె
మేల్కొన్నది యేల్కొన్నది..."

బాకుల్లా మాటలు పాటల్లో గుచ్చి సందేశం యిచ్చాడు. అదేకాదు—

"ఇదేమాట ఇదేమాట
పదేపదే అనేస్తాను
ఖదం తొక్కి పదం పాడి
ఇదే మాట అనేస్తాను
కోటిన్నర నోటి వెంట
పాటలుగా మాటలుగా
దిగితొమ్మని దిగిపొమ్మని
ఇదేమాట అనేస్తాను
పద్దంటే గద్దె ఎక్కి
పెద్దరికం చేస్తావా?—"

అంటూ ఎంతటి స్వాతంత్ర్యతా భావనతో, విప్లవాశయంతో, ధైర్యంతో నాటి నిజాం రాజరికాన్ని నిలదీసి - నిలవేసి - కడిగేసి వదిలి పెడ్తున్నాడో గమనించండి.

"మూడు కోట్ల చేతులు నీ
మేడను పడదోస్తాయి
మెడ నే విడదీస్తాయి
బరాయెనాం నవ్వాబా
పరాక్రమం చూపేవా?
దిగిపొమ్మని జగత్తంత
నగారాలు కొడుతున్నది
దిగిపోవోయ్ - తెగిపోవోయ్
తెగిపోవోయ్ - దిగిపొవోయ్-"

అని అగ్నిధారలా ఎలా సవాలు పలుకుతున్నాడో చూడండి. అందుకే... విజ్ఞానం ఏప్పుడూ గణితం వైపు దారలు చాచుతుంటే కవిత్వం అనవరతమూ సంగీతం వైపు సాగిపోతూ వుంటుంది... అన్న కాడ్‌వెల్ పలుకులు యిక్కడ గమనార్హములు.

మహా ప్రస్థానానికి చలం రాసిన పరిచయంలో కొన్ని ముక్‌లు వినండి. కవిత్వాన్ని - ముఖ్యం తెలుగు కవిత్వ కన్యల్ని చూస్తే చలానికి ఇంపేషెన్స్, అనుమానం. శబ్దసౌందర్యంతో తృప్తిపడి సంతోషించవలసిందే కాని, చెప్పే దానికి అర్థం వెతకడం ఆవివేకం అని. కాని నీరసపు కళాచతురులమల్లే అందాన్ని దూరం నుంచి చూసి, సంతోషించీ, విచారించీ తప్పుకోడం చలానికి చేతకాదు. తను చెప్పదలుచుకున్న సంగతి తనకే స్పష్టంగా తెలీనప్పుడు తన చేతగాని తనాన్నీ అర్థ అస్పష్టతనీ ఛందస్సు చీరల వెనకా అలంకారాల మధ్యా, కఠిన పదాల బురఖాలలోనూ దాచి మోసగించాలని చూస్తాడు కవి – ముఖ్యంగా సహజ సౌందర్యము తక్కువైనప్పుడు సులభంగా, సూటిగా చెప్పేసి, ఇంత ధ్యానానికీ మౌనానికీ, కార్యాలకీ, విజయాలకీ వ్యవధి యివ్వరాదా అని చలం కోర్కె. ఆ పని స్త్రీలూ చెయ్యరు, దేశ నాయకులూ చెయ్యరు, కవులూ చెయ్యరు - ఎంకీ, శ్రీశ్రీ తప్ప. కవిత్వంలోనూ, జీవితంలోనూ ఎకానమీ ఆఫ్ పర్ట్స్ అండ్ ఫాట్స్ లేకపోవడం దేశభక్తి కన్న హీనమైన పాపం, ఆత్మ లోకంలో దివాలా.

తనకీ ప్రపంచానికీ సామరస్యం కుదిరిందాకా కవి చేసే అంతర్, బహిర్ యుద్ధారావమే కవిత్వ మంటాడు చలం.

శ్రీశ్రీ కవితను గురించి రాస్తూ చలం:- ''నెత్తురూ, కన్నీళ్ళూ తడిపి కొత్త టానిక్ తయారు చేశాడు శ్రీశ్రీ ఈ వృద్ధ ప్రపంచానికి''—అంటాడు.

''హృదయం ఎలా కంపిస్తే ఆ కంపనకి మాటల రూపాల్ని యివ్వడం ఆతనికే తెలుసు. మాటల్ని కత్తులూ, ఈటెలూ, మంటలుగా మార్చడం అతనికే చాతనవును.

''పద్యాలు చదువుతూవుంటే ఇవి మాటలు కావు అక్షరాలు కావు— ఉద్రేకాలు, బాధలు, యుద్ధాలు— అతని హృదయంలోంచి డైరెక్టుగా పంపిన ఉత్సాహాలు—నెత్తురు కాలువలనిపిస్తుంది.

''ఎందుకంటే .....శ్రీశ్రీ అందరి బాధనూ తనలో పలికిస్తాడు ... ప్రపంచపు బాధ అంతా శ్రీశ్రీ బాధ'' అన్న చలం వాక్కులు ఎంత యథార్థము లంటారు.

కవిత గ్రంథానికి తొలిపలుకు రాస్తూ-శ్రీ వేదుల సత్యనారాయణగారు... "దేశ కాలాలను విడిచిపెట్టి ఏ కవి రచనా సాగదు. ఈ అర్ధశతాబ్దిలో సాంఘిక ముగా, రాజకీయముగా స్వాతంత్ర్యము కోసం మన దేశములో ఎన్నో మహోద్య మాలు సాగినవి. వాటి ప్రభావము సాహితీ ప్రవాహాన్ని ఒక మలుపు తిప్పింది'' అని అన్నారు.

నిజమే. కనుకనే — కలం చేతపట్టి, ధైర్యంతో గరిమెళ్ళ సత్యనారా యణగారు మా కొద్దీ తెల్లదొరతనమూ...అని ఎలుగెత్తి చాటారు—ఇది రాజకీయ దాస్యం అనిపించుకోదు. శ్రీశ్రీ అన్నట్లు — ప్రపంచాగ్నికి సమిధ నొక్కటి ఆహుతిచ్చాను అని మహా పోరాటంలో కవిగా గరిమెళ్ళవారు తన కర్తవ్యం నిరూపించుకొన్నారు.

''పదండి తోసుకు
పదండి తోసుకు
పోదాం పోదాం పైపైకి''—
అన్నాడు శ్రీశ్రీ.

"భరత ఖండంబు చక్కని పాడియావు హిందువులు లేగ దూడలై
యేడుచ్చుచుండ తెల్లవారను గడుసరి గొల్లవారు పితుకు చున్నారు బరియ
గట్టి—"

అని చీకమర్తి లక్ష్మీనరసింహంగారు తన రాజకీయ భావాన్ని వ్యక్తీకరించారు.

"దేశమును ప్రేమించుమన్నా
మంచి అన్నది పెంచుమన్నా
.....
దేశమంటే మటికాదోయ్
దేశమంటే మనుజులోయ్..."

అన్న దేశభక్తి ప్రపూరిత గేయం నాటి రాజకీయ వాతావరణానికి నిదర్శనం.

ఈ విధంగా ఎందరో కవులు — తమ కలాలతో కవితలల్లి — గొంతెత్తి ప్రబోధం చేశారు.

సమాజానికీ, సంఘానికీ సందేశం యివ్వడం-అది రాజకీయంగా నయినా సాంఘికంగా నయినా సరే - తప్పుకాదు - నిజమయిన కవి ప్రధాన కర్తవ్యం, నిజమయిన కవిత్వ పరమార్థం అన్ని విధాలా సమాజానికి వెలుగుబాటలు చూపడమే. అందుకే నాడు, నేడూ కూడా నవకవులలో, అభ్యుదయ కవులలో — వారి రచనలలో సంఘం ప్రతిబింబించుతుంది, జనత బాధలూ, ప్రపంచ సమస్యలూ-ప్రతిధ్వనిస్తూంటాయి. అవే వారికి ముఖ్యం - జనతకు కావలసినవి.

ఇరుగుపొరుగు సాహిత్యాల సంపర్కంవల్ల వస్తువులో; భాషలో, రచనా పద్ధతిలో పాతఫక్కీమీద అసంతృప్తి, కొత్త పోకడలపై మోజు పుట్టి సాహిత్య క్షేత్రములో కొత్త కొత్త పైరులు మొలకెత్తినవి.

"కవులు దేశభక్తిని స్వాతంత్ర్యాన్ని జాతీయతను ప్రబోధిస్తూ రచనలు సాగించారు. సామాన్యమానవుల కష్టగుఖాలకూ, దుఃఖానందాలకూ కావ్య ప్రపంచంలో చోటు దొరికింది. వస్తువుతో పాటు భాష, భాషతోపాటు ఛందస్సు ప్రజా జీవిత సమస్యలకు అనుగుణమైన దేశితనాన్ని సేకరించుకొని కొత్త దారులలో కొత్త పోకడలు సాగించినవి" అని కవిత అనే పుస్తకానికి తొలిపలుకు రాస్తూ శ్రీ వేదులవారు అన్న మాటలు గమనార్హం.

ప్రజా వాజ్మయం అనే చింతా దీక్షితులుగారి పుస్తకానికి పరిచయం వ్రాస్తూ "ఈ కృతక భాషావాదులు పూర్వాచారపరులకన్న అంధులు. వాళ్ళకు ఏది చూసినా శత్రుత్వమే. పూర్వాచారాల్లో నిలిచిపోవలసినవి చాలా వున్నాయి. కాని ఈ కృతక భాషలో వుండిపోవలసింది ఏదీలేదు. వీరికి తమకన్న పాతవీ పనికిరావు. తమకన్న కొత్తవీ పనికిరావు. దురదృష్టవశాత్తూ ఈ కృతకవాదులే అధికారంలో వుంటూ వుంటారు" అన్న చలం వాక్కులు గమనించండి.

తెలుగు కవితలో ఛందో వైవిధ్యము వ్యాసంలో దాశరథి...

"కవిత్వానికి వచనం సరియైన వాహనంకాదు. భావన ఎంత బలంగా వుంటే దాని ప్రకటన అంత క్రమబద్ధంగా వుంటుంది. ప్రకటనలోని క్రమమే ఛందస్సు. ఉదాత్తమయిన కవిత్వానికి ఛందోబద్ధాలు అక్కరలేదని ఎంత అనుకున్ననూ, కవిత్వానికి పరిపూర్ణత కలుగడానికి ఛందస్సు తప్పనిసరి. వేద పురుషునికి ఛందస్సే పాదాలన్నారు. నడవడానికి పాదాలు కావాలి కదా? అఖిలాంగాలూ వుండి చరణాలు లేకుంటే మనిషి ఎలా నడవలేడో, అలాగే కవిత్వానికి ఛందస్సు ముఖ్యం.

"ఛందోయుక్తములయిన పదాలు తామరాకుమీద నీటిబొట్లవలె మౌక్తిక స్వరూపం దాల్చుతాయి. తామరాకుమీద నుండి హిమబిందువులు చేతిలోకి తీసుకుంటే మౌక్తిక రూపాన్ని కోల్పోయి నీరుకారుతుంది. అలాగే ఛందస్సును విడగొట్టి వచనంలాగు వ్రాస్తే, కవిత్వం నీరసమైపోతుంది.

"కవితా లక్షణాలలో ఛందస్సు కూడా ఒకటి. కవితా సంపూర్ణతకు ఛందస్సు ముఖ్యమైన ఒక అంగం. కవిత్వానికి ఛందస్సు ఆత్మ కాకున్నా

శరీరం మాత్రం అవును.:. ఒక్కొక్క భావాన్ని ప్రకటించడానికి ఒక్కొక్క రకం నడక కావాలి...'' అంటూ శెలవిచ్చారు దాశరథి.

నూతన ఛందస్సులకోసం జరిగే సత్యాన్వేషణ అన్నా, శ్రీ పట్టాభిగారు వచన పద్యాలన్నా ఏకరూపమైన భావనలోనే వారన్నారని నమ్ముతున్నాను.

అభ్యుదయ వాదులింతగా నూతన ఛందాలన్వేషించి ఉపయోగిస్తున్నామని చెప్పుకొంటున్నా, సంప్రదాయ ప్రియులు కొందరు ప్రతి సభలోనూ, వీలుదొరికినప్పుడల్లా, వీరి కవిత్వంలో ఛందస్సు లేదనీ, ఆ ఛందస్సులకు పేర్లు లేవనీ ఆధిక్షేపిస్తూనే వున్నారు. ''ఇంతకూ ఇంత చర్చ అక్కరలేదనుకుంటాను. కని పెట్టడం, పేర్లు పెట్టడం లాక్షణికులపని గాని; కవులకర్తవ్యం గాదు. లక్షలాదిగా వెలువడుతున్న వచన పద్యాలను భవిష్యత్ లాక్షణికులు పరిశీలించి, తమ నాటికి నిలచిన ఉత్తమ రచనలలోని సుప్రఛందాలకు జాగ్రదవస్థ కల్పించి, వాటిలోని సమాన ధర్మాలను క్రోడీకరించి విమర్శిస్తారు- లక్షణం రచిస్తారు- ప్రమాణీకరిస్తారు. కాలక్రమాన క్రొత్త ప్రమాణాలు జీవద్భాషలో ఉద్భవిస్తుంటాయి. దేశ కాల పాత్రల ప్రభావం ఎప్పటికప్పుడు వాటిని నిర్ణయిస్తుంది. ప్రతి వచనభాగం ఏదో ఒక పద్యభాగం కావచ్చు. ఛందస్తత్వమే అట్టిది. పద్యగద్యాలు పుట్టుకలో సమానమైనవే. ఏక భాష సృష్టిధర్మాలుగా గుర్తింపగల సహృదయులు- వచన పద్యాలను అస్పృశ్యములుగా నిరాదరించడంతో అర్థంలేదు. గద్య పద్యాలకు వైవిధ్యం లేనపుడు, గద్యసాహితి నశించి, పద్యసాహితి మాత్రమే జీవిస్తుందని భావించటం అవ్యక్తుల పని. వచన గ్రంథమైన బైబులు నశించలేదు, పద్య గ్రంథాలయి అజ్ఞాతకవుల రచనలెన్నో యిప్పటికి నశించకపోవనూలేదు... భాషలోని పరిణామక్రమం గుర్తించలేనివారికి సమాధానాలు చెప్పటం ఈ వ్యాస రచనోద్దేశం కాదు. అయినా వచన పద్యాలకు శిక్షను విధింపగల తాహతు మీకు లేదని చెప్పదలచాను.'' అన్న బూదిరాజు రాధాకృష్ణగారి చర్చ గమనార్హం.

శ్రీశ్రీ అభ్యుదయ కవితోద్యమానికి ప్రధానాచార్యుడుగా కదా చెప్పవలసింది ఆయన కవితలను గురించీ,ఎమటి విమర్శలను గురించీ కొంచెం పరికిద్దాము.

.. ఈ క్రింది భాగం ఉస్మానియా ఆర్ట్స్ కళాశాల తెలుగు సంఘం నిర్వహించిన సింపోజినియం సందర్భంగా శ్రీ తెన్నేటి పూర్ణచంద్రరావుగారు చదివిన వ్యాసంలోనిది.

...''కుక్కపిల్లా, అగ్గిపుల్లా, సబ్బుబిళ్లా, రొట్టెముక్కా, ఆరటితొక్కా, బల్లచక్కా, తలుపుగొళ్ళెం, హారతిపళ్లెం, గుర్రపుకళ్లెం... వీని మీదనా కవిత్వం రాయటం అని ప్రశ్నిస్తారు కొంతమంది, వారియూహ కవిత్వమంటే సుందరమైన వస్తువుల్ని గురించి సుందరంగా చెప్పటం. ఈ విమర్శకులు-

'రమ్యం జుగిప్సిత ముందార మధాపినీచం.
ఉగ్రం ప్రసాదిగహనం వికృతంచవస్తు
యద్వ్యాప్యవస్తుక విభావక భావ్యమానం తన్నాస్తియన్నరస భావము పైతిలోకే-'

అంటే 'కాదేదీ కవితకనర్హం- ఔనౌను శిల్పమనర్హం, ఉండాలోయ్ కవితావేశం, కానీవోయ్ రసనిర్దేశం, దొరకదుటోయ్ శోభాలేశం...' అనే మాటల్ని ఎందుకు మరచిపోతున్నారో ఆశ్చర్యం. కళకూ, సౌందర్యానికీ ముడి పెట్టటానికి వీల్లేదు. కళకు సౌందర్యమే ప్రధానమనటం సముచితం కాదు...

నీలా సుందరీ పరిణయాదులు చదివిన మనస్తత్వంతోనే మహా ప్రస్థానం చదివితే అర్థం కాని మాట నిజం- దానికి బాధ్యుడు శ్రీశ్రీ కాడు.

''... కోట్లకొలది ప్రజలను పేదరికం పాలు చేస్తున్న వ్యవస్థను మార్చటానికి ఇష్టంలేక అడ్డుపడేవాళ్ళకు శిక్షను కోరుతున్నాడు. అతను కోరేది,

'స్వాతంత్ర్యం, సమభావం, సౌభ్రాత్రం సౌహార్దం పునాదులై
ఇక్ష్వాకు లేచి జనావళికి శుభం పూచి శాంతి శాంతి కాంతి శాంతి జగమంతా జయిం
చాలి...' అని మాత్రమే.

''శ్రీ శ్రీ రచనల్లో ఆవేశం తప్ప ఆలోచన లేదని నింద. కవితకు ఉద్వేగమే కదా మూలం. శ్రీ శ్రీ పేదలమీద కరుణచేత వారికి బాధలు కలిగించటానికి కారణమైన వారిమీద కోపగిస్తున్నాడు.

'చిరకాలం జరిగిన మోనం
బలవంతుల దౌర్జన్యాలూ
ధనవంతుల పన్నాగాలూ
ఇంకానా ఇకపై సాగవు...'
అని విజృంభిస్తున్నాడు."

ఈ విధంగా శ్రీ శ్రీ కవిత్వ శక్తిని గురించి ఎంతైనా చెప్పవచ్చును. ఒక్క విషయం చెప్పి ముగిస్తాను.

శ్రీ శ్రీ ఆంధ్ర దేశంలోనే కాదు, భారతదేశంలోనే అగ్రస్థానానికి చెందిన కవులు కొద్దిమందిలో ఒకడు. అతడు బహుధా వ్యుత్పన్నుడు. ప్రతిభాశాలి. ఆధునిక యుగలక్షణాలను జీర్ణించుకొని శక్తివంతమయిన రచన చేసిన మహాకవి. మహాప్రస్థానకావ్యం ఆధునికులకు అమర కావ్యంగా నిల్చిపోతుంది.

మా తెలంగాణా కోటిరత్నాల వీణ అని చాటిన దాశరథి - నాటి నిజాం నిరంకుశాన్ని సహించలేకనే—

"ఇదేమాట ఇదేమాట
పదే పదే అనేస్తాను
.....
బరాయేనాం నవ్వాబా
పరాక్రమం చూపేవా
దిగిపొమ్మని జగత్తంత
నగరాలు కొడుతున్నది
దిగిపోవోయ్ దిగిపోవోయ్ ..."

అని ఎలుగెత్తి చాటాడు.

"ఉషస్సుకిప్పుడ కవాటంతోస్తూ
ఒక్కమాటు చూసిం దిటు
తమస్సు పాషాణకిరీటం తీస్తూ

ఒక్కపరుగు తీసిందటు
పదండి అగామిపథమ్ములా
పాడండీ అందాలపదమ్ములా
ఎతండి కాంతి పతాకాలు
ఒత్తండి శాంతి శంఖాలు...''

అంటారు దాశరథి - అరుణారుణ భవిష్యత్తు అవతరిస్తున్నది. నిరాశానిశ తొలగింది. బంగారు భవితవ్యం, శాంతిని పంట పండించుకొందాము - అన్న భావానకి కమనీయకల్పన.

ఒక్కమాట, ఆధునికులు ఛందస్సుని చంపుతారని ఒక ఆరోపణ.

ఆంధ్ర మహాభాగవతంలో పోతన్నగారు...

''శ్రీ మానినీమానచోరా శుభాకార వీరా
జగద్ధేతు హేతుప్రకారా సమస్తంబు
నస్తంగతంబై మహాలోల కల్లోల మాలా
కులాబీల పాధోనిధింగూలగా ...''

పోతన్నగారి దండకంతో ఆధునిక కవి ఆరుద్ర రచన పోల్చండి. తన వేదనా శకంలో, ఆరుద్ర

''అయ్యో ఇలాగేమండుతోందేం ప్రపంచం
విషాదాంతమేనా సమస్తం
ప్రజానీకమంతా సుఖించేదినం వచ్చునో
విచ్చదో బాధతో చచ్చునో
లేచునో గాని...''

ఇప్పుడు ఏమంటారు పురాతనకవులు-నవకవుల రచనలుకూడా విజయం సాధించాయంటారా. విశ్వశ్రేయః కావ్యం అన్నదానికి అర్థం యిందులో వుందంటారా. ఆలోచించుకోవాలి.

వర్తమాన కాలం గురించి కవిత్వం చెప్పండే ప్రవర్తనలు మార్చటం అసంభవం అనకతప్పదు. ఈనాటికీ యింకా గతానికి గబ్బిలాల్లాగ ప్రేళ్ళాడు తున్నవాళ్ళు వేన వేలున్నారు. అదేకథ, అదే ప్లాటు, అదే వర్ణన, ఏదో యథా శక్తి ఉపమానాలు, వాటికైనా పాతవే కొలమానాలు. వెనకచూపువాళ్ళు వెయ్యి మందున్నా, ముందుచూపు కవి ఒక్కడు చాలు. వాడు ఆవశ్యం మేలు కలి స్తాడు — అన్నాడు ఆరుద్ర.

నేటి నవీన ప్రక్రియలను చూడగా చూడగా ఆంధ్రసాహితీ లక్ష్మి ఎంతటి భాగ్యవంతురాలో — ఎంత పుణ్యం చేసుకుందో ననిపించకపోదు - బోధపడక పోదు.

నేడు రకరకాల ప్రక్రియలు - వేరు వేరు దృక్పథాలనుంచి వెలువడు తున్నవి. వాటిని చూసి, తూచి, విలువ కట్టుట మన కర్తవ్యం. మన అందరి బాధ్యతాను.

"సీ. గంటాన కవితను కదను తొక్కించెడి
నన్నయభట్టు లీనాడు లేరు
కలహానకంచుఢక్కల నుగ్గు కావించు
శ్రీనాథులీవేళ లేరు లేరు
అంకాన వాణినోదార్చి జోలలు పాడు
పోతనామాత్యులీ ప్రొద్దు లేరు
పంతాన ప్రభువుని పల్లకీ నెత్తించు
పెద్దననామాత్యులీ ప్రొద్దు లేరు
వాణి నారాణియంచు సవాలు చేసి
మాట నెగ్గించు వీరులీ పూట లేరు....."

అని బాధపడి, విచారించవలసిన అగత్యమూ, అవసరమూ ఎంత మాత్రమూ లేదు. నేటి నవ్యకవితా విజయమును చూసిన ఆ బాధ అనవసరమనే తోపకపోదు.

"పల్లకీ ఎక్కిన రాజు గాదు - ఆ పల్లకీ మోసిన బోయీల చరిత్ర" కావాలన్నాడు శ్రీశ్రీ. అధోజగత్సహోదరుల కోసం కలం పట్టిన అభ్యుదయ కవులు ప్రజల్లో కలిసిపో మెలిసి - కష్ట జీవుల ఆక్రందన ధ్వనుల్లోంచి తమ గీతాలశృతి మేళవించుకున్నారు. చుట్టూ వున్న సమాజం, దాని మంచి చెడులూ, ప్రతి క్షణం సంభవించే మార్పులూ - జరగవలసిన అభ్యుదయం - నేటి కావ్య కర్తకు అవసరమయినై. చెప్పకపోయినా ఫలానిదని నిర్వచించకపోయినా - కావ్య ధర్మం విశ్వశ్రేయస్సు అని ప్రయోరూపకం నిరూపించారీతరం కవులు"- అన్న శ్రీ తాపీ ధర్మారావుగారి పలుకులతో ఈ వ్యాసాన్ని ముగిస్తున్నాను.

నన్నయ మహాభారత రచనతో ప్రారంభమైన ఆంధ్రసాహిత్యోద్యమం నవ్యకవితా ఉద్యమంతో శ్రీశ్రీ మహా ప్రస్థానము వెలియడంతో, ఎంత కీర్తి గడించుకుని ప్రపంచపు అంచులుదాటిన ఆంధ్రకవిత్వ లక్ష్మికీ-అందునా ఆసాహిత్య సమారాధనకు ధర్మములయిన ఆంధ్రాభ్యుదయ కవులకూ ఇవే నా నమోవాకాలు. *

# కిటికి

## (FLASH POETRY)

కవిత్వ పరమావధిని గురించిన విలువల్లో నిన్నటి భావన వేరు; మొన్నటి ఆలోచన వేరు.

ఒకనాడు కవిత్వానికి—అదే రచనకు ఆధ్యాత్మిక భావనో, మత దృక్ప థమో ఆలంబనగా ఉండేది.

అలా పురాణయుగం నుంచి, ప్రబంధ సాహిత్యం నుంచి భావ కవితా మయూరం పింఛం విప్పి, పురి విప్పి లోకాన్ని రంగులమయం చేసిన దశవరకు ఆ ఆలోచనా, సాహిత్యావలోకనం అలా అలా సాగి, రకరకాల నమ్మకాలు, మతాలు, తాత్విక చింతనతో తరంగ విన్యాసం కావించింది.

ఆయా కాలాలలో—ఆయా సమయాలలో రచయిత తన భావనకు అలంకారాలు అద్దాడు; కవితాగంధాలు ఆవిష్కరించాడు.

అయితే, మొన్నా, నిన్నా, ఎప్పుడూ సాహిత్య ప్రస్థానం అనండి, సాహితీ దృక్పథం అనండి ఒకే బాటన నడవనూ లేదు, ఒకేచోట పడి ఉండనూ లేదు.

పరిణామం దాని క్రమం కనుక, మానవుని ఆలోచనకు అది అవలోకనం గనుక !

ప్రబంధ సాహిత్యం మూడు పువ్వులూ ఆరు కాయలూ కాచి రాజాంతఃపురాలను సైతం ఏల గలిగిన సమయంలోనే జానపద సాహిత్యం రసవత్తరమూ, రసప్లావితమూ అయి జనం మధ్య జనపదాల మధ్య విడిగి విస్సారింది.

అందుకే సాహితీ నందనంలో మందారాలూ విరిశాయి, చామంతులూ విస్సారాయి, మల్లెలూ, గులాబులూ గుబాళించాయి.

అలా సాహిత్యంలో ఎప్పుడూ రెండు ధోరణులు ప్రయాణం సాగిస్తూనే ఉన్నాయి.

ఉన్నదానికంటే ఏదో కొత్తను ఆహ్వానించడం మానవునిలో మొదటి నుంచి ఉన్నదే.

శివకవుల ధోరణులకు స్వాగతం పలికారు. విప్లవాత్మక సాహిత్య పరిణామాన్ని ఆహ్వానించారు.

శ్రీనాథకవి రాజును ఆరాధిస్తే, పోతన్న ఆ ఆరాధన కాదన్నాడు.

వేమన్న సరేసరి ! అసలు ఎంత చెప్పాడని కాదు. కావ్యాత్మ ధర్మం—ఏం చెప్పాడు ? అన్నదే కావ్యాత్మ ధర్మం !

సంస్కృతంలో ముక్తకాలనుండి, శతక వాఙ్మయంలో మూడేసి పంక్తులు ఆటవెలదులనండి నేడు మనం పిలుచుకొని కొత్త ప్రక్రియగా చెప్పుకొంటూన్న మినీ కవితలే !

ప్రముఖుల జాబితాలోని వారే ఈ మినీ కవితలను చూసి కాస్త విమర్శిస్తున్నారు.

రానురాను ఈ తరహా విమర్శకులు వారి వాదనను సమర్థించుకోడానికి రకరకాల వాదప్రతివాదాలను రేకెత్తిస్తున్నారు.

నిజమే మరి !

ఒక ప్రక్రియ బహుజనాదరణ, బహుళ ప్రచారం పొందిందీ అంటే—అంతవరకు బహుముఖాలుగా విజృంభించిన ఆధునిక కవితా ప్రక్రియకు ఏం ముప్పు ముంచుకొస్తుందోనన్న భయం, బాధ, గగుర్పాటు కలగడం సహజమే.

నేను ఫ్లాష్ పోయిట్రీ అంటున్నాను వీటిని !

దీనిలో ఆంటే ఫ్లాష్ పోయిట్రీలో విస్తృతమైన భావాన్ని చెప్పలేమన్నేది ఒకటి. కవితకు ఉండే విస్తృతావకాశం, పరిధి సంకుచితమై కుంచించుకుని పోతుందని—ఈ విషయంలో నాకూ కాస్త అనుమానం ఉంది.

కొండ అద్దమందు కొంచమై అన్నట్లు చిన్నదిగా కనిపించినంత మాత్రానే మినీ అనుకోనక్కరలేదు.

వీటిని తీసుకుని ఇందులో కవి భావాన్ని విస్తృతంగా చెప్పడానికి వీలు లేదని దుయ్యపడితే ఏమనుకోవ్వాలి ?

దీర్ఘకవితలు, సుదీర్ఘవచన కవితలూ రాయడంలో చెయి తిరిగిన వారిలో-కొందరికి-ఓ దురభిప్రాయం ఉంది - ఆ! ఏముంది మినీ కవితలో-ఇట్టే రాసెయ్యవచ్చని.

అనడంలో ఉన్న సులువు-రాయడంలో లేదేమో ;

ఫ్లాష్ పోయిట్రీ-మెరుపు కవితలు అందాం-రాయడానికి-విస్తృతమైన భావాన్ని, వస్తువుని కుదించి-ఆటంలా ప్రేల్చడం అన్నది చాలా అవగాహనతో కూడిన పని-దీనికి ధ్వని ప్రధానం. ఎంతో శక్తిమంతంగా గుండెలను కుదిపేట్లు చెప్పడం అన్నది మినీ కవిత ప్రధాన ధ్యేయం.

ప్రస్తుత సమాజ పరిణామాన్ని కవిత్వంలో ప్రతిబింబింప చెయ్యడానికి, ప్రతిధ్వనింప చెయ్యగలగడానికీ దీర్ఘ కవితలోనే విస్తృతావకాశాలు ఉన్నా యనడం, మినీ కవిత్వంలో అందుకు అవకాశాలు మృగ్యమనుకోవడంతో నాకు ఏకీభావం లేదు.

వచన కవిత తత్త్వం వేరు, మినీ కవిత తత్త్వమే వేరు.

ఒక మాటలో చెప్పాలంటే-దానికీ, మెరుపు దాడికీ ఉన్నంత తేడా ఉంది.

ఎలా చెప్పాడు, ఏ విషయాన్ని చెప్పాడు-చెప్పిన నాలుగు పంక్తుల్లో సామాజిక ప్రయోజనం, చైతన్య ధోరణి, స్ఫూర్తినిచ్చే భావోద్వేగం అన్నదే ఇక్కడ ప్రధానం,

మరొక్క విషయం: దీర్ఘ కవిత త్వాత్కాలికంగా ఆనంద్పించినా: హృదయం మీద ముద్రవేసే గుణం దీర్ఘ వచన కవితకు లేదు. అదే నాలుగు పంక్తుల కవ్లెట్ ఫ్లాష్ పోయిట్రీ-నాలుక మీద నృత్యం చేస్తుంది-మళ్లీ ఒకసారి నెమరేసుకుని-ఆలోచింప చేసే గుణం ఈ మెరుపు కవితలలోనే ఉందనిపిస్తుంది.

దీని తత్వమే ఇది !

చదివించడం, ఆలోచింప జేయడం-నోళ్లలో జానపద కవిత్వాల్లా-తిరిగి తిరిగి వినిపించడం.

అందుకే ఈ ఫ్లాష్-పోయిట్రీ యువతరంలో-పత్రికా రంగంలో ఆధునిక సాహితీ ప్రపంచంలో విస్తృత ప్రచారాన్నీ, ఆదరణనీ సాధించుకొంది - ఎంత కాలం నిల్వస్తుంది అన్న దానితో ప్రస్తుతం పనిలేదు.

అభ్యుదయ - విప్లవ, ప్రాచీనవాద కవులైనా కనీసం ఓ మినీ కవిత నైనా వినిపించందే కవి సమ్మేళనంలోనో, సదస్సులోనో ఆదరణ లభించదనే ఆలోచనలో-వారూ చేపట్టారు. కారణం ?

ఈ మినీ కవిత ఏ ఇతర ప్రక్రియకి ప్రత్యామ్నాయమనుకో నక్కర లేదు. వచన కవితలకు మినీ కవితలు విరుద్ధమని గాని, ప్రత్యామ్నాయమనిగాని భావించడం హర్షించదగిన విషయం కాదు.

వస్తు శిల్ప, ధ్వని, భావ-రూపాలలోనే వీటి రెండింటికీ చాలా తేడా ఉంది.

క్లుప్తత, గుప్తత మినీ కవితకు ప్రాణం కావాలి. వాచ్యతా దోషం మరీ ఎక్కువై పోత్తూన్న వచన కవిత్రక్రి వ్యంగ్య వైభవాన్ని సంపాదించి పెట్టింది మినీ కవిత-అంతమాత్రంచేత మినీ కవిత ఒక ఉద్యమంగా నిలచి బట్ట కట్టు తుందా అన్న ప్రశ్నకు కాలం సమాధానం చెప్పాలి.

ఇంతకీ 'మినీ' కవితకు లక్ష్యం ఏమిటి ? లక్షణం ఏమిటి ?

అసలు కవితకు కొలతేమిటి అని ?

భావాన్ని బట్టి కాని, నిడివిని బట్టి కాని కాదుకదా ?

'వాక్యం రసాత్మకం కావ్యం' అన్నాడు.

రసాత్మకమైన ఒక్క వాక్యమైనా కావ్యమే అన్నాడు. కదా మరి !

మూడు పంక్తుల్లలో—అంతదాకా వస్తే రెండే పంక్తులలో—కవితలు కొంతంత భావాన్ని చూపినవి ఎన్ని లేవు?

పెద్ద కవిత వ్రాయలేక మినీ కవిత వ్రాశాడనో, పెద్ద పెద్ద కవితలు ప్రచురించడానికి స్థలాన్ని కేటాయించలేక చిన్ని చిన్ని కవితలను పత్రికల వారు ప్రోత్సహించారనే విమర్శలూ అక్కడక్కడా, అప్పుడప్పుడూ వింటున్నవే.

ఏ పత్రికల వారి కోరికపై మినీ కవిత లనడానికి వీలున్న చాటువులు వ్రాశారని నా ప్రశ్న!

ఏ పత్రికలో చోటు లేక మూడు పంక్తుల్లో పద్యాలు వేమన్న వ్రాశాడు అన్నదీ ప్రశ్నే!

ఆసలు చాలా భావబలం, భాషాధికారం, సమాజావగాహన ఉంటే గాని నాలుగు పంక్తుల్లో బాంబుల్లా ప్రేలే మినీ కవితలు వ్రాయలేరు, తగలవలసినచోట సూటిగా, ధాటిగా తగలగల రామబాణాల్లాంటివి మినీ కవితలు.

అయితే చెప్పవలసిందీ, గ్రహించవలసిందీ ఒక్కటే. నిన్నటి మినీ కవిత్వ రచనకు ఆదర్శం వేరు, ఆలోచన వేరు. నేటి మినీ కవితకు ఆత్మ సామాజిక స్పృహ.

వచన కవిత్వానికి మినీ కవిత పడదని అనుకోవడం కొందరి భ్రమ. వస్తువులో దేని ప్రయోజనం దానిదిగా రెంటూ వికాసం పొందుతాయి. అభివ్యక్తిలో దేని శిల్పం దానిదిగా రెండు ప్రక్రియలూ పరిణామం చెందుతాయి.

మినీ కవితలో చమత్కారం, వైచిత్ర్యస్వయం సమగ్రంగా ఉండవలసిందే. అసలు భావాన్ని, ఆశయాన్ని బాగా చెప్పగలవారికి మినీ కవితలు వేమన సంధించిన బాణాల్లా ఈటెల్లా సూటిగా ధాటిగా నిలవగలవు.

వచన కవితోద్యమం అనంతరం ప్రధానంగా తెలుగు కవితా ప్రక్రియల్లో కొత్త గాలిలా, విప్లవ ఝంఝామారుత్తంలా పరిఢవిల్లి కొండల్ని సైతం పిండి చేయగల సత్తాతో బలవత్తర కవితా శక్తిగా వచ్చిన ప్రక్రియ మినీ కవిత.

ఇక్కడ మరొక్క విషయం చెప్పడం అవసరమనుకొంటున్నాను.

వచన కవిత్వం ఒక ప్రక్రియగా జనంలోకి వెళ్ళడానికి అభ్యుదయ రచయితలు బాగా కృషి చేశారు - అంటే ఈ ప్రక్రియ ద్వారా జనం వద్దకే వెళ్లడానికి ఇది ఉపయోగిస్తుందనే.

విప్లవ కవుల నినాదాలు, వాదాలూ రాజకీయమై చివరకు ప్రజల వద్దకు వచన కవితకంటే ప్రాచీన రూపమైన జానపద ఫణితులతో పాటకే ప్రాధాన్యం ఇచ్చారు.


వచన కవిత్వం ఒక్క రాజకీయ ప్రచారం కోసమే కాకుండా, ప్రకృతి, ఆత్మాశ్రయ కవిత్వాలతో వచన కవిత నిండిపోయింది.

అదే ఇక్కడి దెప్పదలచుకొన్నది. తిలక్ నుంచి మరెందరో వచన కవిత్వంలో అనుభూతి, ఆత్మాశ్రయ ధోరణులను చాల అందంగా చెప్పారు - వచన కవిత్వాన్ని ప్రతికించారు.

అలాగే - సామాజిక చైతన్యంతో పాటు, ఈ ఫ్లాష్ పోయిట్రీ (మెరుపు కవితకి) ఆత్మావలోకనం, ప్రకృతి, అనుభూతి, సౌందర్యం అన్నీ కవితా వస్తువులే అని నా నమ్మకం.

ఏది చెప్పినా ఫ్లాష్ ఉండాలి - ఒక్క మెరుపు, ఒక్క ఉరుములా ధ్వనించాలి.

అటాటి ప్రక్రియ మినీ కవిత! ఫ్లాష్ పోయిట్రీ!



# పరిశీలించిన రచనలు

శతక కవుల చరిత్ర

తాళ్ళపాక కవుల కృతులు

రామదాసు కీర్తనలు

సమాలోచనం


అద్దేపల్లి మినీ కవిత వ్యాసాలు

తోలుబొమ్మల చరిత్ర వ్యాసాలు

ఆరుద్ర ఆధునిక సాహిత్య వ్యాసాలు

సమగ్రాంధ్ర సాహిత్యం

మొదలయినవి.



BLANK PAGE

BLANK PAGE

138

# ఎల్లోరా జానపద సాహిత్యం

మన [illegible]ార వ్యవహారాలు సంస్కృతిని [illegible]ధ్వనించే శిలాశాస నాలవంటివి జానపదగీతాలు. పల్లె పాటల ఉచ్ఛ్వాస నిశ్వాసాలుగా వెలసిన మిగడతరగలు దేశిసారస్వతం- వాటి సమగ్ర స్వరూపం ఎల్లోరా 20 ఏళ్లనాడు రచించిన "మధుర కవితలు" లక్షలాది పాఠకులకు వెన్నెల బాసందీ విందులు చేసిన పరిశీలనాత్మక గ్రంధం అది. రెండు దశాబ్దాల అనంతరం పలురకాలుగా విడిసి విప్పారిన "మధుర కవితలు" కు సమగ్ర విరాట్ స్వరూపం ఎల్లోరా రచించిన మరో బృహత్ గ్రంధం "జానపద సాహిత్యం".

సుమారు 600 పేజీలలో 40 చిత్రాలతో వెలువడిన గ్రంధం.

*Cover Printed at SUPREME ARTS Hyderabad-20.*

## Check List

| | | | |
|---|---|---|---|
| Book Number | GVP0102194 | Date | 19-3-2021 |
| Front Cover | yes | Back Cover | yes |
| Blank Pages | C1, 136, 137 | | |
| Missing Pages | NO | | |
| Prepared | G. Sorathiya | Scanned | Shahina. |
| BOOK SIZE | H 8.4 W 5.4 | Pages | 151 |